
'పారదర్శకతతో పథకాలు
అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా
సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50


సంపుటి: 16
సంచిక: 69

బుధవారం 31-5-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సనాతన ధర్మ పరిరక్షణ
సర్వజన సమాదరణ





'విప్రహిత'
బ్రాహ్మణ సంక్షేమ సదనం
ప్రారంభోత్సవం

గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ కె. చంద్రశేఖర్‌రావు గారి
చేతుల మీదుగా ప్రారంభం

ఉదయం 10.30 గంటలకు, బుధవారం 31 మే 2023
గోపనపల్లి, హైదరాబాద్

సర్వజనుల సంక్షేమం కోసం నిరంతర కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం. దేశంలో ఎక్కడాలేని విధంగా బ్రాహ్మణుల సంక్షేమం కోసం తెలంగాణ బ్రాహ్మణ పరిషత్తును ఏర్పాటు చేసింది. వివిధ పథకాల ద్వారా పేద బ్రాహ్మణుల ఉపాధి కోసం విద్యాభివృద్ధి కోసం చేయూతనందిస్తున్నది. బ్రాహ్మణ సదనం భారతీయ సంస్కృతీ కేంద్రంగా లోక కల్యాణం కోసం సమర్పితం కావాలని ప్రభుత్వం కోరుకుంటున్నది.

బ్రాహ్మణ సంక్షేమం కోసం అమలుచేస్తున్న పథకాలు : -

వివేకానంద విదేశీ విద్యా పథకం

ఉన్నత చదువులకోసం విదేశాలకు వెళ్లే అర్హులైన బ్రాహ్మణ అభ్యర్థులకు గరిష్టంగా రూ.20 లక్షల వరకు ఆర్థిక సహాయం. ఇప్పటి వరకు 780 మంది విద్యార్థులకు రూ.76.67 కోట్ల స్కాలర్‌షిప్‌లు అందజేత.

శ్రీ రామానుజ ఫీజు రీఇంబర్స్‌మెంట్

బ్రాహ్మణ నిరుపేద విద్యార్థులకు ఇంటర్మీడియెట్ ఆపై కోర్సులను ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ వర్తింపు. ఇప్పటి వరకు 436 మంది విద్యార్థులకు రూ.1.14 కోట్లు అందజేత.

వేద,శాస్త్ర పండితులకు గౌరవ భృతి

తెలంగాణలోని 75 సంవత్సరాలు పైబడిన వేద శాస్త్ర పండితులకు రూ.2,500 చొప్పున నెలవారీగా గౌరవ భృతి. ఇప్పటివరకు 64 మంది వేద పండితులకు రూ.53.65 లక్షల అందజేత.

వేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

తెలంగాణలో వేద విద్యను అభ్యసించే విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ప్రతి నెల రూ.250 స్టైఫండ్ అందజేత. ఇప్పటి వరకు 245 మంది వేద విద్యార్థులకు రూ.15.52 లక్షలు అందజేత.

జిల్లాలలో బ్రాహ్మణ సదనాలు

- అన్ని వసతులతో బ్రాహ్మణ సదనాల నిర్మాణ పథకం
- సూర్యాపేటలో రూ.2 కోట్లతో బ్రాహ్మణ సదనం నిర్మాణం.
- ఖమ్మంలో సదనం ఏర్పాటుకు రూ.75 లక్షలు మంజూరు
- మధిర బ్రాహ్మణ సదనం నిర్మాణానికి రూ.73 లక్షల కేటాయింపు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం

అర్హులైన బ్రాహ్మణ కుటుంబాలకు స్వయం ఉపాధి, వ్యాపారాల ఏర్పాటుకు గరిష్టంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం. ఇప్పటి వరకు 5704 మంది లబ్ధిదారులకు రూ.149.77 కోట్లు మంజూరు.

వేద పాఠశాలలకు ఆర్థిక సహాయం

తెలంగాణలోని వేద పాఠశాలలకు వాటి నిర్వహణ నిమిత్తం గరిష్టంగా 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయం ఇప్పటి వరకు 32 వేల పాఠశాలలను గుర్తించి వాటికి రూ.59.50 లక్షలు అందజేత.

పూర్తి వివరాలు మరియు దరఖాస్తు చేసుకోవడానికి
http://brahminparishad.telangana.gov.in
సందర్శించండి

తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తున్నది...

జారీచేసిన వారు : స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

ఒకప్పుడు నడిరోడ్డు మీద ఏదైనా అన్యాయం జరుగుతుంటే చోద్యం చూస్తున్నట్టుగా ఉండటం అనాగరికం. అమానవీయం.
నేడు చోద్యం చూడటం సర్వసాధారణం.
మొన్న ఢిల్లీలో ఒకమ్మాయిని ఒకబ్బాయి కత్తితో పొడుస్తుంటే అందరూ చోద్యం చూస్తూ నిలబడ్డారు.
అదే కాదు, నేడు చాలా సందర్భాల్లో నేరం ఆపగలిగే శక్తి ఉన్నా ఆపడం లేదు.
దీనిని సైకాలజిస్టులు 'బైస్టాండర్ ఎఫెక్ట్' అంటున్నారు.
మనం చోద్య శిఖామణులుగా ఉండల్సిందేనా?



బైస్టాండర్ ఎఫెక్ట్

మీరు చోద్యం చూస్తుంటారా?

మొన్నటి ఆదివారం. సాయంత్రం. 20 ఏళ్ల సాహిల్ 16 ఏళ్ల అమ్మాయితో వాదనకు దిగాడు. చాలామంది ఆ దారిన పోతున్నారు. పట్టించుకోలేదు. సాహిల్ కత్తి తీశాడు. దారిన పోతున్న వారు చూశారు. పట్టించుకోలేదు. సాహిల్ ఆ అమ్మాయిని అనేకసార్లు పొడిచాడు. చచ్చిపోయింది. ఎవరూ అడ్డం రాలేదు. సాహిల్ ఆ తర్వాత ఒక బండ రాయి తెచ్చి ఆమె మీద పదే పదే విసిరాడు. దారిన పోతున్నవాళ్లు చూస్తున్నారు. పోతున్నారు. పట్టించుకోలేదు.

వీరు మనుషులా అనే సందేహం రావచ్చు. మనుషులే. ఆ ఘటనను న్యూస్‌లో చూసి ఆ సమయంలో పట్టించుకోకుండా ఆ దారిన పోతున్నవారిని 'మనుషులా?' అని మనం అనుకోవచ్చు. కాని 'మనం' అక్కడ గనక ఉండుంటే మనం 'కూడా' అలానే బిహేవ్ చేస్తాం. అప్పుడు మనల్ని ఇంకెవరో 'వీళ్ల మనుషులా' అని అనుకుంటూ ఉంటారు. అయితే ఇలాంటి తీవ్రమైన ఘటనలో కూడా మనుషులు ఎందుకు అలా ఉన్నారు అనంటే దానిని మానసిక శాస్త్రంలో 'బైస్టాండర్ ఎఫెక్ట్' అంటారు. సింపుల్‌గా చెప్పాలంటే 'దారిన పోయే దానయ్య స్వభావం' అనొచ్చు.

బైస్టాండర్ ఎఫెక్ట్ అంటే?

'నేను కాకుండా ఇంకెవరో సాయం చేస్తారులే' అనుకోవడమే బైస్టాండర్ ఎఫెక్ట్ అంటే. దీనినే 'డిఫ్యూజన్ ఆఫ్ రెస్పాన్సిబిలిటీ థియరీ' అని కూడా అంటారు. ఎక్కువమంది ఉన్న చోట ఈ 'నాకెందుకులే... ఇంకెవరైనా చేస్తారులే' అనే స్వభావం ఎక్కువ అవుతుందని మానసిక శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. 'ఒక అర్ధరాత్రి ఒక అమ్మాయిని ఒకతను ఇబ్బంది పెడుతుంటే, ఆ దారిన కేవలం ఇద్దరు వ్యక్తులు వస్తుంటే, వారిని చూసి సాయం కోసం కేకలు వేస్తే, ఆ ఇద్దరూ లేదా వారిలో ఒకరు స్పందించే అవకాశం ఎక్కువ. అదే వంద మంది మధ్యలో సాయం కోసం అరిస్తే ఎవరూ సాయానికి రాకపోయే అవకాశం ఎక్కువ. ఇదే బైస్టాండర్ ఎఫెక్ట్ అంటే' అని మానసిక శాస్త్రజ్ఞులు తెలియచేస్తున్నారు. సోషల్ మీడియాలో ఎవరి మీదైనా ట్రోల్ జరుగుతుంటే చోద్యం చూడటం, పక్కింట్లో భార్యను భర్త చితకబాదుతుంటే చోద్యం చూడటం కూడా 'బైస్టాండర్ ఎఫెక్ట్' కిందకే వస్తుంది.

ఎందుకు సాయానికి రారు?

ఒకటి... అందులో రిస్క్ ఉంటుంది... రెండు టైమ్ వేస్ట్.. మూడు ప్రాణాలకు ముప్పు రావచ్చు... నాలుగు ఆ తర్వాత ఏదైనా లంపటం చుట్టుకోవచ్చు... అన్నింటి కంటే ముఖ్యం ఇంతమంది ఉన్నారు నేనే దొరికానా అనుకోవడం. ఇదే సమయంలో సామాజిక శాస్త్రవేత్తలు ఏమంటారంటే 'ఆ ఎదురుగా దాడికో హత్యకో గురవుతున్నది మీ రక్తసంబంధీకులు అయితే ఇలాగే వ్యవహరిస్తారా?' అని. ఎదుట ఉన్నది రక్తసంబంధీకులు అయినప్పుడు ప్రాణాలకు తెగిస్తాం. కాని సంబంధం లేనివారైతే దూరం జరుగుతాం. బాధితుడు ఎవరైనా బాధితుడే కదా అని సామాజిక శాస్త్రవేత్తలు ప్రశ్నిస్తారు.

ప్రతి ఒక్కరూ ఎంతో కొంత చేయొచ్చు

'సరే... సాయానికి వెళితే లేనిపోని ముప్పు రావచ్చు అనుకున్నా ప్రతి ఒక్కరూ ఏదో ఒక సాయం చేసే వీలు ఉంటుంది.. అదన్నా చేయాలి' అంటారు మానసికవేత్తలు. కనీసం పోలీసులకు, అంబులెన్స్‌కు ఫోన్ చేయడం, దాడి చేస్తున్నవాడిని అదిలించడం, ధ్యాస మరల్చడం, రాళ్లు విసిరి గోల చేయడం... ఇలా ఏవైనా చేయొచ్చు. వీటిని చేయడం వల్ల ప్రాణం పోదు. ఏదో ఒక స్పందన చూపాం అనే సంతృప్తి దొరుకుతుంది. 'భయాన్ని దాటితే మనిషిగా పాటించాల్సిన విలువలను గుర్తు చేసుకుంటే సాయానికి దిగాలన్న తక్షణ స్పందన కలుగుతుంది' అని సామాజిక శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 'ఏం చేసినా జనం పట్టించుకోరు' నుంచి 'జనం పట్టించుకుంటారు' అనిపించే సామాజిక మార్పుకు జనమే ఉదాహరణగా నిలిస్తే ఈ స్థితి మారుతుంది.

స్త్రీలు, యువతులు, బాలికలు నిత్యం బయటకు తిరగాల్సిన ఈ రోజుల్లో సమాజం వీలైనంత తొందరగా ఈ చోద్యం చూసే స్వభావాన్ని వదులుకుంటే సమాజానికి రక్షణ దొరుకుతుంది.

> **ఒకరినే ఎంచుకోవాలి**
>
> 'మీ మీద దాడి జరుగుతోంది. చుట్టూ చాలామంది చోద్యం చూస్తున్నారు. మీరు సాయం కోసం అడుగుతున్నా ఎవరూ స్పందించడం లేదు. అప్పుడు గుంపులో ఎవరో ఒకరిని ఎంచుకోవాలి. వారి కళ్లల్లో కళ్లు కలిపి సాయం అడగాలి. మీరు పర్టిక్యులర్‌గా ఒక వ్యక్తిని సాయం అడిగినప్పుడు ఆ వ్యక్తికి తాను స్పందించక తప్పని బాధ్యత వస్తుంది. స్పందిస్తాడు' అని తెలియచేస్తున్నారు మానసిక శాస్త్రవేత్తలు. అంటే గుంపు నుంచి విడగొట్టి అతణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేయాలన్న మాట.





ఫీడింగ్ రూముల కోసం...

ఓ తల్లి పోరాటం

టాయ్‌లెట్‌లో కూర్చొని మనం తినగలమా?
మరి అలాంటప్పుడు తల్లులు తమ పిల్లలకు బహిరంగ ప్రదేశాల్లో పాలివ్వడానికి పబ్లిక్ టాయిలెట్లకు ఎందుకు వెళ్లాలి?
సిగరెట్ తాగడం కోసం స్మోకింగ్ జోన్‌లు ఏర్పాటు చేస్తారు. కానీ, ఆకలితో ఉన్న పిల్లలకు పాలివ్వడానికి ప్రతిచోటా బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్‌లు ఎందుకు లేవు?
అందరి ముందు తమ బిడ్డకు పాలిచ్చే తల్లులు ప్రజల చెడు దృష్టిని ఎందుకు ఎదుర్కోవాలి?

ఢిల్లీవాసి, న్యాయవాది నేహా రస్తోగి ఈ సమస్యల నుండి తల్లులను రక్షించడానికి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా పింక్ టాయిలెట్లు, పిల్లలకు తల్లిపాలు ఇచ్చే గదులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ ఆమె ఈ దిశగా తన ప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉంది. ప్రజల్లో అవగాహన కలిగిస్తూనే ఉంది. ఇంతకీ నేహా రస్తోగి తల్లిపాల ఆలయాలు ఎందుకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. దీని ద్వారా ఆమె ఏం సాధిస్తోంది. లాయర్‌గా ఆమె పోరాటం దేనికి?

ముందుగా తను ఎదుర్కొన్న సమస్యను వివరిస్తూ.. "నేను 2017, అక్టోబరులో మొదటిసారి తల్లిని అయ్యాను. నా బాబుకి మూడు నెలల వయసున్నప్పుడు బెంగళూరు వెళ్లాల్సి వచ్చింది. ఢిల్లీ నుంచి బయల్దేరాలి. గంటల గంటల ట్రాఫిక్ తాకిడిని తప్పించుకుంటూ విమానాశ్రయానికి చేరుకునేసరికి బాబు ఆకలితో ఏడుపు మొదలెట్టాడు. అక్కడ వాడికి పాలు ఎక్కడ ఇవ్వాలో తెలియలేదు.

వాష్‌రూమ్‌లో తల్లి పాలు

తల్లిపాలు పట్టేందుకు విమానాశ్రయంలోని వాష్‌రూమ్‌కి వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత ఫ్లైట్‌లో వాడికి మరోసారి ఆకలి వేసింది. పక్కన కూర్చున్న వ్యక్తిని 'బిడ్డకు పాలు పట్టాలి, కొద్దిగా స్థలం ఇవ్వమని అడిగాను. కానీ, అతను కాదన్నాడు. ఎయిర్‌హోస్టెస్‌ను అడిగితే 'టాయ్‌లెట్‌కి వెళ్లు' అని చెప్పింది. చాలాసేపు ప్రాధేయపడ్డాక ఎయిర్ హోస్టెస్ కూర్చున్న చోట కూర్చుని, పిల్లవాడికి పాలు పట్టాను. బెంగళూరు విమానాశ్రయంలోనూ బిడ్డకు తల్లి పాలు పట్టేందుకు చోటు లేదు. అలా బిడ్డతో నా మొదటి ప్రయాణం వ్యవస్థ నిర్లక్ష్యం కారణంగా చాలా బాధాకరంగా అనిపించింది. గంటల తరబడి నా కొడుకు ఆకలితో ఏడుస్తూ ఉంటే, నేను నిస్సహాయంగా ఉండిపోయాను.


నేహా రస్తోగీ

విషయ సేకరణ

ఈ సంఘటన తర్వాత నేను దేశవ్యాప్త సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డాను. దేశంలో ఎక్కడా చంటి బిడ్డలకు తల్లిపాలు పట్టే గదులు లేవని తెలిసింది. ఈ విషయంపై చాలా మంది మహిళలతో మాట్లాడి, వారి బాధాకరమైన అనుభవాలను విన్నాను. నాలాంటి తల్లులకు బహిరంగ ప్రదేశాల్లో పాలిచ్చే హక్కును కల్పించాలని, అందుకు ఎంత కాలం యుద్ధం చేసినా పర్వాలేదని నిర్ణయించుకున్నా. అదే సమయంలో ఓ ఎంపీ కూడా ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతానని హామీ ఇచ్చారు. అప్పుడే ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్ ఈ కేసు విచారణ సందర్భంగా దేశవ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో లక్షలాదిమంది చంటిబిడ్డలకు తల్లిపాలు ఇచ్చే ఏర్పాటు లేదని తెలుసుకొని ఆశ్చర్యపోయారు. రైల్వేస్టేషన్, బస్టాప్, ఎయిర్‌పోర్ట్, మాల్స్‌తో సహా ప్రతి బహిరంగ ప్రదేశాల్లో తల్లిపాల బూత్‌లు ఏర్పాటు చేయాలని కోర్టును కోరాను. తల్లులు పనిచేసే ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కూడా ఈ సదుపాయాన్ని కల్పించాలన్నాను.

లైంగిక వేధింపులు

బిడ్డలకు చనుబాలివ్వడానికి గదులు అందుబాటులో లేకపోవడంతో తల్లులు రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే తమ పిల్లలకు పాలివ్వాల్సి వస్తోంది. ఈ సమయంలో వారు లైంగిక వేధింపులను కూడా ఎదుర్కోవాల్సి వస్తోంది. తల్లి గౌరవాన్ని దెబ్బతీసే వారు ఆమెను గౌరవంగా చూడరు. కంప్లైంట్ చేస్తే టాయ్‌లెట్‌లో కూర్చొని పాలు ఇవ్వమని సలహా ఇచ్చేవారున్నారు. కానీ, అటువంటి మురికి, దుర్వాసన ఉన్న ప్రదేశంలో కూర్చొని పాలు ఇవ్వడం తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యానికీ ప్రమాదకరం.

ఈ సమస్యకు సంబంధించి అన్ని శాఖలు, ఏజెన్సీలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 2019లో నిర్ణయం తీసుకుని, ఫీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సదుపాయాన్ని కల్పించాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు పంపారు. హైకోర్టు తీర్పు తర్వాత చైనా, అమెరికా, లండన్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మీడియా దానిని కవర్ చేసింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంలో కనీస సౌకర్యాలు కూడా లేవని పెద్ద ఎత్తున చర్చ జరిగింది. హైకోర్టు నిర్ణయం తర్వాత పింక్ టాయిలెట్, బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్ ప్రారంభమైంది. ఇందులో తల్లులకు ప్రత్యేక భోజన గదులు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ తల్లి హాయిగా కూర్చొని బిడ్డకు పాలు పట్టొచ్చు. స్నానం చేసి, బట్టలు కూడా మార్చుకోవచ్చు. ఢిల్లీలో కన్నాట్ ప్లేస్‌లోని పార్లమెంట్ స్ట్రీట్‌లో మొదటి ఫీడింగ్ రూమ్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఆ తర్వాత ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో 700కు పైగా పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు.

ఆలయాల నుంచీ..

షిర్డీలో సాయిబాబా ఆలయం నుండి తాజ్ మహల్ వరకు తల్లిపాలు ఇచ్చే గదులు నిర్మించారు. బస్టాప్‌లు, రైల్వే స్టేషన్‌లలో తల్లి పాల క్యాబిన్లు ప్రారంభించారు. ఇప్పుడు రైల్వేస్టేషన్‌లలోనే కాదు రైళ్లలో కూడా ప్రత్యేక ఫీడింగ్ క్యాబిన్లను తయారుచేస్తున్నారు. ఈ విజయం ప్రభావం దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ కనిపించింది.

తల్లి పాల బ్యాంక్

దేశంలో ఏ ఒక్క తల్లీ బిడ్డ కూడా బహిరంగ ప్రదేశాల్లో ఫీడింగ్ సమస్యను ఎదుర్కోకూడదు. ఈ ఆలోచనతో 'మాతృ స్పర్శ్ ఇనిషియేటివ్ బై అవ్యన్ ఫౌండేషన్' పేరుతో ఒక ఎన్జీవోని ప్రారంభించాను. దీని ద్వారా ఫీడింగ్ రూమ్, తల్లి పాల బ్యాంకు సౌకర్యాన్ని కల్పించే ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాను. ఇప్పుడు చాలా మంది తల్లి పాలు కావాలనే వాళ్లు కూడా సంప్రదిస్తున్నారు. దీంతో తల్లిపాలను దానం చేయాలనుకుంటున్న తల్లుల నుంచి పాలుతీసుకొని, అవసరమైన పిల్లలకు ఇస్తుంటాం. ఈ పనిలో ప్రభుత్వాలు చొరవ తీసుకుంటే, ప్రతి బిడ్డ తల్లి పాలు సులభంగా పొందుతుంది. ఆ దిశగానే ఇప్పుడు నేను ప్రయత్నిస్తున్నాను.

లండన్ యూనివర్శిటీలో జరుగుతున్న పరిశోధనలో నేను వాదించిన తల్లిపాల కేసు చేర్చారు. కేవలం తొమ్మిది నెలల వయసులో పిల్ దాఖలు చేసినందుకు నా కొడుకు అవ్యన్ పేరు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. రొమ్ము లైంగిక అవయవం కాదు. ఇది తల్లి–బిడ్డల మధ్య పవిత్ర సంబంధాన్ని కలిగిస్తుంది. ఈ పోరాటం అంత సులువు కాలేదు. మాది చిన్న కుటుంబం. నా కొడుకు సిజేరియన్ ద్వారా పుట్టాడు. ఈ పోరాటంలో నేను ఆపరేషన్ నుండి చాలా రోజుల వరకు కోలుకోలేకపోయాను. ఇంటి నుండి కోర్టు పనులు పూర్తయ్యేవరకు పిల్లాడిని పట్టుకొనేదాన్ని. సమాజంలో పాతకాలపు ఆలోచనలను మార్చడం పెద్ద సవాల్. ఎంతో మంది మహిళలు కూడా ఎన్ని ఇబ్బందులు పడినా మాట్లాడలేకపోతున్నారు" అంటూ ఈ సమస్య గురించి సుదీర్ఘంగా తన గళం వినిపిస్తారు ఈ లాయర్.

మట్టి కళ

కళాకారులు తమ కళలో ఆసాంతం మమేకం అయ్యాక వారిలోని నైపుణ్యం ప్రతిరోజూ కొత్త ఊపిరి పోసుకుంటుంది.
దీనికి నిలువెత్తు నిదర్శనం అంజనీ ఖన్నా. కుండల కొద్దీ కళారూపాలను మన ముంగిళ్లలో నిలపడానికి కృషి చేస్తున్న అంజనీ ఖన్నా దేశంలోనే కాదు విదేశాల్లోనూ పాటరీ ఆర్టిస్ట్‌గా పేరు ప్రఖ్యాతులు పొందారు.




అంజనీ ఖన్నా

ముంబైలోని అలీబాగ్‌లో ఉన్న సిరామిక్ స్టూడియోలో అంజనీ ఖన్నా రకరకాల కళాకృతుల తయారీలో బిజీగా కనిపిస్తారు. ఆమె కళ మన దేశంలోనే కాదు విదేశాలలోనూ ప్రదర్శితమవుతోంది. ఇటీవలే ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ సిరామిక్స్ సభ్యురాలిగా ఎన్నికయిన అంజనీ ఖన్నా మట్టిపై తనకున్న మమకారాన్ని ఇలా పంచుకున్నారు.

"ఐదారేళ్ల వయసులోనే మట్టిపై మనసు పారేసుకున్నాను. పాతికేళ్లుగా నా స్టూడియోలో సిరామిక్ కళాకృతులను తయారుచేస్తున్నాను. సిరామిక్సే నా ప్రపంచం. కలల ప్రపంచం.. కళా ప్రపంచం.

వేసవి శిబిరం పెంచిన ఆసక్తి

ముంబైలో పుట్టి పెరిగాను. మా అమ్మ నన్ను పెంచడంలో చాలా జాగ్రత్తలు తీసుకునేది. కానీ, చివరకు నీకు ఏది ఇష్టమో అందులోనే ముందుకెళ్లు అని చెప్పింది. ఆమె నన్ను వివిధ సృజనాత్మక కార్యకలాపాలకు పంపుతుండేది. నాకు ఆరేడేళ్ల వయసున్నప్పుడు మా అమ్మ నన్ను సమ్మర్ క్యాంప్‌కి తీసుకెళ్లేది. అక్కడ మట్టి కుండల తయారీ నేర్చుకున్నాను. ఆ తర్వాత పాలిటెక్నిక్ చదివేటప్పుడు సిరామిక్ కుండలు, బొమ్మల తయారీ నేర్చుకున్నాను. చక్రం మీద చేతివేళ్లతో మట్టిని సున్నితంగా కుండ రూపం తీర్చిదిద్దడం చూసి మొదట్లో భయం వేసింది. మట్టి నుండి అంతటి అద్భుతమైన సృష్టి ఎలా జరుగుతుంది అని ఆశ్చర్యపోయేదాన్ని. స్వయంగా కుండ తయారుచేయడం మొదలుపెట్టాక అందులో ప్రయోగాల మీద విపరీతమైన ఆసక్తి పెరిగింది. పుదుచ్చేరి గోల్డెన్ బ్రిడ్జ్ కుండల తయారీని 1971లో డెబ్రా స్మిత్, రే మీకర్ ప్రారంభించారు. కొన్నేళ్లలోనే అది ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది. అక్కడి ఆ పాటరీ ఆర్ట్ నాకు ఒక ప్రేరణగా మారింది. ఆ ఆర్ట్ నేర్చుకోవాలనే ఆసక్తితో పుదుచ్చేరి వెళ్లాను. ఆ పాటరీ కంపెనీలో జాయిన్ అయ్యాను. ఆ కళ నేర్చుకోవడానికి ఏడాదిన్నర కాలం పట్టింది.







చదువుకు కేంబ్రిడ్జ్

పాటరీ ప్రపంచంలో ముందుకు వెళ్లాలనుకున్నప్పుడు అప్పటికే అప్లయ్ చేసుకున్న కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ నుంచి అడ్మిషన్ లెటర్ వచ్చింది. వెళ్లాలా, వదిలేయాలా అనే సందిగ్ధంలో కొన్ని రోజులు గడిపాను. కానీ, ముందు చదువు పూర్తిచేద్దామన్న లక్ష్యంతో ఆ యూనివర్శిటీకి వెళ్లిపోయాను. అక్కడ రెండేళ్లు నేచురల్ సైన్స్ చదివాను. ఆ తర్వాత ముంబై నుంచి ఢిల్లీకి మారాను. అప్పుడే సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ 'డౌన్ టు ఎర్త్' పత్రికలో సైన్స్ ఎడిటర్‌గా పనిచేయడం ప్రారంభించాను. ఐదేళ్లు పనిచేసి, తిరిగి ముంబైకి వచ్చాను. ఈ పదేళ్లలో నా జీవితంలో ఎన్నో మార్పులు వచ్చాయి.

అమ్మ ఇచ్చిన ప్రేరణ

మా అమ్మ మంచి కథకురాలు. దేవుడు, దేశస్వాతంత్య్రం, పోరాట కథలు చాలా చెప్పేది. దేవతా విగ్రహాల ముందు ప్రార్థన చేసుకుంటూ ఉండేది. చిన్ని కృష్ణుని రూపాన్ని అందమైన బట్టలు, పువ్వులు, నగలతో ప్రతి రోజూ అలంకరించేది. నేనూ కూడా ఆ తర్వాత పౌరాణిక మూర్తులను అలాగే అలంకరించడం ప్రారంభించాను. ఆ తర్వాత పర్యావరణ జర్నలిస్టుగా గ్రామ గ్రామాన తిరుగుతూ దేశ చిత్రాన్ని నా మనసులో ముద్రించుకున్నాను. ఏయే ప్రాంతాల్లో ఎలాంటి కళలు ఉన్నాయి, వాటిని కుండల తయారీలో ఎలా చూపించవచ్చో తెలుసుకున్నాను. అయితే, ఈ కుండల ప్రపంచంలో స్థిరపడటం మా నాన్నకు అస్సలు ఇష్టం ఉండేది కాదు. కుండలు చేయడం అమ్మాయిల పని కాదు అనేవారు. అయినా, నా సొంత ప్రపంచాన్ని నేను సృష్టించుకున్నాను. స్టూడియో ఏర్పాటు చేసి, దాని ద్వారా సిరామిక్ కళాకారులకు ఓ వేదికను అందించడమే నా ఉద్దేశం. ప్రజల్లోకి ఈ కళాకృతులను ఎలా తీసుకువెళ్లాలా అని ఆలోచించాను. ముంబైలో జరుగుతున్న కాలా ఘోడా ఆర్ట్ ఫెస్టివల్‌లో కాకుండా పార్కింగ్ ప్లేస్‌ల్లో పింగాణీ కళాకృతుల ప్రదర్శనను ఏర్పాటు చేశాను. మంచి స్పందన వచ్చింది. కళాకృతులు బాగా అమ్ముడుపోయాయి. దీంతో సిరామిక్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెరిగింది. ఎక్కువ మంది ప్రజలు మా స్టూడియోకు వచ్చి కళాకృతులను కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారు.


కొనుగోళ్లూ ఎక్కువే

సిరామిక్ పాటరీ తయారీ చాలా కష్టమైన పని. గతంలో మెటీరియల్ ఖర్చు ఎక్కువ ఉండేది. కానీ, ఇప్పుడు ఇందులో మంచి ఆదాయం వస్తోంది. సిరామిక్ కళారూపాల విక్రయాలు పెరుగుతున్నాయి. ఇంటీరియర్ డిజైనింగ్ కోసం ప్రజలు బాగా ఖర్చు పెడుతున్నారు. ఆన్‌లైన్ విక్రయాలు సిరామిక్ మార్కెట్‌ను పూర్తిగా మార్చేశాయి. కుండల ప్యాకేజింగ్ నుండి విదేశాలకు కొరియర్ షిప్పింగ్ వరకు ప్రతీది సులభంగా మారింది' అంటూ తన సిరామిక్ ప్రపంచాన్ని మన కళ్లకు కడతారు అంజనీ ఖన్నా.

యూత్ పల్స్

యూత్ అండ్ డ్రాగన్

ఫొటో ఎడిటింగ్‌లో మ్యాజిక్ సృష్టించనున్న గూగుల్ వారి 'మ్యాజిక్ ఎడిటర్'పై ఆసక్తి అంతకంతకూ పెరుగుతూ ఉండగానే... యూత్‌కు హాయ్ చెప్పింది డ్రాగన్. ఇమేజ్‌లను ఎడిట్ చేసే పద్ధతిలో ఏఐ ఆధారిత ఎడిటింగ్ టూల్ 'డ్రాగన్' భారీ మార్పు తీసుకురానుందని నిపుణులు చెబుతున్నారు. 'ఫ్యూచర్ ఆఫ్ ఎడిటింగ్'గా పిలుస్తున్న 'డ్రాగన్'పై యూత్ అధిక ఆసక్తి ప్రదర్శిస్తోంది....





ఈ సెల్ఫీల కాలంలో ఫిల్టర్స్, రింగ్‌లైట్స్‌లాంటివి ఉన్నప్పటికీ ప్రతి ఫొటో 'పర్‌ఫెక్ట్' అనిపించడం లేదు. ఇలాంటి సమయంలోనే ఎక్స్‌పెరిమెంటల్ టూల్స్ అవసరం ఏర్పడుతుంది.

ఇటీవల జరిగిన గూగుల్ డెవలపర్ కాన్ఫరెన్స్‌లో 'మ్యాజిక్ ఎడిటర్' గురించి డెమో జరిగింది. ఈ ఏఐ ఆధారిత సాధనంతో ప్రొఫెషనల్ టూల్స్ అవసరం లేకుండానే మేజర్ ఎడిట్స్ చేసుకోవచ్చు. ఫొటోలో బ్యాక్‌గ్రౌండ్‌లో వద్దనుకున్న వ్యక్తులను లేకుండా చేయడం నుంచి పొజిషన్ మార్చడం వరకు ఎన్నో చేయవచ్చు.

'గూగుల్ ఫొటోస్ లాంచ్ అయినప్పటి నుంచి ఏఐ ఆధారిత మార్పులు కొత్తేమీ కాదు. గూగుల్ ఫొటోస్‌లోని బేసిక్ ఎడిటింగ్ టూల్స్ బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్, హెచ్‌డీఆర్(హై డైనమిక్ రేంజ్) మొదలైనవి సుపరిచితం అయినప్పటికీ మ్యాజిక్ ఎడిటర్ ద్వారా డిటెయిల్డ్ ఛేంజెస్‌కు అవకాశం ఉంటుంది' అంటుంది ముంబైకి చెందిన ఎంసీఏ స్టూడెంట్ అన్వీ.

కొత్త కొత్త ఫొటో ఎడిటింగ్ టూల్స్ గురించి తెలుసుకోవడం అన్వీకి ఇష్టం.

ప్రయోగ దశలో ఉన్న 'మ్యాజిక్ ఎడిటర్' పూర్తి స్థాయిలో ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో తెలియనప్పటికీ దీని గురించి యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

'మ్యాజిక్ ఎడిటర్' గురించి మాటా ముచ్చట పూర్తికాకుండానే మెరుపులా రంగం మీదికి వచ్చింది....సరికొత్త ఏఐ ఎడిటింగ్ టూల్ డ్రాగన్. యూత్ ఫ్రెండ్లీ టూల్‌గా పేరు తెచ్చుకోనుందని చెబుతున్న 'డ్రాగన్'పై భారీ అంచనాలు ఉన్నాయి.

'రిప్ ఫొటోషాప్' అంటూ లోరెన్‌జో గ్రీన్ ఒక వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.

ఆ వీడియోలో కనిపించే దృశ్యం: 'డ్రాగన్' సాంకేతికతతో నోరు మూసుకున్న సింహం నోరు తెరుస్తుంది. కాస్త గంభీరంగా కనిపించిన అమ్మాయి నవ్వుతుంది. ఒక పర్వతం తన ఎత్తుకు మించిన ఎత్తు పెరుగుతుంది...ఇలాంటి వింతలెన్నో!

అందుకే లోరెన్‌జో ఇలా రాశాడు: 'ఏ ఇమేజ్ అయినాసరే, అచ్చం కోరుకున్నట్లే!'

'చాట్‌జీపీటీ' ప్రాచుర్యం పొందిన తరువాత ఏఐ ఆధారిత ఇమేజ్ ఎడిటింగ్ అండ్ జెనరేటింగ్ టూల్స్ ఎన్నో వచ్చాయి. అయితే వాటికి భిన్నంగా ఇమేజ్‌లను ఎడిట్ చేసే పద్ధతిలో 'డ్రాగన్' మార్పు తీసుకురానుంది.

'డ్రాగన్' సాంకేతికతతో డ్రాపింగ్ పాయింట్స్ ద్వారా ఇమేజ్ స్ట్రక్చర్, పోజ్, ఎక్స్‌ప్రెషన్స్, లేఔట్...మొదలైన వాటిలో మార్పు తీసుకురావచ్చు. ఉదాహరణకు: నవ్వని అమ్మాయిని నవ్వేలా చేయడానికి....ఎడమవైపు పెదవి చివర ఒక రెడ్ డాట్ పెడతారు. ఆ తరువాత బ్లూ కలర్ డాట్ పెడతారు. ఈ రెండు డాట్స్‌ను కలిపితే చాలు ఆ అమ్మాయి నవ్వుతుంది!

'ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న పద్ధతుల్లో సౌలభ్యం, కచ్చితత్వం లోపించడం వల్లే డ్రాగన్‌పై ఆసక్తి మొదలైంది. రాబోయే కాలంలో ఫొటో ఎడిటింగ్ అనేది మౌస్‌తో ముడిపడి ఉన్న పని కాదు. టెక్స్ట్ ప్రాంప్ట్ సరిపోతుంది' అంటుంది ఢిల్లీకి చెందిన 22 సంవత్సరాల చైత్ర. రాజదర్శిని, తనీమా మెహ్రోత్ర, నవేలీ చోయల్‌లాంటి ప్రసిద్ధ ఫొటోగ్రాఫర్‌లు అంటే ఆమెకు ఇష్టం. ఫొటోగ్రాఫర్‌గా మంచి పేరు తెచ్చుకోవాలనేది చైత్ర కల.



> **ఛాయాచిత్ర ప్రయాణం**
>
> టీనేజ్‌లో ఫొటోగ్రఫీపై ఆసక్తి మొదలైంది. ఇంట్లో జరిగే 'కెరీర్ డిస్కషన్'లో ఫొటోగ్రఫీ ప్రస్తావన వచ్చేది కాదు. ఎందుకంటే 'ఫొటోగ్రాఫర్ కావాలనుకుంటున్నాను' అని చెబితే వింతగా చూసే పరిస్థితి. ఫ్యాషన్ డిజైన్ చదివినప్పటికీ ఫొటోగ్రఫీనే కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే కోరిక బలపడింది. కొంత కాలం ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేసిన తరువాత ఫొటోగ్రఫీనే కెరీర్‌గా ఎంచుకున్నాను. ఈ ప్రయాణం నాకు సంతృప్తిని ఇచ్చింది. ఫొటోగ్రాఫర్‌కు సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవడం ఎంత ముఖ్యమో ఒక సందర్భం. సన్నివేశానికి సంబంధించి కలర్స్, లైట్, మూడ్‌పై అవగాహ ఉండడం అంతే ముఖ్యం.
>
> – నవేలీ చోయల్, ఫొటోగ్రాఫర్. ఆర్ట్ డైరెక్టర్, ఢిల్లీ


'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 69

బుధవారం 31-5-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మీ కోసం మళ్లీ వస్తా'

అభిమానులకు ధోని సంకేతం.. వచ్చే ఏడాదీ ఐపీఎల్ ఆడే అవకాశాలు! -10లో



మహిళా ఇంజనీర్లకు ప్రాధాన్యం

'రెయిన్‌బో' కార్యక్రమంతో వెయ్యి మంది మహిళా ఇంజనీర్లకు టాటా పోస్టులు -11లో



న్యూస్‌రీల్

కట్టలు తెంచుకున్న కరెన్సీ..!



చలామణిలో ఉన్న బ్యాంకు నోట్ల విలువ, పరిమాణం రెండూ మార్చితో ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో (2021-22 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే) వరుసగా 7.8 శాతం, 4.4 శాతం పెరిగాయి. డిజిటలైజేషన్ మార్గంలో ఎన్ని చర్యలు తీసుకున్నా వ్యవస్థలో బ్యాంకు నోట్ల విలువ, పరిమాణం పెరగడం గమనార్హం. అయితే పెరుగుదల శాతాల్లో తగ్గడమే 'చెప్పుకోడానికి' కొంత ఊరటనిచ్చే అంశం. ఆర్‌బీఐ విడుదల చేసిన నివేదికలో ముఖ్యాంశాలు..

- వివరాలు 11లో▶

పోలీస్ తుది పరీక్షల ఫలితాలు విడుదల



యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా వివిధ విభాగాల్లోని ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు నిర్వహించిన తుది రాత పరీక్షల ఫలితాలను తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి ప్రకటించింది. అన్ని పోస్టులకు కలిపి తుది రాత పరీక్షకు హాజరైన వారిలో 84.06 శాతం మంది అర్హత సాధించారు. అభ్యర్థులు తమ ఓఎంఆర్ షీట్లను బుధవారం నుంచి వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు.

- వివరాలు 12లో▶

చేతులు కలిపారా ?



కర్ణాటక ఫార్ములాను రాజస్థాన్‌లో కూడా కాంగ్రెస్ హైకమాండ్ ప్రయోగించింది. ఉప్పు నిప్పుగా ఉన్న ఇద్దరు కీలక నేతలు అశోక్ గెహ్లోత్, సచిన్ పైలెట్‌ను ఒక్కటి చేసింది. రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో ఇరువురు నేతలు కలిసి పనిచేయడానికి ఒప్పించింది. మరి గెహ్లోత్ పైలెట్ చేతులు కలిపినట్టేనా ? ఎన్నికల్లో కలసికట్టుగా పని చేస్తారా ? ఆచరణలో ఇది ఎంతవరకు సాధ్యమనే ప్రశ్నలైతే వినిపిస్తున్నాయి.

- వివరాలు 6లో▶



మూడో వంతు నియోజకవర్గాలపై నిశిత పరిశీలన..

'దశాబ్ది' స్కాన్!

పనితీరు సరిగాలేని ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ పెద్దల ఫోకస్

- ఇటీవలి ఆత్మీయ సమ్మేళనాల్లో కొందరు ఎమ్మెల్యేలకు మైనస్ మార్కులు
- దశాబ్ది ఉత్సవాల్లోనూ తీరుమారకుంటే టికెట్ కష్టమేననే అభిప్రాయం
- గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల అనుభవంతో అభ్యర్థుల మార్పుపై సంకేతాలు
- అవకాశాలు దక్కినా అసంతృప్త స్వరం వినిపిస్తున్న వారికి మొండి చెయ్యే!
- పార్టీ లైన్‌కు అనుగుణంగా పనిచేసే వారికే ప్రాధాన్యత ఇచ్చే ఆలోచన

ఓ వైపు మారుతున్న రాజకీయ పరిణామాలు.. మరోవైపు దగ్గరపడుతున్న అసెంబ్లీ ఎన్నికలు.. ఇలాంటి కీలకమైన సమయంలో పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. ఇటీవలి వరకు జరిగిన ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించిన తీరు ఆధారంగా ఎమ్మెల్యేలపై ఓ అంచనాకు వచ్చిన ఆయన.. కొందరి పనితీరుపై అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలోనే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఎలా నిర్వహిస్తారన్నది పరిశీలించి.. పనితీరు మార్చుకోనివారిపై వేటు వేయాలని, తీవ్ర అవినీతి ఆరోపణలున్న వారిని పక్కనపెట్టాలని కేసీఆర్ భావిస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మూడో వంతు నియోజకవర్గాల్లో నిశిత పరిశీలన జరుపుతున్నారని అంటున్నాయి.



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం కేసీఆర్.. ఈ కార్యక్రమాన్ని ఏడాది చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధత కోసం ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. 21రోజుల పాటు సాగే దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు మమేకమయ్యే తీరు ఆధారంగానే వచ్చే ఎన్నికల్లో వారికి టికెట్లు కేటాయించాలనే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ఈ ఏడాది ఏప్రిల్, మేలో రెండు నెలల పాటు నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు జరిగిన విధానం, ఎమ్మెల్యేల పనితీరుపై పార్టీ ఇన్‌చార్జులు కేసీఆర్‌కు నివేదికలు అందజేశారు. వాటిని పరిశీలించిన సీఎం కేసీఆర్.. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ యంత్రాంగాన్ని కలుపుకొనిపోవడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల పనితీరుపై ఓ అంచనాకు వచ్చారని

మిగతా 2వ పేజీలో ▶

అభ్యర్థుల ఎంపికపై కసరత్తు షురూ..

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అభ్యర్థుల ఎంపికపై బీఆర్ఎస్ కసరత్తు ప్రారంభించింది. ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ సాధించాలని భావిస్తోంది. 119 సభ్యులున్న అసెంబ్లీలో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 103 మంది సభ్యులు ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ మళ్లీ అవకాశమిస్తామని పలు సందర్భాల్లో కేసీఆర్ ప్రకటించారు. అయితే ఈ 103 మందిలో 46 మంది వరుసగా రెండు సార్లు, మరో 18 మంది మూడు కంటే ఎక్కువ సార్లు ఎమ్మెల్యేగా గెలిచినవారే. ఈ క్రమంలో సహజంగానే వారిపై నెలకొనే ప్రతికూలత.. పార్టీ విజయావకాశాలను దెబ్బతీయకుండా ఉండేందుకు కేసీఆర్ ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.



పతకాలతో కన్నీటి గంగ

భావోద్వేగానికి గురైన రెజ్లర్లు

- పతకాలను గంగలో పడేసే తీవ్ర చర్యలకు పాల్పడవద్దని సముదాయించిన సన్నిహితులు
- నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న రెజ్లర్లు
- బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి ఐదు రోజుల గడువు విధింపు

లైంగిక వేధింపుల ఆరోపణల విషయంలో భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వచ్చిన అగ్రశ్రేణి రెజ్లర్లు మంగళవారం తీవ్ర చర్యకు సిద్ధమయ్యారు. తమ గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇక తాము సాధించిన పతకాలకు విలువ లేదంటూ వాటిని గంగా నదిలో పడేస్తామని ప్రకటించారు. ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచిన బజరంగ్ పూనియా, సాక్షి మలిక్...ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన వినేశ్ ఫొగాట్ తమ పతకాలతో హరిద్వార్‌లోని గంగాతీరానికి చేరారు. అక్కడ తమ నిరసనను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కన్నీటిపర్యంతమయ్యారు. అయితే గంగలో పతకాలు పడేసే తీవ్ర చర్యలకు పాల్పడవద్దని కోరిన రెజ్లర్ల సన్నిహితులు త్వరలో న్యాయం దక్కుతుందని వారిని సముదాయించారు. దాంతో చివరకు తమ నిర్ణయాన్ని మార్చుకొని వెనుదిరిగారు. బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి ఐదు రోజుల గడువు ఇచ్చారు. మరో వైపు రెజ్లర్లపై పోలీసు చర్యను అంతర్జాతీయ రెజ్లింగ్ సమాఖ్య తీవ్రంగా ఖండించింది. తగిన రీతిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరిన సమాఖ్య...త్వరలోనే ఎన్నికలు నిర్వహించకుంటే భారత రెజ్లింగ్ సమాఖ్య గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించింది.

10లో

కవిత అసలైన పెట్టుబడిదారు!

అరుణ్ పిళ్లై ఆమె ప్రతినిధిగా కార్యకలాపాల్లో పాల్గొన్నారు

ఢిల్లీ మద్యం విధానం కేసు అనుబంధ చార్జిషీట్‌లో ఈడీ ఆరోపణ



- వ్యాపారంలో భాగస్వామ్యంపై ఆనందం వ్యక్తం చేశారు
- దినేశ్ అరోరా, సమీర్ మహేంద్రు, ఇతరులతో ఆమె పలుమార్లు భేటీ అయ్యారు
- అరుణ్ పిళ్లై వాంగ్మూలంలో ఈ వివరాలన్నీ వెల్లడించారన్న ఈడీ
- 278 పేజీలతో చార్జిషీట్.. 53 సార్లు కవిత పేరు ప్రస్తావన
- దీనిని పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు.. విచారణ జూన్ 1కి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అసలైన పెట్టుబడిదారు అని.. ఆమె బినామీగా వ్యవహరించిన అరుణ్ పిళ్లై తన వాంగ్మూలంలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారని ఈడీ అనుబంధ చార్జిషీట్‌లో పేర్కొంది. రూ.100 కోట్ల కిక్‌బ్యాక్‌ల గురించి కవితకు తెలుసని పిళ్లై అంగీకరించారని తెలిపింది. సౌత్ గ్రూప్ (శరత్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాఘవ మాగుంట, కె.కవిత తరపున ప్రాతినిధ్యం వహించిన అరుణ్ పిళ్లై, అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబు)తో కలిసి మనీశ్ సిసోడియా, ఇతర ఆప్ నేతల ప్రతినిధి విజయ్ నాయర్ ఈ కుట్ర చేశారని వివరించింది. లిక్కర్ విధానం కేసుకు సంబంధించి ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాపై ఇటీవల ఈడీ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌ను ఢిల్లీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ మంగళవారం పరిగణనలోకి తీసుకున్నారు. దీనిపై విచారణ జూన్ 1వ తేదీకి

మిగతా 2వ పేజీలో ▶



డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం: కేటీఆర్

సౌత్ రాష్ట్రాలకు తక్కువ ఎంపీ సీట్లు

- జనాభాను నియంత్రించాలన్న కేంద్రం పిలుపును పట్టించుకోని ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు
- అసంబద్ధమైన డీ లిమిటేషన్‌తో దక్షిణాదికి ప్రాధాన్యత తగ్గుతుందని కేటీఆర్ ఆందోళన

3లో


మెరుగైన ప్రజా జీవనమే నా ధ్యేయం: మోదీ



కేంద్రంలో పాలనాపగ్గాలు చేపట్టి తొమ్మిదేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా ట్విట్టర్ వేదికగా ప్రధాని మోదీ తన స్పందన తెలియజేశారు. 'దేశ ప్రజల జీవనం మరింత మెరుగ్గా ఉండాలనేదే నా ప్రతీ నిర్ణయానికి దిక్సూచి. భారతావని సేవలో మేం తొమ్మిది వసంతాలను పూర్తి చేసుకున్నాం. ప్రజలు మరింత మెరుగైన జీవనం సాగించాలంటే ఏం చేస్తే బాగుంటుందనే ఆలోచనకు అనుగుణంగానే ప్రతిసారి నిర్ణయం తీసుకున్నా. ప్రతి పనీ చేశా. అభివృద్ధి చెందిన భారత్ కోసం మేం అందరం నిరంతరం శ్రమిస్తాం' అని ట్వీట్ చేశారు.

- వివరాలు 6లో

మణిపూర్ ప్రతినిధులతో అమిత్ షా చర్చలు



మణిపూర్‌లో కుకీ, మెయిటీ జాతుల మధ్య సయోధ్య సాధనకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నడుం బిగించారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి ఆయన తొలిసారిగా రాష్ట్రపర్యటన మొదలుపెట్టారు. చురాచాంద్‌పూర్‌లో మంగళవారం షా పర్యటించారు. ఇంఫాల్‌లో కుకీ వర్గానికి చెందిన మహిళా బృందం, మెయిటీ వర్గం, ప్రముఖులు, మేధో వర్గాన్ని విడివిడిగా కలిసి సమస్యలు అడిగి తెల్సుకున్నారు. శాంతి నెలకొనేందుకు సమష్టిగా కృషిచేస్తామని వాళ్లు హామీ ఇచ్చారు' అని భేటీ తర్వాత షా ట్వీట్ చేశారు.

- వివరాలు 6లో

నేడు, రేపు వర్షాలు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక
- పలు ప్రాంతాల్లో 42 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడి

- వివరాలు 2లో

ధాన్యమంతా నీటిపాలు

- వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఆందోళన వ్యక్తం చేసిన రైతులు

2లో

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వానకు తడిసిపోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు వెంకటస్వామి ఈయన. 15 రోజుల కింద 120 క్వింటాళ్ల ధాన్యాన్ని సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాడు. వారం కిందే ధాన్యం తేమ, ఇతర అంశాలను నిర్ధారించినా.. తూకం వేసేందుకు నిర్వాహకులు గన్నీ సంచులు ఇవ్వలేదని, ఇచ్చి ఉంటే ఇలా నీటి పాలై ఉండేది కాదని ఆయన వాపోయారు.



'ఆర్డినెన్స్'పై పోరులో ఆప్‌కు మద్దతిస్తాం: ఏచూరి



దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా సర్వీసులపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికారాలు కట్టబెడుతూ కేంద్రం ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని సమాఖ్య విధానంపై జరిగిన దాడిగా సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభివర్ణించారు. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా జరిగే పోరులో సీఎం కేజ్రీవాల్‌కు మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ ఆర్డినెన్స్ స్థానంలో కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లును అడ్డుకుంటామని ఆయన తెలిపారు. కేజ్రీవాల్ మంగళవారం సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరితో భేటీ అయ్యారు.

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



మన చేరికల కమిటీ చైర్మన్‌గారే! పక్కా వ్యూహంతో వెళ్తున్నారు!

పప్పు.. నిప్పు!



రూ. 120 నుంచి 150 వరకు చేరిన కందిపప్పు ధర	రూ. 70 నుంచి రూ. 100 దాటిన ఎర్రపప్పు

పల్లీల ధరకూ రెక్కలు.. కిలోకు రూ. 90 నుంచి రూ. 130కి జంప్

- మార్కెట్లో నెల వ్యవధిలోనే భారీగా పెరిగిన ధరలు
- సూపర్ మార్కెట్లు, ఆన్‌లైన్ ప్యాకేజ్డ్ పప్పులపై మరింత వడ్డింపు
- దేశవ్యాప్తంగా పప్పు ధాన్యాల దిగుబడి తగ్గడం వల్లే..

సాక్షి, హైదరాబాద్: వంట నూనెల ధరలు తగ్గుముఖం పట్టాయని సంతోషిస్తున్న సగటు జీవిపై ఇప్పుడు పప్పుల భారం భారీగా పడుతోంది. 20 రోజుల క్రితం వరకు రిటైల్ మార్కెట్‌లో కిలో రూ. 120 ఉన్న కందిపప్పు ధర ఇప్పుడు ఏకంగా రూ. 140 నుంచి రూ. 150కి పెరిగింది. అలాగే మినప గుండ్ల ధర రూ. 130కి చేరగా, మినపపప్పు మరింత పెరిగింది. ఎర్రపప్పు (మసూర్ దాల్) కూడా కిలో రూ. 70 నుంచి ఏకంగా రూ. 100కుపైగా పలుకుతోంది. వేరుశనగ (పల్లీలు) ధర కూడా రూ. 90 నుంచి రూ. 130కి ఎగబాకింది. కేవలం పెసర పప్పు ధరలో మాత్రమే పెద్దగా తేడా కనిపించట్లేదు. ఇక సూపర్ మార్కెట్లు, ఆన్‌లైన్ షాపింగ్‌ల ద్వారా ప్యాకేజ్డ్ కందిపప్పు ధర అర కిలోకే రూ. 90 నుంచి రూ. 95 పలుకుతోంది. అంటే అటుఇటుగా కిలో రూ. 200గా ఉంటోంది. అలాగే ఆర్గానిక్ పేరుతో ప్యాక్ చేసిన కందిపప్పు ధర రూ. 250 వరకు అమ్ముడవుతోంది. ఈ కేటగిరీలో మినప పప్పు ధర కిలో రూ. 150పైగా ఉండగా ఎర్రపప్పు రూ. 120గా ఉంది. వేరుశనగ నూనెను కిలోకు రూ. 180పైగా విక్రయిస్తున్నారు. నెల వ్యవధిలోనే పప్పుధాన్యాల, పల్లీల ధరలు పెరిగిపోవడంతో వంటింట పప్పులు ఉడకని పరిస్థితి నెలకొంది.

దిగుబడి తగ్గడం, డిమాండ్ పెరగడం వల్లే..

దేశంలో ఏటా సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల పప్పు ధాన్యాలను వినియోగిస్తారని అంచనా. గతేడాది దేశవ్యాప్తంగా 43.4 లక్షల మెట్రిక్ టన్నుల పప్పుధాన్యాల దిగుబడి రాగా మరో 15 లక్షల మెట్రిక్ టన్నుల మేర విదేశాల నుంచి కేంద్రం దిగుమతి చేసుకుంది. కానీ ఈ ఏడాది దేశంలో దిగుబడి 38.9 లక్షల మెట్రిక్ టన్నులుగానే నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షాలకుతోడు పప్పుధాన్యాలు, వేరుశనగతో పోలిస్తే తక్కువ శ్రమతో చేతికందే ఇతర పంటల సాగు వైపు రైతులు మొగ్గుచూపడం వల్లే దిగుబడులు తగ్గినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని తాండూరు, జహీరాబాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లోనూ గతేడాది పప్పుధాన్యాల దిగుబడి తగ్గినట్లు చెబుతున్నాయి.

స్టాక్.. బ్లాక్ మార్కెట్‌కు?

పెరిగిన పప్పుల ధరల నేపథ్యంలో హైదరాబాద్‌లోని బేగంబజార్ వంటి ప్రధాన మార్కెట్లలో కందిపప్పు నిల్వ లేదంటూ అప్పుడే 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. కందిపప్పునకు ఉన్న డిమాండ్ దృష్ట్యా బడా వ్యాపారులు దాన్ని బ్లాక్ మార్కెట్‌లోకి తరలిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాల్లోనూ ప్రధాన మార్కెట్లలో కందిపప్పు బ్లాక్ మార్కెట్‌కు తరలే అవకాశాలు ఉన్నాయి. దీనివల్ల త్వరలోనే కందిపప్పు ధర రిటైల్ మార్కెట్‌లో రూ. 180 నుంచి రూ. 200 వరకు చేరొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

బీజేపీపై శివసేన షిండే వర్గం అసంతృప్తి



మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన వర్గం అసంతృప్తితో రగిలిపోతోందని శివసేన(యూబీటీ)కు చెందిన సామ్నా పత్రిక పేర్కొంది. బీజేపీ తమ పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతోందంటూ 22 మంది ఎమ్మెల్యేలు, 9 మంది ఎంపీలు భావిస్తున్నారని, వీరు షిండే వర్గాన్ని వీడుతారని తెలిపింది. ఎంపీ గజానన్ కీర్తికార్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా సామ్నా ఉటంకించింది. అధికారాలన్నీ ఫడ్నవీస్ వద్దే ఉన్నాయని కూడా సామ్నా పేర్కొంది.

- వివరాలు 6లో

క్లుప్తంగా...

2న తెలంగాణ అవతరణ దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు రాష్ట్ర సచివాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల పరిధిలోని విభాగాధిపతుల కార్యాలయాల్లో ఉదయం 7.30 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. అనంతరం సచివాలయంలో జరగనున్న ఉత్సవాల్లో పాల్గొనాలని సూచించారు. అన్ని శాఖల కార్యదర్శులు, హెచ్ఓడీలు, అధికారులు, సిబ్బంది సచివాలయంలో జరిగే ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

18న మంచినీళ్ల పండగకు పకడ్బందీ ఏర్పాట్లు

దశాబ్ది ఉత్సవాలపై సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 18న నిర్వహించే మంచి నీళ్ల పండుగ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇంజనీర్లు, అధికారులను ముఖ్యమంత్రి కార్యదర్శి, మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆదేశించారు. అదేరోజు మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రాలు, గ్రామాల్లో వేడుకలు నిర్వహించాలన్నారు. నాడు మంచి నీళ్ల కోసం పడ్డ కష్టాలను, నేడు మిషన్ భగీరథతో అవుతున్న తాగునీటి సరఫరాను గ్రామస్తులకు వివరించాలని సూచించారు. దశాబ్ది ఉత్సవాలపై మంగళవారం మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయంలో సీఈ, ఎస్ఈలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దశాబ్ది వేడుకల నిర్వహణ కోసం 32 జిల్లాలకు (హైదరాబాద్ మినహా) ఇన్చార్జ్‌లను నియమించారు. జూన్13న నిర్వహించే మహిళా సంక్షేమ దినోత్సవం సంబరాల్లో మిషన్ భగీరథ మహిళా ఇంజనీర్లు, ఉద్యోగులు పాల్గొనాలన్నారు. అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించాలన్నారు.

ఉద్యోగుల కరువు భత్యం విడుదల చేయండి

తెలంగాణ ఉద్యోగుల సంఘం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యోగులకు రావాల్సిన మూడు విడతల కరువు భత్యం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ఉద్యోగుల సంఘం కోరింది. ఈ మేరకు మంగళవారం సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ఉద్యోగుల సంఘం గౌర అధ్యక్షుడు పద్మాచారి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్ర కుమార్, హరీశ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రావాల్సిన రెండు వేతన సవరణ కమిటీలను వెంటనే నియమించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు ఈడీ ముందుకు అంజన్‌కుమార్ యాదవ్



సాక్షి, న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి యంగ్ ఇండియా లిమిటెడ్ కేసులో మరోసారి విచారణకు హాజరుకావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. దీంతో బుధవారం అంజన్‌కుమార్ యాదవ్ ఢిల్లీలో ఈడీ ముందు విచారణకు హాజరుకానున్నారు. గతేడాది నవంబర్‌లో విచారణకు హాజరైన సందర్భంగా అంజన్ కుమార్‌ను ఈడీ మూడు గంటల పాటు ప్రశ్నించిన విషయం తెలిసిందే. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సూచన మేరకే యంగ్ ఇండియా లిమిటెడ్‌కు విరాళాలు ఇచ్చానని అంజన్ కుమార్ గత విచారణ సందర్భంగా ఈడీ అధికారులకు తెలిపిన విషయం తెలిసిందే.

కేసీఆర్ మోసాలను ఎండగట్టండి: మునిస్వామి

సాక్షి, హైదరాబాద్: దళితులకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చేసిన మోసాలపై దళిత వాడల్లో ప్రచారం చేసి రాష్ట్రంలోని 19 ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కార్యాచరణతో ముందుకు సాగాలని ఎస్సీ మోర్చా తెలంగాణ ఇన్చార్జ్ కోలార్ ఎంపీ మునిస్వామి పిలుపునిచ్చారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా అధ్యక్షతన రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్చార్జ్‌లతో మంగళవారం జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో మునిస్వామి పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ బెదిరింపులను ఎదుర్కొని తెలంగాణలో అధికారాన్ని కైవసం చేసుకోవాలన్నారు. మోదీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన విజయాలపై జూన్ 30 వరకు నిర్వహించే మహాజన సంపర్క్ అభియాన్‌లో అన్ని ఎస్సీ కుటుంబాలను ఎస్సీ మోర్చా నాయకులు కలవాలన్నారు.

పీఆర్సీ ఏర్పాటు చేయాలి: ఎస్టీయూటీఎస్

సాక్షి, హైదరాబాద్: కొత్త పీఆర్సీ వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, (ఎస్టీయూటీఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం సంఘం భవనంలో ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్ మీడియాతో మాట్లాడారు. జూన్ 1న పీఆర్సీ గడువు ముగుస్తుందని తెలిపారు. పాఠశాల విద్యలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరారు.



విజయనగరం జిల్లాలోని విశాఖ-అరకు రోడ్డులో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

ఏపీలో ఊరూరా సంబరం

సాక్షి నెట్‌వర్క్: నవరత్నాల బాటలో సాగుతున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు జరిగాయి. వైఎస్సార్ సీపీ శ్రేణులు బైక్ ర్యాలీలతో సంబరాలు నిర్వహించాయి. పలుచోట్ల నేతలు కేకులు కట్ చేసి స్వీట్లు పంచారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజమైన అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో నాలుగేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో రుజువు చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు.

కవిత అసలైన పెట్టుబడిదారు!

▶ మొదటి పేజీ తరువాయి

వాయిదా వేశారు. 278 పేజీల ఈ చార్జిషీటులో ఈడీ కవిత పేరును 53 సార్లు ప్రస్తావించింది.

ఈడీ అనుబంధ చార్జిషీట్‌లో ప్రధాన అంశాలివీ..

- ఈ కేసుకు సంబంధించి 2022 నవంబర్ 11, 20, 2023 ఫిబ్రవరి 16, మార్చి 6వ తేదీల్లో జరిగిన కార్యకలాపాల్లో కవిత తరఫు ప్రతినిధిగా అరుణ్ పాల్గొన్నారు. 2022 ఏప్రిల్ 8న ఢిల్లీలోని ఒబెరాయ్ మైడెన్స్‌లో విజయ్‌నాయర్, దినేశ్ అరోరాలతో కవిత, అరుణ్ సమావేశమై సౌత్ గ్రూప్‌కు కిక్ బ్యాక్‌ల చెల్లింపులపై చర్చించారు.
- మద్యం విధానం రూపకల్పనకు ముందు, తర్వాత కూడా విజయ్‌నాయర్‌తో కవిత పలు సార్లు సమావేశమయ్యారు. ఢిల్లీ సీఎంతో మాగుంట శ్రీనివాసులురెడ్డి భేటీ అయ్యారు. ఢిల్లీ మద్యం వ్యాపారంలోకి మాగుంట రాకను ఢిల్లీ సీఎం స్వాగతించారు.
- కవిత ప్రతినిధిగా అరుణ్ పిళ్లై మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రతినిధిగా ప్రేమ్ ఇండోస్పిరిట్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీనిలో 65 శాతం వాటా గురించి మాత్రం అరుణ్ పిళ్లైతోనే చర్చించానని, తానెప్పుడూ ప్రేమ్‌ను కలవలేదని సమీర్ మహేంద్రు వాంగ్మూలం ఇచ్చారు.
- అరుణ్ పిళ్లై, ఇతరులు కూడా ఇందులో అసలు పెట్టుబడిదారులైన రాజకీయ సంబంధాలున్న కవిత, మాగుంట శ్రీనివాసులురెడ్డి, శరత్‌రెడ్డి అని పలు సందర్భాల్లో వెల్లడించారు.
- సమీర్ మహేంద్రు వాంగ్మూలం ప్రకారం.. తన వెనక ఎవరున్నారో చెప్పాలని అడగ్గా తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవిత అని సమీర్‌కు అరుణ్ పిళ్లైవెల్లడించారు. ఢిల్లీ మద్యం వ్యాపారంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందంటూ కవిత ఫేస్‌టైం యాప్‌లో సమీర్‌కు చెప్పారు. ఎల్1 దరఖాస్తు విషయంలో ఏవైనా ఇబ్బందులొస్తే ఏ సాయం కావాలన్నా అరుణ్ పిళ్లైద్వారా తెలియజేయాలని సూచించారు. 2022 తొలినాళ్లలో హైదరాబాద్‌లోని కవిత నివాసంలో జరిగిన సమావేశంలో ఆమెతోపాటు సమీర్ మహేంద్రు, శరత్, అరుణ్ పిళ్లై, అభిషేక్ బోయినపల్లి, కవిత భర్త అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్‌పిళ్లైతన కుటుంబ సభ్యుడితో సమానమని, అతడితో కలసి వ్యాపారం చేస్తున్నామని, తమ వ్యాపారాన్ని భారీగా ముందుకుతీసుకెళ్లాలని భావిస్తున్నామని సమీర్‌కు కవిత తెలిపారు. ఈ సమయంలోనే ఇండోస్పిరిట్స్ ఎల్1 దరఖాస్తు సమస్యపై కవిత ఆరా తీశారు.

సౌత్‌గ్రూప్ అని ఎందుకు అన్నామంటే..?

ఈ కేసులో కొందరి బృందాన్ని సౌత్ గ్రూపు అని ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందో ఈడీ సప్లిమెంటరీ చార్జిషీట్లో వివరించింది. దర్యాప్తు సమయంలో పలువురు వ్యక్తులు సౌత్‌గ్రూప్ అని ప్రస్తావించడం వల్లే.. ఆ గ్రూప్‌లోని ప్రతినిధుల గురించి చార్జిషీట్‌లో సౌలభ్యం నిమిత్తం సౌత్ గ్రూపుగా పేర్కొంటున్నామని తెలిపింది. సౌత్ గ్రూపులో మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాఘవ మాగుంట, శరత్‌రెడ్డి, కె.కవిత ప్రముఖ వ్యక్తులని తెలిపింది. ఈ సౌత్‌గ్రూపునకు ప్రతినిధులుగా అభిషేక్ బోయినపల్లి, అరుణ్ పిళ్లై, బుచ్చిబాబు వ్యవహరించారని తెలిపింది. రూ.100 కోట్ల కిక్‌బ్యాక్‌లు బదిలీ చేయడానికి విజయ్ నాయర్, దినేష్ అరోరాలతో కలిసి అభిషేక్ కుట్ర చేశారని పేర్కొంది.

- ఢిల్లీలోని గౌరి అపార్ట్‌మెంట్స్‌లో భేటీ సందర్భంగా అర్జున్ పాండే, అరుణ్ పిళ్లై, బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లిలను విజయ్‌నాయర్ తనకు పరిచయం చేశారని.. వారు ఎంఎస్ రెడ్డి, కవితలకు బాగా దగ్గరవారని, మద్యం వ్యాపారంలో సాయం చేస్తారని చెప్పారని.. దినేష్ అరోరా ఈడీకి వాంగ్మూలం ఇచ్చారు.
- దినేష్ అరోరా కవితతో రెండుసార్లు సమావేశమయ్యారు. ఒబెరాయ్‌లో సమావేశం సందర్భంగా అడ్వాన్స్ కిక్‌బ్యాక్స్‌ను విజయ్‌నాయర్‌కు చెల్లించడంపై చర్చించారు.
- రూ.100 కోట్ల ముడుపులకు బదులుగా కవితకు ఇండోస్పిరిట్స్‌లో వాటా ఇవ్వడంపై.. ఆమెకు, ఆప్ నేతలకు మధ్య అవగాహన/ఒప్పందం ఉందని అరుణ్ పిళ్లై తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఆ మేరకే తాను కవితకు ప్రాతినిధ్యం వహించానని, అవసరమైన పెట్టుబడి ఇస్తూ కాగితాలపై భాగస్వామి అయ్యారని తెలిపారు. తాను చాలా కాలంగా కవితకు స్నేహితుడినని పేర్కొన్నారు.

పాలసీని అనుకూలంగా రూపొందించేలా..

ఢిల్లీ లిక్కర్ పాలసీని తమకు అనుకూలంగా రూపొందించేలా.. ఇందుకోసం ఆప్‌కు నిధులు సమకూర్చుకునేలా కవిత ఒప్పందం కుదుర్చుకున్నట్టుగా బుచ్చిబాబు తన వాంగ్మూలంలో వెల్లడించారని చార్జిషీట్‌లో ఈడీ పేర్కొంది. "మార్చి 2021లో బుచ్చిబాబు, అరుణ్ పిళ్లై, అభిషేక్ బోయినపల్లి తదితరులు విజయ్‌నాయర్, సమీర్ మహేంద్రులతో జూమ్‌లో సమావేశమై.. ఢిల్లీ మద్యం విధానంలో వ్యాపార అవకాశాలపై చర్చించారని బుచ్చిబాబు వెల్లడించారు. ఈ సందర్భంగా పాలసీలో తానేం చేయగలనో చెప్పిన విజయ్‌నాయర్.. కవితను ఆకట్టుకొనే యత్నం చేశారని.. పాలసీని అనుకూలంగా రూపొందిస్తే ఆప్ పార్టీకి కొంత మొత్తం నిధులు సమకూర్చాలని కవితతో ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. ఈ క్రమంలో మద్యం విధానం రూపకల్పనలో విజయ్‌నాయర్‌తో కలిసి అరుణ్ పిళ్లైపనిచేశారన్నారు. మార్చి 2021లో పాలసీకి సంబంధించి మంత్రుల బృందం కాపీ గురించి అడగ్గా విజయ్‌నాయర్ తనకు, పిళ్లైకి పంపారని.. పిళ్లైఆ కాపీని తన రెండో ఫోన్‌లోకి కాపీ చేసుకున్నారని వెల్లడించారు. ఈ క్రమంలో ఆప్, విజయ్‌నాయర్‌కు పిళ్లైద్వారా కవిత నిధులు సమకూర్చారని వివరించారు. కవిత, ఆప్ అగ్రనేతలకు మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా.. సమీర్, పెర్నార్డ్ రికార్డ్‌లో కవితకు వాటాలు దక్కాయని.. కవిత సూచనల మేరకు అరుణ్ పిళ్లై తన పేరుమీదే పెట్టుబడులు పెట్టారని, వ్యాపారంలో వాటా కూడా నేరుగా కవిత ఖాతాల్లోకి రాలేదని బుచ్చిబాబు పేర్కొన్నారు. సౌత్‌గ్రూప్‌కు కిక్‌బ్యాక్‌లను క్రెడిట్ నోట్స్ ద్వారా అభిషేక్, దినేష్ అరోరాలకు అమన్‌ధాల్ చెల్లించారని.. కొంతభాగాన్ని మాత్రం అభిషేక్ బోయినపల్లికి నగదురూపంలో చెల్లించారని బుచ్చిబాబు వివరించారు." అని ఈడీ చార్జిషీట్‌లో పేర్కొంది.

హైదరాబాద్‌లో ప్రాపర్టీలు కొన్నారు

ఢిల్లీ మద్యం వ్యాపారంలో వచ్చిన సొమ్ముతో సదరు వ్యక్తులు హైదరాబాద్‌లో ప్రాపర్టీలు కొన్నారని ఈడీ పేర్కొంది. మంగళవారం ఢిల్లీ ప్రత్యేక కోర్టులో అరుణ్ పిళ్లై బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈడీ తరఫు న్యాయవాది ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫీనిక్స్ శ్రీహరితో కలిసి కవిత భర్త అనిల్, బుచ్చిబాబు హైదరాబాద్‌లో ప్రాపర్టీలు కొన్నారని తెలిపారు. ఈ కేసులో కవితకు ప్రతినిధిగా అరుణ్ పిళ్లై వ్యవహరించారన్నారు. దీనిపై తమ వాదనలు వినిపించడానికి సమయం కావాలని పిళ్లై తరఫు న్యాయవాది కోరగా.. విచారణ జూన్2కు వాయిదా వేశారు.

'దశాబ్ది' స్కాన్!

▶ మొదటి పేజీ తరువాయి

సమాచారం. ఈ క్రమంలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణలోనూ ఎమ్మెల్యేల తీరును మదింపు చేసి.. టికెట్ల కేటాయింపుపై నిర్ణయం తీసుకోనున్నట్టు బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

గ్రేటర్ హైదరాబాద్ అనుభవంతో..

2020లో గ్రేటర్ హైదరాబాద్ పాలక మండలికి జరిగిన ఎన్నికల సమయంలో పార్టీ కార్పొరేటర్లపై వ్యతిరేకత ఉందని సర్వేలో వెల్లడైనా.. సిట్టింగులకే టికెట్లు ఇచ్చేందుకు పార్టీ అధినేత మొగ్గు చూపారు. కానీ ఆ వ్యతిరేకతకు తోడు మారిన రాజకీయ పరిణామాలతో ఆశించిన ఫలితం రాలేదు. ఇప్పుడు కూడా.. పలువురు పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందని సర్వేల ఫలితాలు తేల్చాయని, అదే తరహాలో నిఘా సంస్థల నుంచి కేసీఆర్‌కు నివేదికలు అందాయని సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆత్మీయ సమ్మేళనాలు, దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో ఎమ్మెల్యేల పనితీరును మదింపు చేయాలని ఆయన నిర్ణయించినట్టు తెలిసింది. ఇక పార్టీలోనే ఉంటూ తలనొప్పులు సృష్టిస్తున్నవారు, అవకాశాలు దక్కినా అసంతృప్త స్వరం వినిపిస్తూ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నవారిపై కేసీఆర్ దృష్టి సారించారని.. అవసరమైతే వారిని బయటికి పంపాలని భావిస్తున్నారని సమాచారం. 40 పర్సెంట్ కమిషన్ వివాదంతో కర్ణాటకలో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో.. రాష్ట్రంలో అవినీతి ఆరోపణలు ఉన్న ఎమ్మెల్యేలను పక్కన పెట్టాలని కేసీఆర్ నిర్ణయించినట్టు తెలిసింది.

సుమారు 40 నియోజకవర్గాలపై ఫోకస్!

నకిరేకల్, ఇల్లెందు, తాండూరు, పాలేరు, బెల్లంపల్లి, తుంగతుర్తి, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, జహీరాబాద్, నాగార్జునసాగర్, ఎల్లారెడ్డి, ఉప్పల్, కొత్తగూడెం, ఖానాపూర్, జగిత్యాల, హుస్నాబాద్, షాద్‌నగర్, మహబూబాబాద్, కోదాడ, వరంగల్ తూర్పు, మెదక్, అలంపూర్ సహా సుమారు 40 నియోజకవర్గాల్లో పార్టీ, ఎమ్మెల్యేల పనితీరును కేసీఆర్ పరిశీలిస్తున్నట్టు బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి. ఆయా నియోజకవర్గాల్లో పలుచోట్ల టికెట్ కోసం తీవ్ర పోటీ ఉండగా.. మరికొన్ని చోట్ల స్థానిక నేతల అసంతృప్తి, ఇంకొన్ని చోట్ల అవినీతి ఆరోపణలు, ప్రజల్లో వ్యతిరేకత ఉన్నాయన్నారు. మొత్తం నియోజకవర్గాల్లో మూడో వంతు చోట్ల టికెట్ల కేటాయింపు ఎలా ఉంటుందన్నది ఇప్పుడే చెప్పలేమని తెలంగాణ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మోదీ బీసీ బిడ్డయితే.. కుల గణన చేపట్టాలి

జాజుల శ్రీనివాస్ గౌడ్



చిత్తూరు రూరల్: ప్రధానమంత్రి బీసీ బిడ్డయితే.. బీసీల కుల గణన చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నూతన పార్లమెంట్ నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. చట్టసభలకు నూతన నాయకత్వం రావాలంటే చట్టసభలో 50% బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని చెప్పారు. 9 ఏళ్ల పాలనలో బీసీలకు మోదీ ఏం చేశారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే బీసీల కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ.. సమానత్వం కోసం కృషి చేస్తోందని ఆయన కొనియాడారు. బీసీల గణన, చట్టసభలో 50% రిజర్వేషన్ కల్పించాలనే ఉద్దేశంతో ఆగస్టు 7న తిరుపతిలో నిర్వహించే ఓబీసీల మహాసభను విజయవంతం చేయాలన్నారు.

ఏపీకి 'డిపెండబిలిటీ' లేదు!

- ఆ రాష్ట్రం మిగులు జలాలే కోరింది.. ప్రాజెక్టులన్నీ నిండాకే వాడుకోవాలి
- కృష్ణా బోర్డుకు రాసిన లేఖలో స్పష్టం చేసిన తెలంగాణ
- 75% డిపెండబిలిటీ జలాలను మేమే కోరాం
- షెడ్యూల్ 11లోని 6 ప్రాజెక్టులకు జల కేటాయింపులే లేవు
- కేటాయింపులు కృష్ణా ట్రిబ్యునల్–2 పరిశీలనలో ఉన్నట్లు స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లో 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా లభ్యతగా ఉన్న జలాల నుంచి ఏపీలోని తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులు ఎలాంటి జలాలను తీసుకోరాదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా నికరంగా ఉండాల్సిన 1,005 టీఎంసీలకు మించి వాస్తవ లభ్యత ఉంటేనే/జలాశయాలన్నీ పూర్తిస్థాయిలో నిండిన తర్వాతనే మిగులు జలాలను ఈ ప్రాజెక్టుల కోసం ఏపీ తరలించుకోవాలని తేల్చిచెప్పింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ తాజాగా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు లేఖ రాశారు.

మినహాయింపు సరే.. కేటాయింపులు ఏవీ?

ఏపీ విభజన చట్టం 11వ షెడ్యూల్‌లో తెలంగాణలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, ఏపీలోని తెలుగుగంగ, గాలేరు–నగరి, హంద్రీ–నీవా, వెలిగొండ ప్రాజెక్టులను కేంద్రం పొందుపరిచి వాటిని పూర్తి చేసుకోవడానికి అనుమతిచ్చింది. దీని ఆధారంగా ఈ 6 ప్రాజెక్టులకు అనుమతుల నుంచి మినహాయింపు కల్పిస్తూ కేంద్ర జలశక్తి శాఖ గతేడాది జూలై 27న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల అంశాన్ని చర్చించి పరిష్కరించడానికి వాటికి సంబంధించిన నోటిఫైడ్ ప్లాన్స్, ఇతర ఉత్తర్వుల ప్రతులను తమకు సమర్పించాలని ఈ నెల 10న జరిగిన కృష్ణా బోర్డు 17వ సర్వసభ్య సమావేశంలో బోర్డు చైర్మన్ శివనందన్ కుమార్ ఇరు రాష్ట్రాలను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు అనుమతుల నుంచి మినహాయింపు కల్పించినా వాటికి నీటి కేటాయింపులే లేవని తాజాగా కృష్ణా బోర్డుకు రాసిన లేఖలో తెలంగాణ బదులిచ్చింది. ఈ 6 ప్రాజెక్టులు సహా తెలంగాణలోని ఎస్ఎల్‌బీసీ, పాలమూరు–రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులు కలిపి మొత్తం 9 ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల అంశం కృష్ణా ట్రిబ్యునల్–2 పరిశీలనలో ఉందని తెలిపింది. ఈ అంశంపై చర్చను 6 ప్రాజెక్టులకు సరిపెట్టకుండా 9 ప్రాజెక్టులపై జరపాలని కోరింది. నీటి కేటాయింపులు జరిపే అధికారం కేవలం ట్రిబ్యునల్‌కు ఉందని గుర్తుచేసింది.

ఏపీ మిగులు జలాలే వాడుకోరాదు..

షెడ్యూల్–11లో పొందుపరిచిన కల్వకుర్తి, నెట్టెంపాడుతోపాటు పాలమూరు–రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులకు 75% డిపెండబిలిటీ ఆధారంగా నీటి కేటాయింపులు జరపాలని కృష్ణా ట్రిబ్యునల్–2ను కోరామని కృష్ణా బోర్డు దృష్టికి తెలంగాణ ప్రభుత్వం తీసుకెళ్లింది. తెలంగాణ తరహాలో 75% డిపెండబిలిటీ ఆధారంగా తెలుగుగంగ, గాలేరు–నగరి, హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు జరపాలని కృష్ణా ట్రిబ్యునల్–2ను ఏపీ కోరలేదని స్పష్టం చేసింది. కేవలం మిగులు జలాలనే కేటాయించాలని ఏపీ కోరిందని, ఈ నేపథ్యంలో 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా లభ్యతగా ఉండే జలాలను ఏపీ వాడుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది.



విజయవాడలోని నిర్మల్ హృదయ్ భవన్‌లో చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతి

'నిర్మల్ హృదయ్'లో సీఎం జగన్ దంపతులు

- నూతన భవనాన్ని ప్రారంభించి శిలా ఫలకం ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు మంగళవారం విజయవాడలోని మిషనరీస్ ఆఫ్ చారిటీ నిర్మల్ హృదయ్ భవన్‌ను సందర్శించారు. నిర్మల్ హృదయ్‌లో నూతనంగా నిర్మించిన హోమ్ ఫర్ సిక్ అండ్ డైయింగ్ డెస్టిట్యూట్స్ భవనాన్ని సీఎం ప్రారంభించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆశ్రమంలోని మదర్ థెరిస్సా చిత్రపటానికి సీఎం జగన్ దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భవన్‌లోని అనాథ పిల్లలు, వృద్ధులతో ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

మీ అందరి ఆశీస్సులు ఎప్పటికీ ఇలాగే ఉండాలి

ఏపీ సీఎం వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ట్విట్టర్ ద్వారా రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్ కృతజ్ఞతలు తెలిపారు. 'దేవుని దయతో, మీ అందరి చల్లని దీవెనలతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తయింది. నాపై ఎంతో నమ్మకంతో మీరు ఈ బాధ్యతను అప్పగించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఈ నాలుగేళ్ళ కాలంలో 98 శాతానికి పైగా ఎన్నికల హామీలను మన ప్రభుత్వంలో అమలు చేశాం. వివిధ రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం' అని ప్రజలకు వివరించారు. 'మీకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తూ.. మన ప్రభుత్వంపై మీ అందరి ఆశీస్సులు ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను' అంటూ ట్వీట్ చేశారు.

నేడు, రేపు ఈదురుగాలులతో వర్షాలు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక
- పలు ప్రాంతాల్లో 42 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో బుధ, గురువారాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మిగతా ప్రాంతాల్లోనూ తేలికపాటి వానలు పడవచ్చని తెలిపింది. పశ్చిమ విదర్భ నుంచి మరాఠ్వాడ, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు విస్తరించి ఉన్న ద్రోణి దీనికి కారణమని వెల్లడించింది. మరోవైపు పలు ప్రాంతాల్లో మూడు రోజులపాటు 39 డిగ్రీల నుంచి 42 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది.

ఇటు వానలు.. అటు ఎండలు

మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల విస్తారంగా వానలు పడగా.. మరికొన్ని చోట్ల ఎండలు మండిపోయాయి.

- పెద్దపల్లి జిల్లా జూలపల్లి, మంచిర్యాల జిల్లా జన్నారంలో అత్యధికంగా 6 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లా శాయంపేట, హసన్‌పర్తి, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, జైపూర్, జగిత్యాల జిల్లా పెగడపల్లి, కొమురంభీం జిల్లా సిర్పూరు, కరీంనగర్ జిల్లా జమ్మికుంట, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట, వరంగల్ జిల్లా ఆత్మకూర్, సంగెంలలో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.
- ఇక నిర్మల్ జిల్లా తానూరులో 41.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అదే జిల్లా భైంసా, ఆదిలాబాద్ జిల్లా పిప్పలధరిలలో 41.2, అర్లిలో 40.9 డిగ్రీలు, కామారెడ్డి జిల్లా బోమన్‌దేవిపల్లిలో 40.1, నిజామాబాద్ జిల్లా మాచిప్పలో 40, కల్దుర్కి, ఆదిలాబాద్ జిల్లా పొచ్చరలో 39.9, నిజామాబాద్‌లో 38.7, మెదక్‌లో 38.6, ఆదిలాబాద్‌లో 38.3, ఖమ్మంలో 36.2, హైదరాబాద్, రామగుండంలో 33.6 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ధాన్యమంతా నీటి పాలు



పెద్దపల్లి జిల్లా మంథని మార్కెట్ యార్డ్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తిపోస్తున్న రైతు

- వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఆందోళన వ్యక్తం చేసిన రైతులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/బాల్కొండ/ సిద్దిపేట: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం కురిసిన వానలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నీటిపాలైంది. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని, విక్రయానికి సిద్ధం చేసుకుంటే.. మళ్లీ వానలు కురిసి దెబ్బతీశాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి.

- పెద్దపల్లి జిల్లాలో మంగళవారం ఉదయం గంట పాటు కురిసిన ఈదురుగాలుల వానతో రైతులు ఇబ్బంది పడ్డారు. మంథని, అంతర్గాం, జూలపల్లి, ఓదెల, పెద్దపల్లి మండలాల్లోని కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది.
- రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం శివార్లలోని ఏడు గ్రామాల్లో, వేములవాడ, ఇల్లంతకుంట, రుద్రంగి, కోనరావుపేట, వేములవాడ రూరల్ మండలాల్లో కల్లాల్లో ఉన్న వడ్లు తడిసిపోయాయి. తూకం వేసి రవాణా చేసేందుకు సిద్ధం చేసిన బస్తాలూ నానిపోయాయి.
- జగిత్యాల జిల్లాలో గొల్లపల్లి, సారంగాపూర్, బీర్‌పూర్, వెల్గటూర్, జగిత్యాల మండలాల్లోనూ ధాన్యం తడిసిపోయింది.
- నిజామాబాద్ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఈదురుగాలులతో కూడిన వానలతో ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి.

50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

యాసంగి సీజన్‌లో దేశంలో ఇదే రికార్డు: మంత్రి గంగుల



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే ఏ రాష్ట్రం సాధించని విధంగా ఈ యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో ఇప్పటివరకు 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. రూ.10,200 కోట్ల విలువ చేసే ఈ ధాన్యాన్ని 8 లక్షల మంది రైతుల నుంచి సేకరించినట్లు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం 7వేలకు పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. కొనుగోలు పూర్తయిన వెంటనే రైతుల అకౌంట్లో ఆన్‌లైన్ ద్వారా నేరుగా డబ్బులు జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 1,400 కొనుగోలు కేంద్రాల్లో వడ్ల సేకరణ పూర్తయిందని, ఈ నేపథ్యంలో వాటిని మూసివేసినట్లు తెలిపారు. నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో సగానికిపైగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ ముగిసిందని తెలిపారు. గతేడాది కన్నా ఈసారి ఇప్పటివరకు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా సేకరించినట్లు మంత్రి గంగుల వివరించారు. ఎఫ్‌సీఐ నిర్దేశించిన కనీస నాణ్యతా ప్రమాణాల ప్రకారం వచ్చిన ధాన్యంలో ఏ మిల్లర్ కోత పెట్టినా కఠినచర్యలు తీసుకుంటామని మరోమారు స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

కాంగ్రెస్‌కు 60 స్థానాల్లో అభ్యర్థులే లేరు

ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎద్దేవా



షాద్‌నగర్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి 60 స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే లేరని, పక్క పార్టీల నుంచి ఎవరు వస్తారో ఆశగా ఎదురు చూడాల్సిన దయనీయ పరిస్థితితో ఆ పార్టీ ఉందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎద్దేవా చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.161.73 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలన్నీ బంద్ అవుతాయని, రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోతుందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల నేతలు చెప్పే మాయమాటలను నమ్మి పార్టీలు మారొద్దన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరో 15 ఏళ్లు అధికారంలో ఉండటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి పాల్గొన్నారు.

ఏం సాధించారని ఉత్సవాలు?: కోదండరాం



జహీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏం సాధించిందని తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోందని టీజేఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో పార్టీ కార్యాలయాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తమ గొప్పతనాన్ని చెప్పుకునేందుకే దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా వచ్చే నాయకులను, మంత్రులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఏ ఆకాంక్షల కోసం ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకున్నారో, ఆ ఆకాంక్షలు నేరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. ఈ నియంత పాలనను అంతమొందించేందుకు ఎవరితోనైనా పొత్తు పెట్టుకునేందుకు సిద్ధ మని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీజేఎస్ పోటీ చేసే నియోజకవర్గాల్లో జహీరాబాద్ ఒకటని, ఈ నియోజకవర్గం నుంచి మొగుడంపల్లి ఆశప్ప పోటీ చేస్తారని ప్రకటించారు. సమావేశంలో జహీరాబాద్ టీజేఎస్ కన్వీనర్ ఆశప్ప, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై గవర్నర్ దృష్టి పెట్టాలి: షర్మిల




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రక్షాళనపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దృష్టి పెట్టాలని, బోర్డు పునరుద్ధరణకు రాష్ట్రపతికి సిఫార్సు చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల విజ్ఞప్తి చేశారు. టీఎస్‌పీఎస్సీ అవినీతి, అక్రమాలు గ్రామాలకు పాకి...ఖండాలు దాటినా ఇప్పటికీ చర్యల్లేవని, ఇంత జరిగినా దొంగ చేతికే తాళాలు ఇచ్చినట్లు పాత బోర్డుతోనే మళ్లీ పరీక్షలు పెడుతున్నారని మంగళవారం ట్విట్టర్ వేదికగా ఆమె మండిపడ్డారు. నిరుద్యోగుల భవిష్యత్తు అంధకారంలో పడకుండా కాపాడాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.

మధ్యప్రదేశ్ బీఆర్‌ఎస్ కో-ఆర్డినేటర్ గా బుద్ధసేన్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ మధ్యప్రదేశ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా మాజీ ఎంపీ బుద్ధసేన్ పటేల్‌ను నియమిస్తూ పార్టీ అధినేత కేసీఆర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రగతిభవన్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన నేతలు మంగళవారం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మధ్యప్రదేశ్‌లోని రేవా పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ మాజీ ఎంపీ బుద్ధసేన్ పటేల్‌తోపాటు బీఎస్పీకి చెందిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నరేశ్ సింగ్ గుర్జార్, ఎస్పీ మాజీ ఎమ్మెల్యే ధీరేంద్ర సింగ్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కేసీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు భోపాల్‌లో ఏర్పాటు చేయనున్న సభకు కేసీఆర్‌ను ఆహ్వానించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ: చాడ



కరీంనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, ఆర్‌ఎస్‌ఎస్ ఏజెండాను అమలుచేస్తూ దేశంలో అల్లర్లకు కారణమవుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ భవనం ప్రారంభం సందర్భంగా ప్రధాని వ్యవహరించిన తీరు సరికాదన్నారు. కొత్త పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని కోరినా పట్టించుకోలేదని, ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం దారుణమన్నారు.

ఎఫ్‌డీఐలు తగ్గాయ్!


2022-23లో 20 శాతం మేర తగ్గిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

2021-22లో 58.8 బిలియన్ డాలర్లు కాగా, 2022-23లో 46 బిలియన్ డాలర్లకు తగ్గుదల

ఆర్థిక సేవలు, ఇంధన రంగాల్లో మెరుగుదల.. తయారీ రంగంలో తగ్గుదల. సింగపూర్ నుంచి ఎక్కువగా మన దేశానికి పెట్టుబడులు

ఆ తర్వాత స్థానంలో మారిషస్, అమెరికా.. అతి తక్కువగా దక్షిణ కొరియా, ఫ్రాన్స్‌ల నుంచి

2022-23 వార్షిక నివేదిక విడుదల చేసిన ఆర్‌బీఐ



తయారీ రంగంలో ఎక్కువగా పెట్టుబడులు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

తొమ్మిదేళ్ల క్రితం దేశంలోని 25 రంగాల్లోకి ప్రారంభమైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐలు) పర్వం కొనసాగుతూనే ఉంది. అనేక అనుమానాలు వ్యక్తమైనా ఆంక్షలు, అడ్డంకులు ఎదురైనా, కరోనా లాంటి విపత్తులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపివేసినా బలీయమైన ఆర్థిక శక్తిగా ప్రపంచ మార్కెట్ మన్ననలు పొందుతున్న భారత్‌లోకి ఈ పెట్టుబడులు ప్రవాహంలా కొనసాగుతూనే ఉన్నాయి. కానీ 2022-23 ఆర్థిక సంవత్సరంలో మాత్రం ఎఫ్‌డీఐలు 20 శాతానికి పైగా తగ్గాయని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. 2014లో 45.5 బిలియన్ డాలర్లతో ప్రారంభమైన ఈ పెట్టుబడులు ఒకానొక దశలో 60 బిలియన్ డాలర్ల మార్కు దాటాయి. 2016-17లో 60.22 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కానీ గత ఐదేళ్లుగా ఈ పెట్టుబడుల్లో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 44.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా, ఆ తర్వాతి ఏడాదిలో 50 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2020-21లో అనూహ్యంగా పెరిగి 2016-17 మార్కుకు దాదాపు సమాంతరంగా 59.6 బిలియన్ డాలర్లకు చేరాయి. ఆ తర్వాతి ఏడాదిలో (2021-22)లో 58.8 బిలియన్ డాలర్లు నమోదు కాగా, గత మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మాత్రం గణనీయంగా తగ్గిపోయాయని, 46 బిలియన్ డాలర్ల మేరకు మాత్రమే ఎఫ్‌డీఐలు వచ్చాయని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను విడుదల చేసిన నివేదికలో ఆర్‌బీఐ లెక్కలు వెల్లడించింది.

రియల్ ఎస్టేట్‌లో అంతంతమాత్రమే..

ఆసక్తికరమైన విషయమేమిటంటే మన దేశంలోని రియల్ ఎస్టేట్ రంగంలో ఎఫ్‌డీఐలు పెట్టేందుకు ఇతర దేశాలు పెద్దగా ముందుకు రావడం లేదు. ఈ రంగంలో అత్యధికంగా 2019-20లో 0.6 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా, గతేడాది అంటే 2022-23లో కేవలం 0.1 బిలియన్ డాలర్ల పెట్టుబడులే వచ్చాయి. ఇప్పటివరకు దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చిన జాబితాలో తయారీ, ఆర్థిక సర్వీసులు, రియల్ ఎస్టేట్‌తో పాటు కంప్యూటర్ సర్వీసులు, రిటైల్-హోల్‌సేల్ వ్యాపారాలు, కమ్యూనికేషన్ సేవలు, ఇంధన, వ్యాపార సేవలు, విద్య-పరిశోధన, రవాణా, నిర్మాణ, హోటళ్లు-రెస్టారెంట్లు, మైనింగ్, ఇతర వ్యాపార రంగాలున్నాయి.


2021-22 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆర్థిక సేవలు, ఇంధన రంగంలోనే 2022-23లో ఎఫ్‌డీఐలు పెరిగాయి. తయారీ రంగంలో ఈ పెట్టుబడులు ఏకంగా 5 బిలియన్ డాలర్లు తగ్గగా, ఆర్థిక సేవల రంగంలో 2.1 బిలియన్ డాలర్లు పెరిగాయి. కంప్యూటర్ సేవల రంగం 4.4 బిలియన్ డాలర్ల తగ్గుదలను నమోదు చేసుకోగా, కమ్యూనికేషన్ సేవల్లో కూడా 2 బిలియన్ డాలర్ల మేర ఎఫ్‌డీఐలు తగ్గాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇంధన రంగంలో అంతకుముందు ఏడాది (2.2 బిలియన్ డాలర్లు)తో పోల్చుకుంటే గత ఏడాదిలో (3.3 బిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు పెరిగాయి. వివిధ దేశాలు మన దేశంలోని పరిశ్రమల్లో పెడుతున్న ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఎక్కువ శాతం తయారీ రంగంలోనే ఉంటున్నాయి. తయారీ రంగంలో ఎఫ్‌డీఐలు అత్యధికంగా 2021-22లో 16.3 బిలియన్ డాలర్లు రాగా, ఆ తర్వాత ఏడాదిలో 11.3 బిలియన్ డాలర్లకు తగ్గాయి. అయితే 2022-23లో ఆర్థిక సర్వీసుల రంగంలో విదేశీ పెట్టుబడులు పెరిగాయి. ఈ రంగంలో గత ఏడాది 6.8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. కానీ దీనికి ముందు మూడేళ్లు ఇంతకంటే తక్కువగానే పెట్టుబడులు వచ్చాయి.



పీఎల్‌ఐ ఇవ్వడం సక్సెస్ కాలేదు

- డి.పాపారావు, ఆర్థిక రంగ విశ్లేషకులు

ఆర్థిక వ్యవస్థ గ్లోబల్ గానే స్లో డౌన్‌లో ఉంది. మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం దీనికి ప్రధాన కారణం. దీనికి తోడు ఉత్పత్తి పెరిగే అవకాశాలు లేవు. భారత్‌లో ఎఫ్‌డీఐలు తగ్గడానికి మరో ప్రధాన కారణంకూడా ఉంది. 14 రంగాల్లో ముఖ్యంగా మొబైల్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితరాల్లో ఉత్పత్తితో ముడిపడిన ప్రోత్సాహకాలు (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్స్-పీఎల్‌ఐ) ఇవ్వడం అనేది సక్సెస్ కాలేదు. మౌలికసదుపాయాలు మెరుగు కాకపోవడం, రవాణా సౌకర్యాలు పెరగకపోవడం, లాజిస్టిక్స్ ఖర్చు పెరగడం వంటివి ప్రభావం చూపుతున్నాయి. ఆర్థిక నిపుణులు చెబుతున్న దానిని బట్టి చూసినా మొబైల్స్, ఫార్మా రంగాల్లోనే ఇది విజయవంతమైంది. ప్రస్తుత పరిస్థితుల్లో వియత్నాం, బంగ్లాదేశ్‌లలో ఎఫ్‌డీఐలు పెరుగుతున్నాయి.



రాష్ట్ర అవతరణకు మీరాకుమార్

- నిజాం కాలేజీ నుంచి గాంధీభవన్‌కు ర్యాలీగా రానున్న దళిత నేత
- వేడుకల నిర్వహణకు 29 మందితో టీపీసీసీ కమిటీ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ వేడుకలకు లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ ముఖ్య అతిథిగా రానున్నారు. నిజాం కళాశాల సమీపంలోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి గాంధీభవన్ వరకు జరిగే ర్యాలీలో ఆమె పాల్గొంటారు. అనంతరం గాంధీభవన్‌లో టీపీసీసీ నిర్వహించనున్న సభలో ఆమె ప్రసంగిస్తారు. 'తెలంగాణ'బిల్లు ఆమోదం కోసం లోక్‌సభలో ఆమె క్రియాశీల పాత్ర పోషించినందుకు గాను మీరాకుమార్‌ను టీపీసీసీ సన్మానించనుంది. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో జరిగే జాతీయ జెండావిష్కరణ, ర్యాలీ, సభకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. చిన్నారెడ్డి చైర్మన్‌గా కమిటీ కాగా, వచ్చే నెల 2వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణ కోసం టీపీసీసీ.. ఏఐసీసీ కార్యదర్శి జి.చిన్నారెడ్డి చైర్మన్‌గా 29 మందితో కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీలో మాజీ ఎమ్మెల్సీ బి.కమలాకర్‌రావు, పార్టీ నేతలు శ్యాం మోహన్, నిరంజన్, చెరుకు సుధాకర్, చల్లా నర్సింహారెడ్డి, నందికంటి శ్రీధర్, సమీర్ వలీవుల్లా, రోహిణ్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, బెల్లయ్య నాయక్, అద్దంకి దయాకర్, మానవతారాయ్, లక్ష్మణ్ యాదవ్, పున్నా కైలాశ్ నేత, బాలలక్ష్మి, భవానీ రెడ్డి, దుర్గం భాస్కర్, కేకే మహేందర్‌రెడ్డి, ఎండీ రియాజ్, అయోధ్యరెడ్డి, పవన్ మల్లాది, మధుసూదన్‌గుప్తా, వరంగల్ రవి, అనిల్‌కుమార్, గ్యాన్ సుందర్, మాదంశెట్టి అనిల్, మహ్మద్ అయూబ్, వేణురాజ్‌లను పలు హోదాల్లో నియమించారు.

మంత్రుల పర్యటనల్లో విపక్షాల అరెస్టులా?

- అధికార నేతలకు పోలీసుల్లేకుండా ప్రజల వద్దకు వచ్చే దమ్ముందా?
- ప్రభుత్వాన్ని నిలదీసిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- అచ్చంపేటలో మంత్రి హరీశ్ పర్యటన వేళ విపక్ష నేతల్ని అదుపులోకి తీసుకోవడంపై ధ్వజం
- నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లిలో పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర



మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

పెద్ద కొత్తపల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలకు పోలీసులు వెంట లేకుండా ప్రజలకు వద్దకు వచ్చి మాట్లాడే దమ్ము, ధైర్యం ఉందా? అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. పోలీసు భద్రత లేకుండా తిరిగితే వారి పరిస్థితి ఏమిటో అప్పుడు అర్థమవుతుందన్నారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా చంద్రకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు అచ్చంపేటలో ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించడానికి వస్తే కాంగ్రెస్, ఇతర పార్టీల నేతలను ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మంత్రులు వస్తున్నప్పుడు ముందస్తు అరెస్టులు ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. ప్రజలను కలవకుండా ప్రారంభోత్సవాలు చేసుకోవడం దేని కోసమని భట్టి ప్రశ్నించారు. 'ప్రజలేమైనా దోపిడీదారులా, దొంగలా.. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలను ఏమైనా నిషేధించారా?'అని ధ్వజమెత్తారు. ప్రశ్నించే అధికార పార్టీ నాయకులను సైతం అరెస్టు చేయించే స్థాయికి ఈ ప్రభుత్వం దిగజారిందని విమర్శించారు. పాలకులు చెప్పినట్లు కాకుండా పోలీసులు చట్టానికి లోబడి పనిచేయాలని, ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడటానికి వ్యవస్థీకృతమైన పోలీసు వ్యవస్థ ప్రజల కోసం పనిచేసేలా ఉండాలని భట్టి సూచించారు. తప్పులు చేస్తున్న అధికారుల లెక్కలు రాస్తున్నామని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలను భయపెట్టి పాలించడం కాదని.. ప్రజల హృదయాలు గెలిచి పరిపాలన సాగించాలని సూచించారు.

మాదాసి కురువలకూ గొర్రెలు: తలసాని

మహబూబ్‌నగర్ జిల్లా వాసుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి



మంత్రి తలసానికి వినతి పత్రం అందజేస్తున్న మాదాసి కురువలు

సాక్షి, హైదరాబాద్: అర్హులైన మాదాసి కురువలందరికీ సబ్సిడీ గొర్రెల యూనిట్లు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధిశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. జోగులాంబ గద్వాల, ఆలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం ఆధ్వర్యంలో మాదాసి కురువలు మంత్రి తలసానిని మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి సబ్సిడీ గొర్రెల యూనిట్ల కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గొర్రెల పెంపకం వృత్తిగా చేసుకొని జీవనం సాగిస్తున్న మాదాసి కురువలకు కూడా గొర్రెల యూనిట్లను పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారులు తమ వాటాధనం డీడీలను అధికారులకు అందించాలని సూచించారు. గొర్రెల పెంపకందారుల వృత్తిని మరింత ప్రోత్సహించాలనే సీఎం ఆలోచన మేరకు గొర్రెల పంపిణీని ప్రారంభించామని, ప్రభుత్వం ఇచ్చే గొర్రెలను సక్రమంగా పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పథకం ప్రారంభంలోనే మాదాసి కురువలకూ గొర్రెల యూనిట్లను అందించే యోచన ప్రభుత్వం చేసిందని, కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుదారి పట్టించి అడ్డుకున్నారని మంత్రి తలసాని ఆరోపించారు.

రైతులకు సీఎం కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి

ధరణిలో తప్పిదాలపై ఎం.కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ధరణీ పోర్టల్‌పట్ల రైతులు మండిపడుతున్నారని, ధరణిలో తప్పిదాలకు బాధ్యత వహిస్తూ దశాబ్ది ఉత్సవాల్లో సీఎం కేసీఆర్ వారికి క్షమాపణ చెప్పాలని ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ధరణిపై ప్రభుత్వం సానుకూల ప్రచారం చేసుకుంటోందని, వాస్తవానికి పోర్టల్‌పై ప్రజల్లోని వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం: కేటీఆర్

- సౌత్ రాష్ట్రాలకు తక్కువ ఎంపీ సీట్లు
- జనాభాను నియంత్రించాలన్న కేంద్రం పిలుపును పట్టించుకోని ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు
- అసంబద్ధమైన డీ లిమిటేషన్‌తో దక్షిణాదికి ప్రాధాన్యత తగ్గుతుందని కేటీఆర్ ఆందోళన



సాక్షి, హైదరాబాద్: జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సీట్లను పునర్విభజన (డీలిమిటేషన్) చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. 2026లో లోక్‌సభ స్థానాల పునర్విభజన ఫలితంగా సీట్ల సంఖ్య పెరగనున్న నేపథ్యంలో మంగళవారం కేటీఆర్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అధిక జనాభాతో సతమతమవుతున్న దేశాన్ని కాపాడుకునేందుకు జనాభా నియంత్రణ పద్దులు పాటించాలని దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వం చెప్తూ వస్తోందని గుర్తుచేశారు. దీంతో ప్రగతిశీల విధానాల అమల్లో ముందుండే దక్షిణాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించాయని, జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు ఏర్పడితే నష్టపోయే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. డీ లిమిటేషన్ జరిగితే జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ సీట్లు దక్కుతాయని, కేంద్రం విజ్ఞప్తిని పట్టించుకోకుండా జనాభా నియంత్రణ చేయని ఉత్తరాది రాష్ట్రాలు సీట్ల పెరుగుదలతో లబ్ధి పొందుతాయని అంచనా వేశారు.

దక్షిణాది రాష్ట్రాలు గళమెత్తాలి


ప్రగతిశీల విధానాలతో జనాభాను నియంత్రించిన కేరళ, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు నష్టపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణతో పాటు అన్ని విధాలైన మానవాభివృద్ధి సూచీల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కేవలం 18 శాతం జనాభా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు 35 శాతం జాతీయ స్థూల జాతీయోత్పత్తికి నిధులు సమకూరుస్తున్నాయని వివరించారు. జాతీయాభివృద్ధికి దోహదం చేస్తున్న దక్షిణాది రాష్ట్రాలు అసంబద్ధమైన లోక్‌సభ డీలిమిటేషన్ వల్ల భవిష్యత్తులో తమ ప్రాధాన్యతను కోల్పోతాయని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలు రాజకీయాలకు అతీతంగా తమ గొంతును వినిపించేందుకు గళమెత్తాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

ట్యాంక్‌బండ్ పరిశుభ్రతకు కేటీఆర్ పిలుపు

మహానగరానికి మణిహారం.. శతాబ్దాల ఘన చరిత్రకు ప్రతీక ట్యాంక్‌బండ్ అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పర్యాటక కేంద్రమైన ట్యాంక్‌బండ్‌ను, దాని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా ఓ వీడియోను, వివిధ ఫొటోలను విడుదల చేస్తూ ట్యాంక్‌బండ్ ప్రాధాన్యాన్ని వివరించారు.

ఓఆర్‌ఆర్ టెండర్‌పై విచారణ జరపాలి

సీఎం కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) టోల్ టెండర్ ప్రక్రియలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని, వాస్తవాలను బహిర్గతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు మంగళవారం లేఖ రాశారు. టెండర్ అప్పగింత విషయంలో ప్రభుత్వం అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఓఆర్‌ఆర్‌పై ఏడాదికి రూ.415 కోట్ల ఆదాయం వస్తోందని, ఏటా 5% పెంచుకుంటూ పోయినా 30 ఏళ్లకు ప్రభుత్వానికి రూ.30 వేల కోట్ల ఆదాయం చేకూ రేదని పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయానికి గండికొట్టి మరీ టెండర్ ఇవ్వడం ఏమిటని, ఈ విషయంలో ప్రభుత్వం గోప్యత ఎందుకు పాటిస్తోందని ప్రశ్నించారు. హైదరాబాద్ ఓఆర్‌ఆర్ టెండర్ దక్కించుకున్న ఐఆర్బీ సంస్థే మహారాష్ట్రలోనూ టోల్ మెయింటెనెన్స్ చూస్తోందని, తక్కువ దూరం, తక్కువ కాలానికి అక్కడి ప్రభుత్వం టెండర్ అప్పగించినప్పుడు, ఎక్కువ కాలం, ఎక్కువ దూరానికి తక్కువ ధరకు టెండర్ ఇవ్వాల్సిన అవసరం ఏమిటని నిలదీశారు. ఓఆర్‌ఆర్‌పై వార్తలు రాసినా, పార్టీలు ప్రశ్నించినా లీగల్ నోటీసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నదని విమర్శించారు. సీఎం మౌనం వల్ల ఓఆర్‌ఆర్ టెండర్‌లో భారీ స్కామ్ జరిగిందనే అనుమానాలు బలపడుతున్నాయన్నారు. దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం, అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సీఎంగా కేసీఆర్‌పై ఉందన్నారు.

మద్యం అమ్మకాల్లో తెలంగాణ ప్రథమం: బండి

కరీంనగర్ టౌన్: విచ్చలవిడి మద్యం అమ్మకాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎద్దేవా చేశారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యుత్, ఆర్టీసీ, పెట్రోల్, డీజిల్, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచిందని విమర్శించారు. ఉచిత పథకాలతో మభ్యపెట్టడానికి వస్తున్న సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. కరీంనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో సంజయ్ మాట్లాడారు. ఐకేపీ వీఓఏల న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

నోటీసులు అందాక స్పందిస్తా..

బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాక టౌన్: పరువు నష్టం దావా నోటీసులు ఇచ్చారంటూ ప్రచారం జరుగుతుందని, అందులో నిజంలేదని దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం దుబ్బాకలో ఆయన మీడియాతో మాట్లాడారు. టోల్‌గేట్ విషయంలో రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వానికి జరుగుతున్న నష్టాన్ని విశదీకరిస్తూ టెండర్‌లో పాల్గొన్న వివిధ సంస్థలు ఆ సంస్థల కార్యకలాపాలపై మీడియాతో మాట్లాడగా..పరువు నష్టం దావా నోటీసులు ఇచ్చారంటూ ప్రచారం జరుగుతోందని తెలిపారు. నోటీసులకు భయపడే స్థితిలో నేను లేనని, రఘునందన్‌రావు అంటే ప్రశ్నించే గొంతుకగా ప్రజలు నమ్మారని, వ్యక్తిగతంగా ఎవరినీ దూషించలేదని, సంస్థ పేరు చెప్పి బ్లాక్‌మెయిల్ చేసే వాడిని కాదని ఆయన అన్నారు.

ప్రతీ ఒక్కరికి మేలు జరిగేలా...

- ఆయా అంశాలను గుర్తించి నివేదిక సిద్ధం చేసేందుకు బీజేపీ నిర్ణయం
- అధ్యయనం చేసి నివేదిక ఇచ్చే బాధ్యత టాస్క్‌ఫోర్స్ కమిటీకి..
- మేనిఫెస్టో రూపకల్పన కోసం కసరత్తు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి మేలు జరిగే అంశాలను గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని బీజేపీ నిర్ణయించింది. ఈ బాధ్యతను పార్టీ టాస్క్‌ఫోర్స్ కమిటీకి బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ అప్పగించారు. ప్రజలకు మేలు చేసే అంశాలేంటి? ఎస్సీ, ఎస్టీ, బీసీలుసహా అన్నివర్గాల అభ్యున్నతికి ఏం చేయాలన్న దానిపై లోతుగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఈ కమిటీని ఆదేశించారు. దీనికి సంబంధించి వివిధ రంగాల నిపుణులు, ప్రముఖులతో సంప్రదింపులు జరిపి సమగ్ర నివేదికను అందించాలని సూచించారు. ఈ అధ్యయనంలో భాగంగా గత మూడేళ్లలో ఇచ్చిన హామీలు, రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపైనా కమిటీ దృష్టి సారించనుంది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సీహెచ్ విఠల్ నేతృత్వంలో ఏర్పాటైన టాస్క్ ఫోర్స్ కమిటీ ఈ నివేదిక పనిలో నిమగ్నమైంది. ఈ కమిటీలో సభ్యులుగా మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ చంద్రవదన్, రిటైర్డ్ ఐపీఎస్ క్రిష్ణప్రసాద్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్, మహిళా మోర్చా జాతీయ నేత కరుణా గోపాల్ ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం బీసీ సబ్ ప్లాన్, డిక్లరేషన్‌పై వివిధ రంగాల నిష్ణాతులతో కమిటీ సమావేశం కానుంది. టాస్క్‌ఫోర్స్ కమిటీ నివేదిక సిద్ధం కాగానే కోర్ కమిటీ, రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి మేనిఫెస్టో రూపొందించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. అలాగే, హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపైనా అధ్యయనం చేయాలని నిర్ణయించింది.

ఏడాది కోర్సుకు నర్సింగ్ కౌన్సిల్ శ్రీకారం

- ఆయుర్వేద నర్సింగ్ రెసిడెన్సీ ప్రోగ్రామ్ ప్రవేశపెట్టాలని నిర్ణయం
- ఆయుర్వేద చికిత్సల్లో స్పెషలిస్ట్ నర్సులను సిద్ధం చేయడమే లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: ఆయుర్వేద చికిత్సలో భాగంగా ఆయుర్వేద నర్సింగ్ రెసిడెన్సీ ప్రోగ్రామ్‌ను పోస్ట్ బేసిక్ డిప్లొమా కింద ప్రవేశపెట్టాలని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. వివిధ ఆరోగ్య సమస్యల కోసం ఆయుర్వేద చికిత్సను కోరుకునే రోగులకు సమర్థవంతమైన సంరక్షణను అందించగల స్పెషలిస్ట్ నర్సులను సిద్ధం చేయడం ఈ ఆయుర్వేద నర్సింగ్ రెసిడెన్సీ ప్రోగ్రామ్ లక్ష్యం. ఆయుర్వేదం ప్రకారం నర్సింగ్ సేవలనేవి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ప్రధాన స్తంభాల్లో కీలకమైనవి. పోస్ట్ బేసిక్ డిప్లొమా ఆయుర్వేద స్పెషాలిటీ నర్సింగ్ రెసిడెన్సీ ప్రోగ్రామ్ అనేది ఏడాది కోర్సు. బీఎస్సీ లేదా జీఎన్‌ఎం నర్సులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. థియరీ 20 శాతం, ప్రాక్టికల్ (క్లినికల్, ల్యాబ్) 80 శాతం ఉంటుంది.

రోగులకు నాణ్యమైన సంరక్షణ అందంచడానికే..: ఆయుర్వేద ఆసుపత్రుల్లో చేరిన వివిధ రోగులకు నాణ్యమైన సంరక్షణను అందించడానికి అనువైన నైపుణ్యం అందజేయడానికి వీలుగా నర్సులను సిద్ధం చేయడానికి ఈ కార్యక్రమం రూపొందించారు. సాంకేతికంగా అర్హత కలిగిన, శిక్షణ పొందిన స్పెషలిస్ట్ నర్సులను సిద్ధం చేయడం దీని లక్ష్యమని నర్సింగ్ కౌన్సిల్ స్పష్టం చేసింది. ఆయుర్వేదంలో ఉండే వివిధ చికిత్సలు, చికిత్సా విధానాలను రోగులకు నర్సులు వివరించాలి. జీవనశైలిలో మార్పు వంటి వివిధ పద్ధతుల ద్వారా రోగుల్లో వ్యాధిని నయం చేయగలగాలి. ఆహార వినియోగం, యోగా పద్ధతులను చెప్పగలగాలి. అలాగే ఆయుర్వేద ఔషధాల సేకరణ, నిల్వ, నిర్వహణలపై వీరు అవగాహన పెంపొందించుకోవాల్సి ఉంటుంది. కాగా కనీసం 100 పడకలు కలిగి ఉన్న ఆయుర్వేద ఆసుపత్రి (గ్రాడ్యుయేట్/పోస్ట్ గ్రాడ్యుయేట్)లో ఈ కోర్సుకు అనుమతిస్తారు. అన్ని రకాల ప్రత్యేక నర్సింగ్ కేర్ సదుపాయాలతో రోగనిర్ధారణ, చికిత్స, అత్యాధునిక ఆయుర్వేద థెరపీ యూనిట్లు ఇతర వసతులు ఉండాలి. అర్హతలు కలిగిన సంస్థలు ఆయుర్వేద స్పెషాలిటీ నర్సింగ్‌లో పోస్ట్ బేసిక్ డిప్లొమా కోసం అనుమతి తీసుకోవాలి.



తల్లిదండ్రులకు సాయంగా ఉండటం, భార్యా పిల్లల్ని పోషించుకోవడం, శాంతిమయ వృత్తిలో కొనసాగడం – ఇదే జీవితంలో గొప్ప వరం.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 31 మే 2023

ప్రజాస్వామ్యంలో నిరంకుశ నేత

నిరంకుశులు అధికారంలో ఉంటే ప్రజాస్వామ్యం పేరుకే మిగులుతుంది. అతి జాతీయవాదం ప్రబలినప్పుడు ఆలోచనను అది మింగేస్తుంది. ఆ చేదు నిజానికి టర్కీ (తుర్కియే) మరోసారి సాక్షీభూతమైంది. తొలి దఫాలో ఫలితం తేలకపోయేసరికి రెండో దఫా సాగిన ఎన్నికలు, నాటకీయ ఫక్కీలో రోజుకొకరిది ఆధిక్యంగా మారిన ఎన్నికల ప్రచారం తర్వాత టర్కీ తాజా అధ్యక్ష ఎన్నికల్లో ఎర్డొగాన్ తన పట్టు నిలబెట్టుకున్నారు. ఎన్నికలు 'అత్యంత న్యాయవిరుద్ధంగా సాగా'యన్న ప్రత్యర్థి మాటలు ఎలావున్నా లెక్కల్లో అంతిమ విజయం ఎర్డొగాన్‌దే అయింది. దేశంలో ద్రవ్యోల్బణం ఆకాశానికి ఎగబాకినా, కరెన్సీ విలువ పాతాళానికి పడిపోయినా ఆయన మాత్రం ప్రపంచ వేదికపై దేశప్రతిష్ఠను పెంచానని పౌరులకు నమ్మబలికారు. కుర్దిష్ వేర్పాటువాదుల్ని తన ప్రత్యర్థి సమర్థిస్తున్నారంటూ నమ్మించారు. అతి జాతీయవాదంతో ఆధిక్యాన్ని నిలుపుకొన్నారు. అదే ఈ ఎన్నికల విడ్డూరం.

2017లో రిఫరెండం ద్వారా టర్కీలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అధ్యక్ష తరహా పాలనగా మార్చిందీ, ఆ పైన ప్రధాని పదవిని రద్దు చేసిందీ ఎర్డొగానే. న్యాయవ్యవస్థ, ఎన్నికల నిర్వహణ వ్యవస్థ సహా ప్రభుత్వ వ్యవస్థలన్నిటినీ నియంత్రణలో పెట్టుకున్న ఘనుడాయన. నైపుణ్యం కన్నా విధేయతే గీటురాయిగా అయినవాళ్ళతో వాటిని నింపేశారు. ప్రధాన స్రవంతి మీడియా అంతా చేతుల్లో ఉన్న ఆయనకు ఎన్నికల ప్రచారం పరాకాష్ఠకు చేరినవేళ 32 గంటల ప్రసార సమయం లభిస్తే, ప్రత్యర్థికి దక్కింది 32 నిమిషాలే. విజయానికై ఎంతకు దిగజారడానికైనా వెనుకాడకపోవడం ఆయన నైజం. దాంతో, దేశంలో ఎన్నడూ లేనన్నిసార్లు హత్యాయత్నం జరిగిన నేతగా పేరొందిన ప్రతిపక్షాల అభ్యర్థి కెమల్ కిలిచదరోగ్లూ చివరకు బహిరంగ సభల్లో బుల్లెట్ ప్రూఫ్ చొక్కా వేసుకొని, ప్రచారం చేయాల్సిన దుఃస్థితి. మాటల్లో సౌమ్యత, మనిషి కొంత మహాత్మా పోలికలతో 'గాంధీ కెమల్' అని ముద్దుగా అందరూ పిలుచుకొనే ప్రజాస్వామికవాది ఓడిపోయారు.

నిజానికి 600 సభ్యుల పార్లమెంట్‌కూ, అధ్యక్ష స్థానానికీ మే 14న జరిగిన ఎన్నికలు ప్రస్తుత అధ్యక్షుడిని ఇంటికి సాగనంపి, ప్రతిపక్షాల సమష్టి అభ్యర్థి కెమల్‌కు పట్టం కడతాయని భావించారు. ఎన్నికల జోస్యాలూ ఆ మాటే చెప్పాయి. తీరా జరిగింది వేరు. 6.4 కోట్ల మంది ఓటర్లలో 88 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొంటే, 49.5 శాతం ఓట్లు ఎర్డొగాన్‌కూ, 44.8 శాతం ప్రత్యర్థికీ వచ్చాయి. ఆయన కూటమి 'పీపుల్స్ అలయన్స్' పార్లమెంట్‌లో 323 స్థానాలు, ప్రత్యర్థి 'నేషన్ అలయన్స్'కు 213 స్థానాలు దక్కాయి. అధ్యక్ష పదవికి కావాల్సిన 50 శాతం ఓట్ల కోసం దేశ చరిత్రలో తొలిసారిగా కథ రెండో దఫా ఎన్నికల దాకా సాగింది. ఈ మదగజాల పోరులో సుమారు కోటి మంది సిరియన్ శరణార్థుల గోడు ఎవరికీ పట్టలేదు. ఇరుపక్షాలూ శరణార్థుల్ని వెనక్కి పంపేస్తామన్నాయి. సౌమ్యుడైన కెమల్ సైతం చివరకు ఓట్ల పునాదిని పెంచుకొనే వ్యూహంతో శరణార్థులపై కటువుగా మాట్లాడారు. అయినా లాభం లేకపోయింది. మే 28న రెండో దఫాలో 84 శాతం ఓట్లు పోలైతే, 48 శాతం వద్దే ప్రత్యర్థి ఆగిపోయారు. 52 శాతం ఓట్లతో ప్రస్తుత అధ్యక్షుడికే పట్టం దక్కింది.

ఇల్లలకగానే పండగ కాదన్నట్టు... ఎన్నికల్లో ఎర్డొగాన్ గెలిచారు కానీ, కథ అయిపోలేదు. అసలు కథ ఇప్పుడే మొదలైంది. ఇప్పటికి గెలిచినా, భిన్న ధ్రువాలుగా చీలిపోయిన దేశంలో, ఆయన అజెండాను ఇప్పటికీ 47 శాతం పైగా వ్యతిరేకిస్తున్నారని మర్చిపోరాదు. అందుకే, వరుసగా అయిదోసారి అధ్యక్షుడై, అధికారంలో మూడో దశాబ్దంలోకి అడుగిడుతున్న ఆయన ముంగిట అనేక సవాళ్ళున్నాయి. టర్కీలో ద్రవ్యోల్బణం 44 శాతానికి చేరింది. 2018 నుంచి ఇప్పటికి కరెన్సీ విలువ 80 శాతం క్షీణించింది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు 151 మిలియన్ డాలర్ల లోటులో పడ్డాయి. ఫిబ్రవరిలో 50 వేల మంది మరణించిన భారీ భూకంప వేళ సర్కార్ పనితీరూ అంతంత మాత్రమే. ఇన్ని కష్టాల మధ్యా యూఏఈ, సౌదీ, రష్యాల నుంచి గణనీయ విదేశీ సాయంతో బండి నెట్టుకొచ్చారు. రానున్న అయిదేళ్ళలో ఈ నిరంకుశ నేత ఆర్థికవ్యవస్థను ఎలా సుస్థిరం చేస్తారన్నది ఆసక్తికరం.

ఇక, భౌగోళికంగా ఆసియా – ఐరోపాల కొసన ఉండడం, ముస్లిమ్ ప్రపంచంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండడంతో వ్యూహాత్మకంగా అత్యంత కీలక ప్రపంచ దేశాల్లో టర్కీ ఒకటి. రష్యా నుంచి లాభపడుతున్న ఈ 'నాటో' సభ్యదేశపు విదేశాంగ విధానం స్పష్టమే. రష్యాకూ, పాశ్చాత్య ప్రపంచానికీ మధ్య సాగుతున్న ప్రస్తుత పోరాటంలో ఆ దేశం తన వైఖరిని మార్చుకోదు. పాశ్చాత్య ప్రపంచానికి కాక పుట్టేలా ప్రాంతీయంగా, విదేశీ వ్యవహారాల్లో వ్యూహాత్మక స్వతంత్రతను చూపనుంది. భారత్‌తో ఒకప్పుడు బలమైన బంధమున్నా, 370వ అధికరణం రద్దు తర్వాత కశ్మీర్‌పై ఎర్డొగాన్ ప్రకటనలు, పాక్‌తో సాన్నిహిత్యం నేపథ్యంలో మన సంబంధాలెలా ఉంటాయో వేచి చూడాలి.

మొత్తం మీద ఎన్నికలనేవి అన్నిసార్లూ ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్న నమ్మకాన్ని అందిస్తాయని చెప్పలేం. ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేసి, అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసే నిబంధనల్ని మార్చేసి, అసలు స్ఫూర్తికే తిలోదకాలిచ్చినప్పుడు ఎన్నికలు నామమాత్రమే! ప్రజాస్వామ్యం పేరుకే! సైన్యం తెర వెనుక ఉండి కథ నడిపే పాకిస్తాన్ సహా అనేక దేశాల్లో ఇదే ప్రహసనం. దశాబ్ది పైచిలుకుగా టర్కీలో ఎర్డొగాన్ చేసిందీ, జరిగిందీ ఇలాంటి ప్రజాస్వామ్య పరిహాసమే. కానీ, అధికారాన్ని నిలుపుకోవడానికి అక్కరకొచ్చిన ఈ ఆట ఆర్థిక కష్టాల్లోని దేశాన్ని ముందుకు నడిపించడానికి ఇకపైనా పనికొస్తుందా?

నిజాయితీయే నిజమైన విలువ

కామెంట్



కరణ్ థాపర్


చిన్మయ ఘరేఖాన్ రాసిన 'సెంటర్స్ ఆఫ్ పవర్: మై ఇయర్స్ ఇన్ ది ప్రైమ్ మినిస్టర్స్ ఆఫీస్ అండ్ సెక్యూరిటీ కౌన్సిల్' అనే తాజా పుస్తకం ఆయన రాసుకున్న డైరీల ఆధారంగా రూపొందినది. పుస్తకంలోని రహస్యోద్ఘాటనలు ఇందిరా గాంధీని రెండు విధాలుగా చూపుతాయి. మనోహరంగా, ఆకర్షణీయంగా; అలాగే అభద్రత, అహంకారం కలిగి ఉండి, కుటుంబమే సర్వస్వం అయిన వ్యక్తిగా! ఇందిరా గాంధీలోని ఎవరికీ తెలియని మరికొన్ని కోణాలను కూడా ఘరేఖాన్ దాచిపెట్టే ప్రయత్నం చేయలేదు. ఈ విధంగా దేశాధినేతల గురించి, వారికి సమీపంగా దీర్ఘకాలం ఉన్నత పదవులను నిర్వహించినవారు తమ డైరీలలో నిజాయితీగా రాసి పెట్టుకున్న విశేషాలతో తెచ్చిన పుస్తకాలు ఎంతో విలువను, ప్రతిష్ఠను కలిగి ఉంటాయి.

డైరీలు రాసే సంప్రదాయం మన దగ్గర గట్టిగా లేకపోవడం సిగ్గు చేటు. మళ్లీ బ్రిటిష్ వాళ్లకు ఆ భాగ్యం ఉంది. అక్కడి శామ్యూల్ పెపిస్ నుంచి రిచర్డ్ క్రాస్‌మన్ వరకు, ఆపై ఉడ్రో వ్యాట్ దాకా... పఠనాన్ని మంత్రముగ్ధం చేస్తూ డైరీలు రాశారు. మరీ ముఖ్యంగా దేశాన్ని పాలిస్తున్న స్త్రీ, పురుషుల గురించి వారు తమ డైరీలలో మొత్తం బహిర్గతం చేశారు. లేకుంటే మనం ఆ విశేషాలను ఎప్పటికీ తెలుసుకోగలిగేవాళ్లం కాదు. వారి నిజాయితీనే ఆ డైరీలకుండే నిజమైన విలువ.

ఉడ్రో వ్యాట్ రాసిన మూడు సంపుటాల డైరీల గురించి నాటి 'సండే టైమ్స్' ఎడిటర్ ఆండ్రూ నీల్, "ఈ దేశ పాలకులు, సామాజిక విశిష్టులకు సంబంధించి చేర్పులు లేని వాస్తవాలను ఇవి కలిగి ఉన్నాయి" అని కితాబునిచ్చారు. మార్గరెట్ థాచర్ జీవిత చరిత్రకారుడైన ప్రముఖుడు చార్ల్స్ మోర్, "ఆమె తన సన్నిహితుల సమక్షంలో ప్రజా కార్యక్రమాలపై వ్యక్తం చేసిన వ్యక్తిగత ప్రతిస్పందనలు తరచు ఆ డైరీలలో కనిపించేవి" అని వ్యాఖ్యానించారు. ఇంకో మాటలో చెప్పాలంటే, అమూల్యమైన అంతర్నేత్ర దృష్టికి వారి డైరీలు నెలవుగా ఉండేవి.

ఇన్నాళ్లకు, మనకూ అలాంటి ఒక పోల్చుకోదగిన డైరీ లభ్యమైంది! చిన్మయ ఘరేఖాన్ రాసిన 'సెంటర్స్ ఆఫ్ పవర్: మై ఇయర్స్ ఇన్ ది ప్రైమ్ మినిస్టర్స్ ఆఫీస్ అండ్ సెక్యూరిటీ కౌన్సిల్' అనే పుస్తకం ఆనాడు ఆయన రాసుకున్న డైరీల ఆధారంగా రూపొందినదే. పుస్తకంలోని విశేషాంశాలు ఇందిరా గాంధీని రెండు విధాలుగా చూపుతాయి. మనోహరంగా, ఆకర్షణీయంగా; అలాగే అభద్రత, అహంకారం కలిగి ఉండి, కుటుంబమే సర్వస్వం అయిన వ్యక్తిగా. మరోలా చెప్పాలంటే... ప్రధానమంత్రి వెనుక ఉన్న అసలు స్వరూపాన్నీ (కొన్నిసార్లు ఆ స్వరూపం లోపభూయిష్ఠంగా ఉంటుంది), అదే సమయంలో... అందరిలాంటి ఒక మామూలు మనిషినీ ఈ పుస్తకం దృగ్గోచరం చేస్తుంది.

మొదట చిన్న విషయాలు. సమావేశాలలో ఉన్నప్పుడు ఇందిరా గాంధీ తన చేతి గోళ్ల ఎగుడు దిగుడులను అందంగా సమం చేసుకుంటూ కనిపించేవారు. అయినప్పటికీ, "సమావేశంలోని ఏ మాటా ఆమె చెవులను దాటి వెళ్లేది కాదు". ఆమెకు కొన్ని గాఢమైన నమ్మకాలు ఉండేవి. "ఇంటి నుండి ఆఫీసుకు బయల్దేరవలసిన ఘడియలను కూడా ఆమె జ్యోతిష్య పండితులు నిర్ణయించేవారు". ఆమెలో హానికరం కాని 'పట్టిపీడించే ఆలోచనలు' (అబ్సెషన్స్) కొన్ని ఉండేవి. "లేఖలు రాయడాన్ని ఇందిరా గాంధీ ఇష్టపడేవారు. అంతకంటే కూడా లేఖల చిత్తుప్రతుల్ని, ప్రసంగ పాఠాలను, సందేశాలను స్వయంగా సవరించడానికి ఆసక్తి కనబరిచేవారు". ఇక ఆ పూట భోజనంలోకి ఏయే వంటకాలు ఉండాలన్నది నిర్ణయించడానికి గంటల సమయం వెచ్చించేవారు. కామన్‌వెల్త్ సదస్సుకు హాజరైన ప్రభుత్వాధినేతల కోసం ఆమె భారత దౌత్యవేత్త శంకర్ బాజ్‌పేయితో కలిసి మెనూ తయారీకి 45 నిముషాల సమయం తీసుకున్నారు. బ్రిటన్ రాణి గారికి ఉదయం పూట అల్పాహారంలో, మధ్యాహ్నం భోజనానికి, సాయంత్రం విందులోకి ఏమేమి తయారు చేస్తున్నారో ఆ జాబితానూ ప్రతిరోజూ తను చూడాలని కోరుకునేవారు.



చిన్మయ ఘరేఖాన్

బ్రిటన్ పట్ల ఇందిరా గాంధీ వైఖరి గురించి ఘరేఖాన్ తన పుస్తకంలో రాసిన విషయాలను చదివి నేను పరవశుడినయ్యాను. "ప్రధాని ఇందిరా గాంధీ బ్రిటన్‌ను, ప్రధానంగా బ్రిటన్ రాచకుటుంబీకులను ఎప్పుడూ కూడా ఇష్టపడకుండా లేరు". 1983లో రాణిగారికి లండన్‌లోని ఇండియన్ హై కమిషనర్ నివాస గృహంలో భోజన ఏర్పాట్లు జరుగుతున్నప్పుడు... న్యూయార్క్ నుంచి నేరుగా భారత్‌కు తిరిగి వస్తున్న ఇందిరా గాంధీ అర్ధంతరంగా లండన్‌లో దిగి... భారత హై కమిషనర్, ఆయన భార్య ఆ ప్రత్యేక భోజన సందర్భాన్ని చక్కగానే నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని నిర్ధారించుకున్నారు. "రాణి గారి సమక్షంలో ఎలా ప్రవర్తించవలసిందీ హై కమిషనర్‌కు చెప్పారు". (ఎప్పుడూ కూడా రాణిగారి వైపు మీ వీపు భాగం తిరిగి ఉండకూడదని సూచించారు).

ఇందిరా గాంధీ తోట పని చేసేవారు. ఇంట్లో ఫర్నిచర్ అమరికల్లో తరచు మార్పులు చేస్తుండేవారు. వాకిళ్లకు, కిటికీలకు వేసే పరదాలలో కొత్త డిజైన్‌ల ఎంపిక కోసం ఇంటి అలంకరణ నిపుణులకు – ప్రత్యేక అతిథులను తోడుగా ఇచ్చి – విదేశాలకు పంపుతుండేవారు. ఆ ప్రత్యేక అతిథులలో రాజవంశీయుడైన మాధవరావు సింధియా కూడా ఒకరు.

1981లో ప్రిన్స్ చార్ల్స్ వివాహ మహోత్సవానికి హాజరు అయేందుకు అమితమైన ఆసక్తిని కనబరిచి కూడా చివరికి హాజరు కాలేకపోయినందుకు ఇందిరా గాంధీ ఎంతగానో నిరాశకు లోనయ్యారని ఘరేఖాన్ రాశారు. "అప్పుడు ఆమెలో కనిపించిన ఆ స్థాయి నిస్పృహను మునుపెన్నడూ నేను చూడలేదు" అని ఘరేఖాన్ తన డైరీలో పేర్కొన్నారు. చార్ల్స్ పెళ్లి వేడుకకు తను వెళ్లడం లేదని మొదట చెప్పిన రాష్ట్రపతి ఆ తర్వాత వెళ్లాలని నిర్ణయించుకోవడంతో ప్రధాని ఆగిపోవలసి వచ్చింది.

ఇందిరా గాంధీ నోబెల్ శాంతి బహుమతిని అమిత ఆపేక్షగా కోరుకున్నారని కూడా పుస్తకంలో ఉంది. బహుమతిని దక్కించే ప్రచారం కోసం ఒక కమిటీ కూడా ఏర్పాటైంది. ఆ కమిటీకి ఘరేఖాన్ అధ్యక్షుడిగా ఉన్నారు. నిజానికి 'ఘనత' పట్ల ఆమె భ్రాంతికి ఇదొక్కటే నిదర్శనం కాదు. "ఇతర నాయకులను, చివరికి రాష్ట్రపతులను కూడా ఆమె తన దగ్గరికి పిలిపించుకోవడాన్ని గొప్పగా భావించేవారు". ఆమె ప్రత్యేక సహాయకుడు ఆర్.కె. ధావన్ ఆమెను కలవవలసిందిగా రాష్ట్రపతులకు ప్రొటోకాల్‌కు విరుద్ధంగా సమాచారం పంపేవారు.

ఇందిరా గాంధీలో ఉన్న ఒక వింతైన కోణాన్ని కూడా ఘరేఖాన్ దాచిపెట్టే ప్రయత్నం చేయలేదు. 1983 ఓస్లో పర్యటన సందర్భంగా సోనియా గాంధీ భారత రాయబారికి దిగువన ఉన్న వరుసలో కూర్చోవలసి వచ్చింది. "అప్పుడు ప్రధాని ఇందిర... సోనియాను పైవరుసకు చేర్చారు". అదేమీ నార్వే దేశ ప్రొటోకాల్‌కు అనుగుణంగా జరిగింది కాదు. సోనియాకు ప్రాముఖ్యం కల్పించడమే ఇందిరా గాంధీకి ప్రధానం అయింది.

నిజానికి రాయబారులను తక్కువగా చూడటం అసాధారణమేమీ కాదన్నట్లుగా కనిపించే అనేక సంఘటనల్ని ఈ పుస్తకం పేర్కొంది. "ఇందిరా గాంధీ ఎంతో అలవోకగా రాయబారులతో ఉదాసీనంగా, ధిక్కారంగా ప్రవర్తించడాన్ని నేను గ్రహించాను" అని రాసుకున్నారు ఘరేఖాన్.

ఘరేఖాన్ పేర్కొన్న సందర్భాలు ఎంత ఆసక్తిని రేకెత్తించేవీ, ఆంతరంగిక విషయాలను బహిర్గతం చేసేవీ అయినప్పటికీ... అవి ఇందిరా గాంధీ మరణించిన నలభై సంవత్సరాల తర్వాత పుస్తకంగా బయటికి వచ్చినవి. అదే మన్మోహన్ సింగ్, నరేంద్ర మోదీ హయాంలోని రాజకీయ ప్రముఖులెవరైనా డైరీలు రాసి ఉంటే అవి ఇప్పుడు ఇంకెంత ఆకట్టుకునేలా ఉంటాయో కదా? రచయితలకు కూడా ఆ డైరీలు ఆకర్షణీయతను తెస్తాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇక్కడెందుకీ ఎత్తుగడ?



గమనించండి. ఏ ఒక్క 'ధైర్యం గల జర్నలిస్టు' కూడా రెజ్లర్ల ఆరోపణల్లోని వివరాల్లోకి పోవడం లేదు. వాళ్లు మాట్లాడుతున్నదల్లా 'దేశం', 'గర్వం', 'పతకాలు'. ఈ జర్నలిస్టులే తరచుగా 'దుష్టుల చివరి ఆశ్రయం దేశభక్తి' అని ట్వీట్ చేస్తుంటారు.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

అడిగితే ఇచ్చేయాలా?



పాకిస్తాన్ పాత్రికేయుల వివేకానికి ఎవరూ సాటిరారు. ఒక మహిళా జర్నలిస్టు ప్రకారం, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఒక బ్లాక్‌మెయిల్ చేసే సంస్థ. కాబట్టి ప్రపంచం ఒక్కటై దాన్ని మూసేయించాలి. ఎందుకు? ముందు ఇంటిని సంస్కరించుకొమ్మని చెప్పి పాకిస్తాన్‌కు డబ్బు ఇవ్వడానికి నిరాకరించినందుకు!

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

పవిత్ర స్నానం



నా భార్య మనసులోని కోరిక తీరింది – గంగా దసరా ఉత్సవ శుభవేళ (మే 30) రిషీకేశ్ దగ్గర పవిత్ర గంగానదిలో స్నానం ఆచరించాం. హర్ హర్ గంగే, నమామి గంగే! (సిద్ధూ భార్య క్యాన్సర్‌తో పోరాడుతున్నారు.)

– నవజ్యోత్ సింగ్ సిద్ధు, మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత

అంతా మాయ



ఇటీవలి వరకూ కోవిడ్ వల్ల కొందరు ఆరోగ్యవంతులైన యువతీ యువకులు చనిపోయారని అనుకున్నాను. కానీ ఆ సంఖ్య 'సున్నా' అయివుంటుందని ఎప్పుడూ ఊహించ లేదు. నిజం 'సున్నా'. ఇజ్రాయిల్ మంత్రిత్వ శాఖ అధికారిక ఆరోగ్య నివేదిక యాభై ఏళ్లలోపు వారిలో సున్నా మంది మరణించారని చెబుతోంది. అసలు మహమ్మారే లేదు కదూ!

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

వెనకేసుకొస్తున్నారు!




ఇన్ని రోజులుగా నిరసన తెలియజేస్తున్న రెజ్లర్లతో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అవమానకరంగా ఉంది. మన రెజ్లర్లను కాకుండా బీజేపీ ఆయన్ని కాపాడేంతగా ఆ ఎంపీ ప్రత్యేకత ఏమిటి?

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

అక్షర చిత్రకళా ప్రేమికుడు

బహుముఖ ప్రజ్ఞాశాలురు అరుదుగా ఉంటారు. అటువంటివారిలో శీలా వీర్రాజు ఒకరు. ఆయన చిత్రకళ, సాహిత్యం రంగాలలో అద్భుతంగా రాణించారు. ఓ పత్రికలో సబ్-ఎడిటర్ కమ్ ఆర్టిస్ట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన 1963 లో రాష్ట్రప్రభుత్వ సమాచార పౌర సంబంధాల శాఖలో అనువాదకుడుగా చేరారు. ఉద్యోగ జీవితంలో కొనసాగుతూనే తీరిక సమయాల్లో చిత్రాలు వేశారు. రాష్ట్రంలోనూ, రాష్ట్రేతర ప్రాంతాలలోనూ ఉన్న పలు శిల్ప క్షేత్రాలను సందర్శించి చాలావాటిని తన రేఖల్లో బంధించారు. అలా వేసిన లేపాక్షి శిల్పాల స్కెచ్‌లను 1970లో హైదరాబాదు, బెంగుళూరు, జర్మనీలోని గోటింజెన్ నగరంలోనూ ప్రదర్శించారు. 1990లో ఈ స్కెచ్‌లను 'శిల్పరేఖ' పేరుతో వెలువరించారు. 2009లో 'శీలా వీర్రాజు చిత్రకారీయం' పేరుతో నీటి, నూనెరంగుల (వాటర్, ఆయిల్ కలర్స్) చిత్రాల పుస్తకాన్ని తీసుకొచ్చారు.

వీర్రాజు రచనల్లో ఎక్కువగా సున్నితమైన, హృదయగతమైన అంశాలు అగుపిస్తాయి. సంఘటన ప్రధానంగా కొన్ని కనిపించినా మనస్తత్వ చిత్రణ ప్రధానంగా రూపొందిన రచనలే ఎక్కువ. సాహిత్యంలోనూ, నిజ జీవితంలోనూ ఆయన కథలు, నవలల ఇతివృత్తాల్లో ప్రధానంగా ప్రేమ, స్నేహం, సౌందర్యారాధన, సౌజన్యం, సౌశీల్యం వంటి అంశాలే ఎక్కువగా చోటుచేసుకొన్నాయి.



శీలా వీర్రాజు

వ్యక్తుల మనస్తత్వాన్ని నిశితంగా పరిశీలించే ధోరణి, మనస్తత్వ చిత్రణ పట్ల ఆయనకున్న అభిలాష ఆయన రచనలన్నింటిలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. 'వెలుగు రేఖలు', 'కాంతి పూలు', 'మైనా', 'కరుణించని దేవత' వంటి నవలలు శీలా వీర్రాజుకి ఎంతో పేరును తెచ్చాయి. 'కొడిగట్టిన సూర్యుడు', 'హృదయం దొరికింది', 'మళ్లీ వెలుగు', 'కిటికీ కన్ను', 'ఎర్రడబ్బా రైలు', 'శీలా వీర్రాజు కవిత్వం' (6 కవితా సంపుటాల గ్రంథం) వంటి కవితా సంపుటాలు వీర్రాజు సాహిత్య సృజనకు నిదర్శనం. వీరి కథలూ పలు సంపుటాలుగా వచ్చాయి. 'సమాధి', 'మబ్బు', 'శీలా వీర్రాజు కథలు', 'బండి చక్రం', 'రంగుటద్దాలు', 'పగా మైనస్ ద్వేషం', 'మనసులోని కుంచె', 'వాళ్ల మధ్య వంతెన', 'ఊరు వీడ్కోలు చెప్పింది' వంటివి ఎంతో ప్రజాదరణ పొందాయి. 'కలానికి అటూ ఇటూ' వ్యాస సంకలనం ఆయనకి మంచి పేరు తెచ్చింది.

'కొడిగట్టిన సూర్యుడు' కవితా సంపుటికి ఫ్రీవర్స్ ఫ్రంట్ మొట్టమొదటి అవార్డు, 'మైనా' నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ఉత్తమ నవల పురస్కారం, డా॥ బోయి భీమన్న వచన కవితా పురస్కారం, న్యూఢిల్లీ తెలుగు సాహితీ సమితి జీవన సాఫల్య పురస్కారం, అవంత్స సోమసుందర్ ట్రస్టు పురస్కారాలు వంటివెన్నో అందుకున్నారు. అంతటి ఘనత పొందిన 83 ఏళ్ళ శీలా వీర్రాజు 2022 జూన్ నెల 1వ తేదీన గుండెపోటుతో హైదరాబాదులో మరణించారు. ఆయన సాహిత్యానికీ, చిత్ర కళాసీమకూ చేసిన కృషిని ఎన్నటికీ మరువలేము.

– రేగుళ్ళ మల్లికార్జునరావు, సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ

(రేపు శీలా వీర్రాజు ప్రథమ వర్ధంతి)

విజ్ఞానం రెక్కలు విరిస్తే మౌఢ్యం పురివిప్పదా?

అభిప్రాయం




ప్రొ॥ కట్టా సత్యప్రసాద్

జాతీయ విద్య, పరిశోధన, శిక్షణా సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) ఇటీవల ఒక సంచలన నిర్ణయం తీసుకొంది. పదవ తరగతి పాఠ్యాంశాల నుండి 'జీవ పరిణామ' సిద్ధాంతాన్ని తొలగించటం అది. 1859లో డార్విన్ జీవ పరిణామాన్ని శాస్త్రీయంగా ప్రతిపాదించిన తర్వాత మతం, సృష్టివాదులు చాలాకాలం పాటు వ్యతిరేకించారు. ఆటంకాలు కల్పించారు. సైన్సు సాధించిన విజయాలతో సంశయాలు సమసిపోయాయి. ఇప్పుడు డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం శాస్త్ర ప్రపంచంలో దాదాపు సర్వాంగీకారం పొందింది. కానీ ఇప్పటికీ ప్రకృతిలో జరుగుతున్న సహజ పరిణామాన్ని అంగీకరించడం ఇచ్ఛగించని వారు లేకపోలేదు. మన పాలకులు ఆ కోవకు చెందిన వారే! సైన్సుపై వారి వ్యతిరేకతలో భాగమే జీవ పరిణామంపై ఈ తాజా నిర్ణయం.

ఇది ఊహించిందే. గత కొన్ని సంవత్సరాలుగా మంత్రులు దీనిపై హేళనలు, వ్యతిరేకత చూపుతూనే ఉన్నారు. 2018లోనే మానవ వనరుల (విద్య) శాఖా మంత్రి 'కోతి నుండి మనిషి రావటాన్ని ఎవరి తాతలైనా చూశారా? చూసినట్లు చరిత్రలో ఆధారాలున్నాయా?' అంటూ జీవ పరిణామ సిద్ధాంతాన్ని గేలి చేయజూశారు. ఈ వ్యాఖ్య ప్రపంచ వ్యాపిత నిరసనలు రేకెత్తించింది. శాస్త్రజ్ఞులు గళం విప్పి ఖండించారు. సైన్సులో అత్యంత ప్రతిష్ఠాత్మక పరిశోధనా పత్రిక 'నేచర్' దీనిపై స్పందించం గమనార్హం. ఇంతా జరిగాక మన అమాత్యులు కొంత లౌక్యంగా వెనక్కు తగ్గి జీవ పరిణామాన్ని వ్యతిరేకించే సదస్సులేమీ జరిపే ఆలోచన లేదనీ, పాఠ్యాంశంగా తొలగించేదీ లేదనీ వివాదానికి తెరదించారు. ఇప్పటి తొలగింపు నిర్ణయానికి ఆ ఎపిసోడ్ ఒక టీజర్ వంటిదేమో!

ఇంతకూ మనిషి కోతి నుండి పుట్టాడా? డార్విన్ సిద్ధాంతం అలా చెప్పిందా? మనుషులూ, కోతులూ రెండూ ప్రైమేట్స్ అనే క్రమానికి చెందినవి. మనుషులు కోతుల నుండి పరిణామం చెందలేదు. మనం చూస్తున్న ఏ ఇతర ప్రైమేట్ల నుండి కూడ ఆవిర్భవించలేదు. చింపాంజీతో పాటు మానవజాతి పూర్వీకులు ఒకరే. ఎప్పుడో 8–6 మిలియన్ సంవత్సరాల క్రితం జీవించిన ఆ కోతి వంటి జాతి నుండి మనతో సహా ఇతర హోమినిడ్లు వచ్చాయని జీవ పరిణామ సిద్ధాంతం చెబుతున్నది. వీటికి ఏమిటి ఏధారం? నియాండరతల్, డెనిసోవా గుహల్లో లభించిన మానవ రూప శిలాజాలు తిరుగులేని రుజువులుగా నిలిచాయి. డార్విన్ కేవలం శిలాజాలు, అవి చూపే సారూప్యతనే సాక్ష్యంగా చూపాడు. కానీ అణుజీవశాస్త్రం



అభివృద్ధితో డీఎన్ఏ లక్షణాలు, జీవుల మధ్య ఉండే ఏకత్వం, అవి చూపే వైవిధ్యం, సంబంధాలు నిర్ధారించటానికి సాధ్యమైంది.

గత సంవత్సరం నోబెల్ బహుమతి గెలుచుకున్న స్వాంటే పేబో శిలాజాల నుండి డీఎన్ఏను తీసి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. శిలాజ డీఎన్ఏ అధ్యయనం లక్షలాది సంవత్సరాల క్రితం జీవించిన మనిషి జాతి పూర్వీకుల జన్యువులకూ నేటి ఆధునిక మానవుని జన్యువులకూ మధ్య ఉన్న సారూప్యతను రుజువు చేసింది. అందుకే నోబెల్ పురస్కారం లభించింది. శిలాజ నిదర్శనం ఉందంటే దొరికిన ఎముక లేదా పుర్రె లక్షల సంవత్సరాల నాటిదన్న గ్యారంటీ ఏమిటి? అనే నిత్య శంకితులకు స్వాంటే పేబో కచ్చితమైన జవాబు ఇచ్చారు. గణితంలో లెక్కలు ఎంత కచ్చితత్వాన్ని చూపిస్తాయో డీఎన్ఏ, జన్యు సంబంధిత ఫలితాలు కూడా అంతకుమించి నిక్కచ్చిగా ఉండటం విశేషం. ఈ నవ్య పరిశోధనలు డార్విన్ సిద్ధాంతానికి సరికొత్త రుజువుగా నిలిచాయి. కాలక్రమంలో పరీక్షలకు తట్టుకొని నిలిచిందే సరైన సిద్ధాంతమవుతుంది. నిక్కచ్చి రుజువులతో జీవపరిణామ సిద్ధాంతం మరింత సైంటిఫిక్‌గా, అంగీకార యోగ్యతను నిలబెట్టుకుంది.


పాఠ్యాంశాల నుండి ఈ సిద్ధాంతాన్ని తొలగించడానికి కోవిడ్‌ను కారణంగా చూపుతున్నారు. కోవిడ్ విషయాన్నే తీసుకుందాం! మన ప్రభుత్వం, మీడియా, వైద్యులు కోవిడ్ భయం పోలేదనీ, కొత్త 'వేరియంట్లు' వస్తున్నాయనీ ప్రజలను అప్రమత్తం చేయడం మన అనుభవంలోదే! అది వాస్తవం కూడా. వేరియంట్లు అంటే ఏమిటి? వైరస్ జన్యుక్రమంలో తేడా వస్తే అది కొత్త రకం లేదా వేరియంట్‌గా రూపొందుతుంది. ఇది యావన్మందీ అంగీకరించేదే. మరి డార్విన్ జీవ పరిణామం చెప్పేది కూడా అదే కదా! జీవుల జన్యుపదార్థంలో చోటు చేసుకునే మార్పులే నూతన జీవుల ఆవిర్భావానికీ కారణమవుతాయని! వైరస్ నుండి మానవుని వరకూ జరిగిన పరిణామానికి కాగడా పట్టే డార్విన్ సిద్ధాంతాన్ని పిల్లలకు దూరం చేసి ఏమి నేర్పాలనుకుంటున్నది మన ప్రభుత్వం? మనిషిని మనిషిగా నిలబెట్టి, స్వతంత్ర ఆలోచనాపరులుగా తీర్చిదిద్దటం కదా విద్య లక్ష్యం! సైన్సును మరుగుపరచటం, నిరాకరించటం సమర్థనీయం కాదు. సైన్సు దూరమయితే మౌఢ్యం పురులు విప్పుతుంది. అజ్ఞానపు చీకటి నుండి విజ్ఞాన ప్రపంచంవైపు మన విద్యార్థి లోకాన్ని నడిపించడం నేటి అవసరం.

వ్యాసకర్త జనవిజ్ఞాన వేదిక మాజీ (ఉమ్మడి) రాష్ట్ర అధ్యక్షులు

బుద్ధ బోధ సర్వస్వాలు

దేనిలో అయితే ఒక వస్తువును భద్రంగా అట్టిపెట్టుకొంటామో, అది పెట్టె అనబడుతుంది. దాన్నే సంస్కృతంలో పేటిక అనీ, ప్రాకృతంలో పిటకం అనీ అన్నారు. బుద్ధుడి కాలం 2600 ఏండ్ల క్రితం. ఆ కాలపు ప్రాకృత భాషలో పిటకం అనే పదానికి పెట్టె అనే కాకుండా, ధార్మిక వాఙ్మయం అనే అర్థం కూడా ఉండేది.

సమగ్ర బుద్ధవాణి అంతా వినయ పిటకం, సుత్త పిటకం, అభిదమ్మ పిటకం అనే మూడు భాగాలుగా విభజితమయ్యింది. వీటినే 'తిపిటకములు' (త్రిపిటకాలు) అంటారు. బుద్ధ వచనాలను మూడు పెట్టెల్లో పెట్టి కాపాడినారు గనుక వాటికి తిపిటకములు అనే పేరు వచ్చిందని చెప్పటం సరికాదు. బౌద్ధ వాఙ్మయాన్ని ఈ మూడు భాగాల్లో సంరక్షించి ఉంచినందున వీటిని తిపిటకములు అనటం ఆమోదయోగ్యంగా ఉంటుంది. ఈ సంపూర్ణ సాహిత్యమంతా ఆ కాలపు జన భాష అయిన ప్రాకృతంలో ఒక భాగమయిన అర్ధమాగధి భాషలో ఉన్నది. ఈ భాష తిపిటకాల్ని పాలించి రక్షించినందున పాళీ అనబడింది. తిపిటక పాళీ అంటే తిపిటకాల్లో ఉన్న భాష. మొదట్లో ఏ ధార్మిక సంప్రదాయానికి చెందిన సాహిత్యమైనా, పిటకమనే పిలవబడేది. కానీ, రానురానూ పిటకము అంటే బుద్ధ వచనాల్ని మాత్రమే సూచించే పదం అయింది. మూడు పిటకాల్లో ఉన్న ఉపదేశాలు మొత్తం 84,000. వీటిల్లో 82,000 బుద్ధునివి. 2,000 భిక్షువులవి. బుద్ధుడు చెప్తుండగా విని నేర్చుకొని తమ అనుభవానికి తెచ్చుకొన్న విషయాలనే భిక్షువులు చెప్పారు కాబట్టి వారి మాటలు కూడా శిరోధార్యమైనవి.



బుద్ధుని మహా పరినిర్వాణం తర్వాత సుభద్రుడనే వృద్ధ భిక్షువు తన సంతోషాన్ని ప్రకటిస్తూ అందరితో ఇలా చెప్పటం మొదలు పెట్టాడు: 'మనం బుద్ధుని నుండి విముక్తుల మైనాము. ఉపదేశాలతో ఆయన పీడిస్తుండేవాడు, ఇది ఉచితం, ఇది అనుచితం అని. ఇప్పుడు మనం ఇష్టం వచ్చింది చేస్తాం. ఏది ఇష్టం లేదో అది చెయ్యం.' ప్రముఖ శిష్యుడు, మహాస్థవిరుడైన మహాకాశ్యపుడనే భిక్షువు ఈ మాటలు విని ఖేద పడ్డాడు. బుద్ధవాణిని ఉన్నది ఉన్నట్లుగా సురక్షితం చేయ సంకల్పించాడు. 500 మంది సత్యసాక్షి స్థవిరులను ఒక చోట చేర్చి మూడు నెలల్లో రాజగృహంలో మొదటి 'సంగాయనం' (సహగానం) లేదా 'సంగీతి' ఏర్పాటు చేశాడు. సమస్త బుద్ధవాణిని శుద్ధ రూపంలో మౌఖికంగా సంగ్రహించి కూర్చారు. వినయ పిటకం విషయంలో ఉపాలి చెప్పినదాన్నీ, సుత్త పిటకం విషయంలో ఆనందుడు చెప్పినదాన్నీ ప్రామాణికంగా స్వీకరించారు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.ఏకాదశి ఉ.10.52 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: చిత్త తె.4.42 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి స్వాతి, వర్జ్యం: ఉ.11.54 నుండి 1.34 వరకు, దుర్ముహూర్తం: ప.11.32 నుండి 12.23 వరకు, అమృతఘడియలు: రా.9.56 నుండి 11.34 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.28, సూర్యాస్తమయం: 6.26.

మహిళా సంఘాల రుణాలకు రూ.15,037 కోట్ల బ్యాంకు లింకేజీ

- 2023–24 ఏడాదికిగాను సెర్ప్ వార్షిక ప్రణాళిక విడుదల
- మహిళలు ఈ తోడ్పాటుతో ఆర్థికంగా బలోపేతం కావాలి: మంత్రి ఎర్రబెల్లి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది 3,08,670 మహిళా సంఘాల సాధికారిత సాధన కోసం రూ.15,037.40 కోట్లతో బ్యాంకు లింకేజీని అందించనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. మహిళలు తమ పురోగతి కోసం తగిన ప్రణాళికలు రూపొందించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో 2023–24 సంవత్సరానికి సంబంధించి వార్షిక ప్రణాళికను మంగళవారం మంత్రి ఎర్రబెల్లి ఆవిష్కరించారు. ఉమ్మడి రాష్ట్రంలో మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్లు మాత్రమే రుణాలివ్వగా.. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి రూ.68,522 కోట్లు అందించినట్లు తెలిపారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా వారికి రుణాలు ఇవ్వాలని, ఈ మేరకు నిబంధనలను సడలించాలని బ్యాంకర్లను మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో గత ఏడాదికి సంబంధించి నిర్దేశిత లక్ష్యాలను సాధించిన బ్యాంకు అధికారులు, ఉత్తమ మహిళా సంఘాలు, అధికారులను ప్రశంసా పత్రాలు, మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో, పీఆర్ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నాబార్డ్ సీజీఎం సుశీల చింతల, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ చైర్మన్ అమిత్ జింగా రాంజీ పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

వైద్యసేవల్లో దేశంలోనే మూడో స్థానం..

- కాంగ్రెస్ వస్తే కరువులు.. దొంగ రాత్రి కరెంటే దిక్కు
- బీజేపీ చేరికల కమిటీ చైర్మనే చేతులెత్తేసిండు
- రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- అచ్చంపేటలో డబుల్ బెడ్రూం ఇళ్లు, వంద పడకల ఆస్పత్రి ప్రారంభం



అచ్చంపేటలో ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో గువ్వల బాలరాజు

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రం అవతరించిన సమయంలో వైద్యసేవల్లో 14వ స్థానంలో ఉన్న తెలంగాణ గడిచిన తొమ్మిదేళ్లలో దేశంలో మూడోస్థానంలో నిలిచిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు వెల్లడించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్మించిన 150 డబుల్ బెడ్రూం ఇళ్లు, వంద పడకల ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వంద పడకల ఆస్పత్రులు, డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యశాఖలో 31,484 మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు వివరించారు. మరో 2వేల మంది కొత్త వైద్యుల నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం ఐదు మెడికల్ కళాశాలలు ఏర్పాటు కానున్నాయని, ఈ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వైద్యశాఖలో రెగ్యులర్ అయిన కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలను ఆయన అందజేశారు.

కాంగ్రెస్ వస్తే కరువు కాటకాలే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాలిపోయిన మోటార్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, దొంగరాత్రి కరెంటు దిక్కవుతుందని మంత్రి హరీష్ రావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ ఎరువుల కోసం క్యూ లైన్లు, లాఠీచార్జీలు తప్పవన్నారు. వారి పాలనలో సర్కారు దవాఖానాల్లో డాక్టర్లు, మందులు ఉండవని ఎద్దేవా చేశారు. ఇక బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ చేతులెత్తేశాడని వ్యాఖ్యానించారు. ఆ పార్టీలో ఎవరూ చేరరని ఆయనకూ తెలుసన్నారు. ప్రతిపక్షాలు చెప్పేదంతా వేదాంతం, చేసేదంతా రాద్ధాంతమని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతాకుమారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న మంత్రులు

కాగా, శ్రీశైలం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి మంగళవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి

- హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి
- సీపీఐ, ఏఐటీయూసీ నేతలు బోస్, బాలరాజ్ డిమాండ్
- టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ధర్నాకు సంఘీభావం



దీక్షలో మాట్లాడుతున్న బోస్

కవాడిగూడ: హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తూ వెంటనే ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని, మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పేస్కేల్ అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత యూనియన్లు లేకుండా చేసిన సీఎం కేసీఆర్.. ఆర్టీసీ సిబ్బంది సమస్యలు పరిష్కరించకుండా మోసం చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, రాబోయే ఎన్నికల్లో పాలకులకు గుణపాఠం చెప్పాలని ఇందుకోసం ఆర్టీసీ కార్మికులందరూ ఐకమత్యంగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో యూనియన్ నేతలు, ఆర్టీసీ కార్మికులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని బోస్, బాలరాజు సందర్శించి మద్దతు ప్రకటించారు. సామూహిక నిరాహార దీక్షలో పాల్గొన్న యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బాబు, రాజిరెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

తెలంగాణ ప్రభుత్వం
రీజినల్ ఆఫీసర్ కార్యాలయం, పంచాయతీరాజ్, మహబూబ్‌నగర్
టెండరు ప్రకటన
NIT No. TO/Tender/478 to 521 /2023-24 తేది: 29-05-2023
పనుల సంఖ్య (44), వనపర్తి, నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, జోగులాంబగద్వాల్& నారాయణపేట జిల్లాలలో MRR 2022-23, MRR 2021-22, STSDF-2023, DMFT, SDF, NHM, MWF & 2 BHK హౌసింగ్ గ్రాంట్స్ క్రింద పనుల రీకాలింగ్. అంచనా వ్యయం: రూ. 3924.45 లక్షలు. టెండరు షెడ్యూల్స్‌ను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ నుండి 31-05-2023 నుండి 08-06-2023 వరకు పొందవచ్చును. ఇతర వివరాలను https://tenders.telangana.gov.in నుండి పొందవచ్చును. ఇ-మెయిల్ Id: se_pr_mbnr@yahoo.co.in
సం/- రీజినల్ ఆఫీసర్
DIPR RO No.542-DP/CL/Advt/1/2023-24, Dt. 30.05.2023

ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోండి

ఢిల్లీలో బాధితురాలు షెజల్ నిరసన

సాక్షి, న్యూఢిల్లీ: బెల్లంపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి యువతి బోడపాటి షెజల్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేస్తే.. తెలంగాణ పోలీసులు తీసుకోవడంలేదని ఆమె వాపోయారు. ఢిల్లీలో మంగళవారం నిరసన తెలిపిన షెజల్.. తెలంగాణ భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తనను లైంగికంగా వేధించారని, ఆయన మనుషులు తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. తనలాగే ఎంతో మంది బాధితులు ఉన్నారని, వారందరిని కలుపుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం జరిగేంత వరకు జంతర్ మంతర్‌లో ధర్నా చేయనున్నట్లు షెజల్ మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వచ్చిన కథనాలతో కూడిన బ్యానర్‌ను ప్రదర్శించారు.

అగ్గికి కార్లు బుగ్గి..

రూ.లక్షల్లో ఆస్తినష్టం

లింగోజిగూడ, వనస్థలిపురం: కార్ల సర్వీసింగ్ సెంటర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ. లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ బీవీకే సినిమా థియేటర్ పక్కనే ఉన్న సద్గుర్ నగర్ కాలనీలోని కారు-ఓ- మ్యాన్ సర్వీసింగ్ సెంటర్‌లో మంగళవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అప్పటికే మంటలు భారీగా ఎగిసిపడుతుండడంతో హయత్‌నగర్‌తో పాటు మలక్‌పేట్, గౌలిగూడ, మల్కాజిగిరి, మౌలాలీ అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు 12 కార్లు దగ్ధమైనట్లు సమాచారం. అగ్ని ప్రమాదం సమయంలో సర్వీసింగ్ సెంటర్‌లో గ్యాస్ ఆధారిత కార్లు ఉండడంతో మంటలు వ్యాపించి భారీ శబ్దాలు వచ్చాయి. దీంతో పక్కనే బీవీకే సినిమా హాల్‌లోని ప్రేక్షకులు బయటకు పరుగులు తీశారు. ఘటనా స్థలంలో ఉన్న పోలీసులు సర్వీసింగ్ సెంటర్ పక్కనే ఉన్న శ్రీలక్ష్మి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ వాసులను ఫ్లాట్లలోంచి బయటకు వచ్చేలా చర్యలు తీసుకున్నారు.



దగ్ధమవుతున్న కార్లు



సర్వీసింగ్ సెంటర్‌లో ఎగిసిపడుతున్న మంటలు



కలెక్టరేట్ ఎదుట గడ్డి దగ్ధం చేసి నిరసన తెలుపుతున్న ఆర్ఆర్ఆర్ బాధితులు, వివిధ పార్టీల నాయకులు



కలెక్టర్ బంగ్లాకు వెళ్లే మార్గం నుంచి పోతున్న మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న రైతులు

ఆర్ఆర్ఆర్ బాధితుల ఆందోళన...

- మంత్రి జగదీశ్‌రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం
- యాదాద్రి జిల్లా కలెక్టరేట్ దగ్గర ఉద్రిక్తత

సాక్షి, యాదాద్రి: భువనగిరి నియోజకవర్గ పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట బాధిత రైతులు రెండో రోజు చేపట్టిన ధర్నా ఉద్రిక్తంగా మారింది. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో పాల్గొనడానికి మంత్రి జగదీశ్‌రెడ్డి మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఇదే సమయంలో ఆర్ఆర్ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులు అలైన్‌మెంట్ మార్చాలని కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. మంత్రిని కలిసి తమ సమస్యను చెప్పుకునేందుకు వారు చేసిన ప్రయత్నం విఫలమైంది. దీంతో బాధిత రైతులు, ప్రతిపక్ష నాయకులు కలెక్టరేట్ గేట్ దూకి వెళ్లడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సమావేశం అనంతరం కలెక్టరేట్ నుంచి మంత్రి వెళ్తున్న విషయం తెలుసుకున్న రైతులు కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద గడ్డిమోపులు దగ్ధం చేసి నిరసన తెలిపారు. అప్రమత్తమైన పోలీసులు ప్రధాన గేట్ నుంచి కాకుండా కలెక్టర్ బంగ్లాకు వెళ్లే మరో మార్గం నుంచి మంత్రి కాన్వాయ్‌ను పంపిస్తుండగా.. రైతులు గమనించి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కొందరు కాన్వాయ్‌కు అడ్డంగా వెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో పోలీసులకు, బాధిత రైతులు, విపక్ష నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రైతులను ఎలా అరెస్టు చేస్తారంటూ బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి, టీపీసీసీ సభ్యుడు తంగెళ్లపల్లి రవికుమార్ డీసీపీతో వాగ్వాదానికి దిగారు. ఆందోళనకారులను పక్కకు నెట్టిన పోలీసులు మంత్రి కాన్వాయ్‌ను పంపించేశారు. గూడూరు, తంగెళ్లపల్లితోపాటు ఇతర నాయకులను అదుపులోకి తీసుకుని తుర్కపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. రాత్రి 8గంటలకు వదిలేశారు. ఇదిలా ఉండగా.. మంత్రి కాన్వాయ్‌ని ఆందోళనకారులు అడ్డుకుంటుంటే ఏం చేస్తున్నారని పోలీసులపై డీసీపీ రాజేశ్‌చంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పదోన్నతుల్లో మాజీ రిజిస్ట్రార్ వసూళ్లు

- అవకతవకలకు పాల్పడ్డ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్
- తెలంగాణ వర్సిటీ పాలకమండలి సభ్యులపై వీసీ ఆరోపణలు



తెలంగాణ వర్సిటీ వీసీ టేబుల్ పైకెక్కి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అంతర్గత పాలకమండలి సభ్యులు మాజీ రిజిస్ట్రార్ నసీం, అసోసియేట్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డిలపై వీసీ డి రవీందర్‌గుప్తా తీవ్రమైన ఆరోపణలు చేశారు. మంగళవారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రిజిస్ట్రార్‌గా పని చేసిన సమయంలో నసీం 22 మంది అధ్యాపకులకు పదోన్నతులు కల్పించి రూ.70 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. జూమ్ మీటింగ్ ద్వారా పదోన్నతులు కల్పించడం నిబంధనలకు విరుద్ధమని వాటిని రద్దు చేసే అవకాశం ఉందన్నారు. అలాగే ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా రవీందర్‌రెడ్డి అవకతవకలకు పాల్పడ్డారని, అదేవిధంగా ప్రిన్సిపాల్ ఎలాంటి సమాచారం లేకుండా లీవులో వెళ్లారని తెలిపారు. వీరందరూ తన అనుమతి లేకుండా ఈసీ సమావేశాలకు హాజరు కావడం సమంజసం కాదన్నారు. ఈ ముగ్గురితో పాటు ఆర్డర్స్ లేకుండా రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చున్న ప్రొఫెసర్ యాదగిరికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసులపై ఇప్పటి వరకు సమాధానం ఇవ్వకపోవడంతో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని వీసీ స్పష్టం చేశారు. ఇటీవల తాను క్యాంపస్ కళాశాలలను తనిఖీ చేయగా పలువురు అధ్యాపకులు అనుమతి లేకుండానే గైర్హాజరైనట్లు గుర్తించామన్నారు. వారందరి నుంచి వివరణ కోరుతామని చెప్పారు.

వీసీని అడ్డుకున్న విద్యార్థి సంఘాల నేతలు

కాగా, వీసీ రవీందర్ మంగళవారం క్యాంపస్‌కు వచ్చినట్లు తెలుసుకున్న పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూ, బీవీఎం సంఘాల నాయకులు ఆయన చాంబర్‌ను ముట్టడించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వీసీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీసీ టేబుల్‌పైకి ఎక్కి నినాదాలు చేశారు. వీసీ తన చాంబర్ నుంచి బయటకు రాగా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు ఆయనను తమ వాహనంలో తీసుకెళ్లారు. మరోవైపు పరిపాలనా భవనంలోని రెండు పిల్లర్లకు కొందరు విద్యార్థి నాయకులు 'అవినీతి వీసీ వెల్‌కమ్'అంటూ రాసిన కాగితాలను అంటించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
జిల్లా కలెక్టర్ జనగాం గారి రూఢీ ప్రకటన
ఫారం-VII
యస్.డి.సి.ఫైల్ నెం.బి/54/2022 తేది: 27-04-2023
కలెక్టర్, ఫైల్ నెం.ఐ2/909/2022 తేది: 06-05-2023
గెజిట్ నెం.JN/LA/22/2023 తేది: 16-05-2023
జిల్లా కలెక్టర్, జనగాం జిల్లా, పాలకుర్తి మండలము, వావిలాల గ్రామ పరిధిలో ఈ దిగువ షెడ్యూల్‌లో నిర్దిష్ట పరిచిన విస్తీర్ణం ఎ.3.34 ½ గుంటలు గల భూమి ప్రజా ప్రయోజనాలకై అనగా వ్యవసాయ భూములకు సాగు నీరు అందించుటకు గాను దేవాదుల ప్రాజెక్టులో (జి.సి.ఆర్.జి.ఎల్.ఐ.పి) భాగంగా 13 ఆర్ డిస్ట్రిబ్యూటరి ఆఫ్ 7 యల్ నష్కల్ మెయిన్ కెనాల్ కి.మీ. 0.000 నుండి 0.807 వరకు కెనాల్ నిర్మాణము కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము, జిల్లా కలెక్టర్, జనగాం జిల్లా గారి ద్వారా భూసేకరణ చట్టం 30/2013 ప్రకారము భూమిని సేకరించుటకు నిర్ణయించినారు.
కావున పైన తెలిపిన 13 ఆర్ డిస్ట్రిబ్యూటరి ఆఫ్ 7 యల్ నష్కల్ మెయిన్ కెనాల్ కి.మీ. 0.000 నుండి 0.807 వరకు కెనాల్ నిర్మాణము కొరకు జనగాం జిల్లా, పాలకుర్తి మండలములోని వావిలాల గ్రామములో భూమిని సేకరించుటకు రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.
అనుబంధము
13 ఎల్ ఆఫ్ 7 ఎల్ డిస్ట్రిబ్యూటరి ఆఫ్ నష్కల్ మెయిన్ కెనాల్
గ్రామం: వావిలాల మండలం: పాలకుర్తి జిల్లా: జనగాం

క్రమ సంఖ్య	సర్వే నెంబర్	టైటిల్ రకం	భూమి రకం మెట్ట/తరి	భూసేకరణ చేయు విస్తీర్ణము	పట్టదారులు / అనుభవదారు	రిమార్కులు
1	2	3	4	5	6	7
1	189	పట్టా	ఖుష్కి	0.01 ½	చిలువేరు వెంకన్న తండ్రి లింగయ్య	
2	189	పట్టా	ఖుష్కి	[illegible] ½	చిలువేరు యాకయ్య తండ్రి నర్సయ్య	
3	189	పట్టా	ఖుష్కి	0.04	చిలువేరు మల్లయ్య తండ్రి ఐల్ల అయిలయ్య	
4	189	పట్టా	ఖుష్కి	0.18	చిలువేరు సాయిబాబా తండ్రి మల్లయ్య	
			మొత్తం	0-26 ½		
5	155	పట్టా	ఖుష్కి	0.15	మమ్మెరబోయిన యాకయ్య తండ్రి మల్లయ్య	
6	155	పట్టా	ఖుష్కి	0.13	బొమ్మెరబోయిన సోమ మల్లు తండ్రి మల్లయ్య	
7	155	పట్టా	ఖుష్కి	[illegible] ½	కసురబోయిన అయిలయ్య తండ్రి సోమయ్య	
8	155	పట్టా	ఖుష్కి	0.02	కసురబోయిన కుమార్ తండ్రి సోమయ్య	
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

[illegible]
సం/-
ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ, యస్.ఆర్.ఎస్.పి & ఐ.ఆర్.ఎస్., యూనిట్-2, జనగామ
DIPR RO No.276/LA-PP/Advt/Pub/2023-24

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
జిల్లా కలెక్టర్ జనగాం గారి రూఢీ ప్రకటన
ఫారం-VII
((చట్టం-30/2013) లోని సెక్షన్-19(1) లోని సబ్ రూల్-1 రూల్-25 ప్రకారం)
యస్.డి.సి.ఫైల్ నెం.C/45-3/2022 తేది: 27-04-2023
జిల్లా కలెక్టర్, జనగాం ఫైల్ నెం.ఐ2/684/2022 తేది: 06-05-2023
గెజిట్ నెం.JN/LA/24/2023 తేది: 16-05-2023
[illegible]
అనుబంధము
[illegible]
DIPR RO No.267/LA-PP/Advt/Pub/2023-24

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయము యల్.ఎమ్.డి. కాలనీ
టెండర్ నోటీసు నం.: 05 & 06/EE/ID.5/IC-2/LMD/2023-24 తేది: 24-05-2023
పని పేరు: 1) కరీంనగర్ జిల్లా, కరీంనగర్ మండలం, ఆరెపల్లి గ్రామము లోని మేలకుంట చెరువును పునరుద్ధరించుట పనుల గురించి. పని సుమారు విలువ : రూ. 8,66,244/-. పూర్తి చేయు కాలము: 3 నెలలు. పని పేరు: 2) ఎగువ ఎల్.ఎం.డి.-కాకతీయ ప్రధాన కాలువ మీద ఉన్న D-87, D-88, D-88-1L, D-89, D-89-3L డిస్ట్రిబ్యూటరీ షట్టర్ల యాంత్రిక (Mechanical) భాగాలను మరమ్మత్తు మరియు మార్పుట గురించి. పని సుమారు విలువ: రూ. 7,77,671/-, పూర్తిచేయు కాలము: 3 నెలలు. టెండర్లు స్వీకరించు ఆఖరి తేదీ/ సమయం: 02-06-2023 న సా. 4.00 గం. వరకు. టెండరు తెరచు సమయం: 02-06-2023 న సా. 4.30 గం.లకు. మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ "www.eprocurement.gov.in" వెబ్‌సైట్ లో చూడగలరు.
సం/- కార్యనిర్వాహక అభియంత
DIPR RO No.549-DP/CL/Advt/1/2023-24, Dt. 30.05.2023

మెట్‌పల్లి మున్సిపాలిటీ
NIT No.02/MCM/E1/2023-24 టెండరు ప్రకటన తేది: 30.05.2023
రీకాల్ పనులు - వివిధ గ్రాంట్లు - 06. ECV. రూ.5138746.00. 1వ కాల్ పనులు - వివిధ గ్రాంట్లు - 06. ECV. రూ.3719216.00. బిడ్ల దాఖలుకు ప్రారంభ తేది: 01.06.2023 ఉ.11.00 గం. బిడ్ల దాఖలుకు చివరి తేది: 08.06.2023 సా.5.00 గం. బిడ్ తెరచు తేది: 09.06.2023 ఉ.11.00 గం. నుండి. తదుపరి వివరాల కోసం సంప్రదించవలసిన సంబంధిత అధికారి పేరు, చిరునామా: కమిషనర్, మెట్‌పల్లి మున్సిపాలిటీ, జగిత్యాల జిల్లా. ఫోన్: 9866577636. వివరాల కోసం www.tender.telangana.gov.in లో చూడవలెను.
సం/- కమిషనర్, మెట్‌పల్లి మున్సిపాలిటీ
DIPR RO No.2504-PP/CL/Advt/1/2023-24, Dt. 30.05.2023

వరంగల్ మహానగర పాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
Emergency Tender Notice No.EE/Circle-I/GWMC/CTN/07/eprocurementRecall/2023-24, తేది:29-05-2023
పనుల సంగ్రహం: 02 సివిల్ పనులు: రూ.95.00 లక్షలు. ఆన్‌లైన్‌లో బిడ్ల దాఖలు కోసం చివరి తేది, సమయం: 01-06-2023న ఉ.10.30 గం. వరకు, బిడ్లు తెరచు తేది: 01-06-2023న ఉ.10.30 గం. సంప్రదించు వివరాలు: E.E., సర్కిల్-I, GWMC, Pin: 506002. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in లో చూడవచ్చును. పనుల డౌన్‌లోడింగ్ 31-05-2023న ఉ.10.30 గం. నుండి ప్రారంభమగును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వరంగల్ మహానగర పాలక సంస్థ
DIPR RO No.2490-PP/CL/Advt/1/2023-24, Dt: 30.05.2023

గద్వాల్ మున్సిపాలిటీ కార్యాలయం జోగులాంబ గద్వాల్ జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Tr.Notice.E1/1074/GDL/RC/2023-24 తేది: 31-05-2023
పనుల సంఖ్య: 01, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 31-05-2023న ఉ.11.00 గం.లకు, ధర బిడ్ తెరచు తేది: 06-06-2023న మ.3.00 గం.లు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ https://tender.telangana.gov.in లో చూడండి మరియు తదుపరి వివరాల కోసం ఫోన్ నం. 9849907791 పై సంప్రదించండి.
సం/- కమిషనర్, గద్వాల్ మున్సిపాలిటీ
DIPR RO No.2491-PP/CL/Advt/1/2023-24, Dt. 30.05.2023

icmr NIN ICMR-NATIONAL INSTITUTE OF NUTRITION
INDIAN COUNCIL OF MEDICAL RESEARCH
Near Tarnaka Metro Station, Hyderabad-500 007, Telangana State, India.
ADMISSION NOTIFICATION
Applications are invited from eligible candidates for admission into NIN Common Entrance Test - NCET-2023 (ONLINE) for 2-year M.Sc (Applied Nutrition) & M.Sc (Sports Nutrition) at ICMR-NIN, Hyderabad. Last date: 27th June, 2023.
Please see the website https://www.nin.res.in for notification and link for application.
Sd/- SENIOR ADMINISTRATIVE OFFICER

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వరంగల్
ఆర్.సి.నెం.C/157/2023 టెండరు ప్రకటన తేది: 29-05-2023
[illegible]
సం/- వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, వరంగల్
DIPR RO No.2474-PP/CL/Advt/1/2023-24, Dt. 30.05.2023

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్
టెండర్ కోరుతూ ప్రకటన
Tender Notice No.EE/WS/GWMC/CTN/04/Recall/e-proc/2023 తేది:29-05-2023
జనరల్ ఫండ్స్ క్రింద రూ.80.70 లక్షల కొరకు (15) పనుల కోసం ఆన్‌లైన్ టెండరు ప్లాట్‌ఫారం tender.telangana.gov.in లో జాబితా చేయబడిన పనుల కోసం నమోదిత కాంట్రాక్టర్లు/ఏజెన్సీల నుండి టెండర్లు కోరబడుచున్నవి. పనుల సంగ్రహం: SC కోసం రిజర్వు చేయబడినవి (02 నం.ల పనులు): రూ.5.35 లక్షలు. ST కొరకు రిజర్వు చేయబడినవి (1 నం.పని): రూ.2.64 లక్షలు. జనరల్ (12 నం.ల పనులు): రూ.72.71 లక్షలు, మొత్తం (15 నం.ల పనులు): రూ.80.70 లక్షలు. టెండరు ప్రక్రియ షెడ్యూల్: డౌన్‌లోడింగ్ కొరకు ప్రారంభ తేది: 31-05-2023న ఉ.10.30 గం. నుండి, డౌన్‌లోడింగ్ కొరకు ఆఖరి తేది: 03-06-2023న మ.3.00 గం. వరకు, బిడ్లు (టెక్నికల్) తెరచు తేది: 03-06-2023న మ.3.30 గం., బిడ్లు (ఫైనాన్షియల్) తెరచు తేది: 03-06-2023న మ.3.30 గం.కు. వివరాలకు సంప్రదించండి: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వాటర్ సప్లయ్, GWMC, సెల్ నం.: 9701999598, ఇ-మెయిల్: ee3gwmc@gmail.com. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ https://tender.telangana.gov.in లో చూడవచ్చును. పనుల డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 31-05-2023 న ఉ.10.30 గం. నుండి.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (WS), గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO No.2477-PP/CL/Advt/1/2023-24, Dt: 30.05.2023

పురపాలక సంఘ కార్యాలయము :: జనగామ, జిల్లా : జనగామ
కొటేషన్ నోటీసు
కొటేషన్ నోటీసు నెం.: ఇ1/Quotation/599/2023-24/4 తేది: 30-05-2023
జనగామ పురపాలక సంఘములో తేది: 02-06-2023 నుండి తేది: 22-06-2023 వరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుటకు ఫ్లెక్సీలు మరియు స్వాగత తోరణాలు ఏర్పాటు చేయుట, బ్రోచర్స్ మరియు వివిధ ప్రదేశాలలో సీరియల్ బల్బులు ఏర్పాటు చేయుట మరియు ఇతర ఏర్పాట్లు చేయుటకు అంచనాలు తయారు చేయుటకు సీల్డ్ కొటేషన్లు పిలవనైనది. ఇట్టి కొటేషన్ల తేది: 31-05-2023 లోపు సమర్పించవలెను. మిగతా వివరాలకు కార్యాలయ పనివేళలో ఇంజనీరింగ్ విభాగంలో సంప్రదించగలరు.
సం/- కమిషనర్, పురపాలక సంఘం, జనగామ
టెండర్ నోటీసు
టెండర్ నోటీసు నెం.: ఇ1/Tender/599/2023-24/4 తేది: 30-05-2023
1. పనుల సంఖ్య (15) పనులు, 2. పనుల విలువ : రూ. 1.10 కోట్లు. పట్టణ ప్రగతి నిధులు + జనరల్ ఫండ్స్ + mlc నిధులు, 3. టెండరు డాక్యుమెంట్లు లభించు తేది: 31-05-2023 ఉ॥ 11.00 గం.ల నుండి. 4. టెండర్లు స్వీకరించు చివరి తేది, సమయం: 08-06-2023 సా॥ 4.00 గం.ల వరకు, 5. టెండర్లు తెరచు తేది: 08-06-2023 సా॥ 4.01 గం.లకు, 6. టెండర్లకు అర్హతలు : V రిజిస్ట్రేషన్ మరియు ఆ పైన. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in వెబ్ సైట్ లో చూడగలరు.
సం/- కమిషనర్, పురపాలక సంఘం, జనగామ
DIPR RO No.2486-PP/CL/Advt/1/2023-24, Dt. 30.05.2023

మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, కరీంనగర్ జిల్లా
నెం.ఎ2/DHEW/557/2023, కాంట్రాక్టు నియామకపు ప్రకటన తేది: .05.2023
[illegible]

క్ర.సం.	భర్తీ చేయనున్న పోస్టు	పోస్టుల సంఖ్య	విద్యార్హతలు	అనుభవము	వేతనము
1	స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ	01	[illegible]	[illegible]	22,750/-
2	ఎం.టి.ఎస్. మల్టీ టాస్క్ సర్వెంట్	01	10వ తరగతి పాస్ అయినవారు ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు నుండి 10+2 విధానము క్రింద పాస్ అయిన వారు అర్హులు.		15,600/-

[illegible]
సం/- జిల్లా సంక్షేమ అధికారి, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ
సం/- జిల్లా కలెక్టర్ & చైర్మన్, డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్(DHEW) కరీంనగర్
DIPR RO No.2483-PP/CL/Advt/1/2023-24, Dt:30.05.2023

క్లుప్తంగా

బీజేపీపై శివసేన షిండే వర్గం అసంతృప్తి

సామ్నా సంపాదకీయంలో వెల్లడి

ముంబై: మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన వర్గం అసంతృప్తితో రగిలిపోతోందని శివసేన(యూబీటీ) చెందిన సామ్నా పత్రిక పేర్కొంది. బీజేపీ తమ పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతోందంటూ 22 మంది ఎమ్మెల్యేలు, 9 మంది ఎంపీలు భావిస్తున్నారని, వీరు షిండే వర్గాన్ని వీడుతారని అందులో తెలిపింది. ఎంపీ గజానన్ కీర్తికార్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా సామ్నా ఉటంకించింది. బీజేపీ కుట్రతో బందీలుగా మారిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎప్పుడు బలవుతారో చెప్పలేమని వ్యాఖ్యానించింది. అదేవిధంగా, సీఎం షిండేను నడిపించేది డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాలన్నీ బీజేపీ నేత ఫడ్నవీస్ వద్దే ఉన్నాయని సామ్నా పేర్కొంది. బీజేపీ చూపించిన సవతి తల్లి ప్రేమను జీర్ణించుకోలేకనే, ఆత్మగౌరవం కోసం 2019లో ఆ పార్టీతో అవిభాజ్య శివసేన సంబంధాలు తెంచుకున్నట్లు వివరించింది.

భారత్ అధ్యక్షతన జూలైలో ఎస్‌సీవో వర్చువల్ భేటీ

న్యూఢిల్లీ: జూలై 4న వర్చువల్‌గా జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సమావేశానికి భారత్ అధ్యక్షత వహించనుందని విదేశాంగ శాఖ మంగళవారం తెలిపింది. సమావేశం వర్చువల్‌గా జరపడానికి కారణాలను మాత్రం వెల్లడించలేదు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఎస్‌సీవో శిఖరాగ్ర సమావేశం ఉజ్బెకిస్తాన్ రాజధాని సమర్కండ్‌లో జరగ్గా ప్రధాని మోదీతోపాటు రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సహా అగ్రనేతలు హాజరయ్యారు. వంతుల వారీగా ఎస్‌సీవో భేటీ అధ్యక్ష బాధ్యతలు మొట్టమొదటిసారిగా భారత్‌కు దక్కాయి. ఈసారి భేటీకి భారత్‌తోపాటు సభ్యదేశాలైన చైనా, రష్యా, కజకిస్తాన్, కిర్గిజిస్తాన్, పాకిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌లతోపాటు పరిశీలక హోదాలో ఇరాన్, బెలారస్, మంగోలియాలను, అతిథిగా తుర్క్‌మెనిస్తాన్‌ను ఆహ్వానించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది.

కాంబోడియా రాజుతో ప్రధాని మోదీ చర్చలు

న్యూఢిల్లీ: కాంబోడియాతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ తెలిపారు. మొట్టమొదటిసారిగా భారత్‌లో పర్యటనకు వచ్చిన కాంబోడియా రాజు నొరొదొమ్ సిహమోని ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటామని ఈ సందర్భంగా సిహమోనికి హామీ ఇచ్చారని ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) తెలిపింది. తర్వాత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను సిహమోని కలిశారు.

చేతులు కలిపారా?



కర్ణాటక ఫార్ములాను రాజస్తాన్‌లో కూడా కాంగ్రెస్ హైకమాండ్ ప్రయోగించింది. ఉప్పు నిప్పుగా ఉన్న ఇద్దరు కీలక నేతలు అశోక్ గెహ్లాట్, సచిన్ పైలెట్‌ను ఒక్కటి చేసింది.

రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో ఇరువురు నేతలు కలిసి పనిచేయడానికి ఒప్పించింది. మరి గెహ్లాట్, పైలెట్ చేతులు కలిపినట్టేనా ? ఎన్నికల్లో కలసికట్టుగా పని చేస్తారా ? ఆచరణలో ఇది ఎంతవరకు సాధ్యమనే ప్రశ్నలైతే వినిపిస్తున్నాయి.

కర్ణాటకలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ల మధ్య విభేదాలను పరిష్కరించి ఎన్నికల్లో విజయ ఢంకా మోగించిన కాంగ్రెస్ పార్టీ అదే ఫార్ములాను రాజస్తాన్‌లోనూ ప్రయోగించింది. రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలెట్‌ల మధ్య రాజీ కుదర్చడానికి స్వయంగా రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో గెహ్లాట్, పైలెట్‌లు రాహుల్‌తో చర్చించాక ఇరువురు నేతలు కలిపి పని చేస్తారని కాంగ్రెస్ హైకమాండ్ చేసిన ప్రకటనపై రాష్ట్ర నేతల్లో విశ్వాసం కలగడం లేదు. ఎందుకంటే బీజేపీ హయాంలో జరిగిన అవినీతిపై విచారణ కోసం సచిన్ పైలెట్ రాష్ట్ర ప్రభుత్వానికి పెట్టిన గడువు బుధవారంతో ముగుస్తుంది. ఈ లోగా అధ్యక్షుడు ఖర్గే లేదంటే సీఎం నుంచి ఏదో ఒక ప్రకటన రాకపోతే సచిన్ పైలెట్ వ్యూహం ఎలా మార్చుకుంటారోనన్న ప్రశ్నలైతే వినిపిస్తున్నాయి. రాహుల్‌తో భేటీలో ఈ సమస్యలకైతే సామరస్యపూర్వక పరిష్కారం లభించలేదు.

ఖర్గే వ్యూహం ఏంటి?

ఈ ఏడాది నవంబర్‌లోనే ఎన్నికలు ఉండడంతో ఇరువురు నేతల మధ్య పూర్తి స్థాయి అవగాహన కుదర్చడానికి సమయం అంతగా లేదు. చాలా తక్కువ సమయంలో ఇద్దరికీ సంతృప్తికరమైన చర్యలు ఎలా చేపడతారన్నది మరో పెద్ద సవాల్‌గా ఉంది. అశోక్ గెహ్లాట్ ప్రభుత్వ ప్రతిష్ట గత కొన్ని నెలలుగా మసకబారుతోంది. ఈ విషయంలో సీఎంకు అధ్యక్షుడు ఖర్గే ఘాటైన హెచ్చరికలు పంపినట్టు సమాచారం. కర్ణాటక తరహా ఫలితాలు రావాలంటే జూలై నాటికే 60% అభ్యర్థుల్ని ప్రకటించాలని అధ్యక్షుడు ఖర్గే గట్టిగా కసరత్తు చేస్తున్నారు. అది జరగాలంటే పైలెట్‌కు పీసీసీ అధ్యక్ష పదవి లేదంటే ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాల్సి ఉంటుంది. పీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చి పైలెట్ అనుచరులకే అధికంగా సీట్లు ఇస్తే అధికార వ్యతిరేకత నుంచి కూడా బయటపడవచ్చునని ఖర్గే భావిస్తున్నారు. దీనిపై ఖర్గే, హైకమాండ్ ఒక మాట మీదకొస్తే పైలెట్‌ను పీసీసీ చీఫ్‌గా అంగీకరించడమో లేదంటే తానే సీఎం పదవికి రాజీనామా చేయడమో గెహ్లాట్‌కు అనివార్యంగా మారుతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం గెహ్లాట్ తన అనుచరులతో మాట్లాడుతూ అందరూ సహనంగా ఉండాలని పిలుపునిచ్చారు. పైలెట్‌కు పార్టీలో ఏ పదవి ఇవ్వాలో హైకమాండ్ నిర్ణయిస్తుందన్నారు. తనకు పదవి ముఖ్యం కాదని, ఎన్నికల్లో గెలుపు కోసం హైకమాండ్ ఏం చెబితే అదే చేస్తానని వ్యాఖ్యానించడం కొసమెరుపు మొత్తమ్మీద సచిన్ పైలెట్ తండ్రి, దివంగత రాజేశ్ పైలెట్ వర్ధంతి జూన్ 11 లోపు పైలెట్‌కు పార్టీలో కీలక పదవి ఇచ్చే అవకాశాలైతే అధికంగా కనిపిస్తున్నాయి.

చిక్కుముళ్లు ఎలా విప్పతారో..!

అశోక్, పైలెట్ మధ్య విడదీయలేని చిక్కుముళ్లు ఎన్నో ఉన్నాయి. వసుంధరా రాజె ప్రభుత్వ హయాంలో అవినీతిపై విచారణ జరపాలని పైలెట్ డిమాండ్ చేస్తున్నప్పటికీ సీఎం గెహ్లాట్‌పై ఆయన వ్యక్తిగతంగా దూషణలకు దిగడంతో గెహ్లాట్ దీనిపై రాజీకి వచ్చే అవకాశాలు లేవని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో సంస్థాగతంగా పలు మార్పులు చేపట్టాలని అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భావించారు. కానీ పైలెట్‌ను విశ్వాసంలోకి తీసుకోకుండా ఇవి చెయ్యడం అంత సులభం కాదు. సోమవారం ఖర్గే నివాసంలో జరిగిన సమావేశంలో కూడా ఇరువురు నాయకుల మధ్య ఉన్న కీలక సమస్యలకు పరిష్కారం దొరకలేదు. రాహుల్, ఖర్గేలు తొలుత గెహ్లాట్‌తో చర్చించారు. అనంతరం సచిన్ పైలెట్‌తో చర్చలు జరిపారు. గంటల కొద్దీ సమావేశం జరిగినప్పటికీ గెహ్లాట్, పైలెట్ కలిసికట్టుగా పని చేస్తామని బహిరంగంగా చెప్పకపోవడం గమనార్హం.

డిమాండ్లపై పట్టు వీడని పైలెట్

సచిన్ పైలెట్ గత కొద్ది నెలలుగా చేస్తున్న డిమాండ్లపై వెనక్కి తగ్గే అవకాశాలు లేవు. వసుంధరా రాజె ప్రభుత్వ అవినీతిపై విచారణ, రాజస్తాన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఆర్‌పీఎస్‌సి) తిరిగి ఏర్పాటు చేసి కొత్త నియామకాలు చేపట్టడం పేపర్ల లీకేజీ వల్ల పరీక్షలు రద్దు ప్రభావం పడిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించడమనే మూడు డిమాండ్లపై సచిన్ పట్టు వీడడం లేదు. రాహుల్‌తో సమావేశానంతరం అశోక్ గెహ్లాట్ పార్టీ హైకమాండ్ కీలకమని, పార్టీ పెద్దలు ఎవరికి ఏ పదవి ఇస్తారో ముందుగానే స్పష్టమైన హామీలు ఇవ్వరంటూ చేసిన వ్యాఖ్యలు కూడా భవిష్యత్‌లో జరిగే సమావేశాల్లో ప్రతిబంధకంగా మారే అవకాశాలున్నాయి.

సాక్షి నేషనల్ డెస్క్

జూన్‌లో నిఘా ఉపగ్రహం ప్రయోగిస్తాం

సియోల్: తరచూ పలు క్షిపణులు, అధునాతన ఆయుధాల ప్రయోగాలతో నిరంతరం దక్షిణ కొరియా, అమెరికాలను బెంబేలెత్తిస్తున్న ఉత్తరకొరియా మరో బాంబు పేల్చింది. త్వరలోనే దేశ మొట్టమొదటి సైనిక నిఘా ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు మంగళవారం ప్రకటించింది. ప్రత్యర్థి దక్షిణకొరియాతో కలిసి అమెరికా చేపట్టే నిర్లక్ష్యపూరిత సైనిక విన్యాసాలపై కన్నేసి ఉంచేందుకు గగనతల నిఘా చాలా అవసరమని పేర్కొంది. కాగా, తమ గగనతలంలోకి ఈ ఉపగ్రహం ప్రవేశించినా, దాని శకలాలు కనిపించినా పేల్చి వేస్తామని జపాన్ హెచ్చరించింది.

సిసోడియాకు హైకోర్టులో చుక్కెదురు

బెయిల్ నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు • బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేయొచ్చని వ్యాఖ్య



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు ఢిల్లీ హైకోర్టు బెయిలు నిరాకరించింది. సీబీఐ కేసులో బెయిలు కోరుతూ సిసోడియా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ దినేశ్ శర్మ ధర్మాసనం విచారించింది. కేసులో వాదోపవాదనలు విన్నాక కేసు తీర్పును మంగళవారానికి రిజర్వ్‌చేస్తున్నట్లు 11వ తేదీనే హైకోర్టు తెలిపింది. ఈ మేరకు తీర్పును మంగళవారం జడ్జి వెలువరించారు. 'సౌత్ గ్రూప్‌కు ప్రయోజనం చేకూరేలా మద్యం విధానం రూపొందించారంటూ ఆయనపై వచ్చిన ఆరోపణల్లో చాలా తీవ్రత ఉంది' అంటూ బెయిల్‌ను న్యాయమూర్తి తిరస్కరించారు. సీబీఐ విచారిస్తున్న ఈ కేసులో ఫిబ్రవరి 26న అరెస్టయి సిసోడియా బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారు. ' మద్యం సంబంధ కేసులు విచారణ దశలో ఉన్న ఈ తరుణంలో ఎక్సయిజ్‌పాలసీనిగానీ, ఇలాంటి ఆర్థిక విధానాన్ని రూపొందించిన ప్రభుత్వ అధికారాన్నిగానీ పరిశీలించలేం. ఆయన గతంలో 18 శాఖలను నిర్వహిస్తూ శక్తివంతమైన మంత్రిగా ఉన్నారు. డెప్యూటీ సీఎం, ఎక్సయిజ్ శాఖ మంత్రిగా చేసిన వ్యక్తి దాదాపు అందరూ ప్రభుత్వ ఉద్యోగులే అయిన సాక్షులను ప్రభావితం చేస్తాడు అనే సీబీఐ ఆరోపణను తోసిపుచ్చలేం. పిటిషనర్‌కు బెయిల్ ఇవ్వకూడదని కోర్టు నిర్ణయానికొచ్చింది' అని జడ్జి చెప్పారు.

దైవ దర్శనానికి వెళ్తూ మృత్యుఒడిలోకి

- కశ్మీర్‌లో లోయలో పడిన యాత్రికుల బస్సు
- 10 మంది దుర్మరణం
- 57 మందికి గాయాలు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో యాత్రికులతో వెళ్తున్న బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడిన ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. జమ్మూకశ్మీర్‌లోని ప్రఖ్యాత మాతా వైష్ణోదేవి ఆలయ దర్శనార్థం బయల్దేరిన భక్తులు మరో 15 కిలోమీటర్లు ప్రయాణిస్తే ఆలయానికి చేరతామనగా ప్రమాదానికి గురై మృత్యుఒడికి చేరారు. జమ్మూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృత్‌సర్ నుంచి బయల్దేరిన బస్సు త్రికూట పర్వతాలపై కొలువైన వైష్ణోదేవి ఆలయ బేస్‌క్యాంప్ ఉన్న కాత్రాకు వస్తోంది. కాగా మంగళవారం ఉదయం ఆరున్నరగంటల ప్రాంతంలో జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారిపై ఝజ్జర్ కోట్లీ సమీపంలో కొండ మలుపు వద్ద వాలుగా ఉన్న వంతెన మీదకు వేగంగా వస్తూ ఒక్కసారిగా అదుపుతప్పింది. దీంతో డివైడర్‌ను దాటి కుడివైపుకొచ్చి రెయిలింగ్‌ను ఢీకొట్టి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 10 మంది మరణించారు. ప్రమాదవిషయం తెలియగానే స్థానికులు, సీఆర్‌పీఎఫ్, పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఘటనలో 57 మంది గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వారిలో ఇద్దరి ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బస్సు ప్రయాణికుల్లో చాలా మంది బిహార్ రాష్ట్రానికి చెందిన ఒక ఇంటి కుటుంబసభ్యులు, బంధువులే. చిన్నారికి పుట్టు వెంట్రుకలు తీయించేందుకు వెళ్తున్నామని ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన వ్యక్తి చెప్పారు. ప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ విచారంవ్యక్తంచేశారు.



మెరుగైన ప్రజా జీవనమే నా ధ్యేయం

- అందుకోసం నిరంతరం శ్రమిస్తా
- పాలన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ



న్యూఢిల్లీ: కేంద్రంలో పాలనాపగ్గాలు చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ట్విట్టర్ వేదికగా ప్రధాని మోదీ తన స్పందన తెలియజేశారు. 'దేశ ప్రజల జీవనం మరింత మెరుగ్గా ఉండాలనేదే నా ప్రతీ నిర్ణయానికి దిక్సూచి. భారతావని సేవలో మేం తొమ్మిది వసంతాలను పూర్తిచేసుకున్నాం. ప్రజలు చూపిన ప్రేమాభిమానాలు, కృతజ్ఞతలతో నా హృదయం తృప్తితో నిండిపోయింది. ప్రజలు మరింత మెరుగైన జీవనం సాగించాలంటే ఏం చేస్తే బాగుంటుందనే ఆలోచనకు అనుగుణంగానే ప్రతిసారి నిర్ణయం తీసుకున్నా. ప్రతి పనీ చేశా. అభివృద్ధి చెందిన భారతదేశ ఆవిర్భావం కోసం మేం అందరం నిరంతరం శ్రమిస్తాం' అని ట్వీట్‌చేశారు. ' దేశంలోని అణగారిన వర్గాల నుంచి పేదరికాన్ని దూరం చేసి వారి ఆర్థికస్థితి మెరుగుపరిచి గౌరవప్రద జీవితం అందించేందుకు కృషిచేశాం. ప్రతి పౌరుని స్వప్నాల సాకారానికి మా మిషన్ ఇకమీదటా కొనసాగుతుంది' అని అన్నారు. కాగా, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమాలకు బీజేపీ మంగళవారం నుంచి శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా బుధవారం రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో మోదీ ఒక సభలో ప్రసంగించనున్నారు. ఇప్పటికే పలు బీజేపీపాలిత రాష్ట్రాల్లో సీఎంలు, పార్టీ సీనియర్ నేతలు సోమవారమే పత్రికా సమావేశాల్లో మోదీ సర్కార్ సాధించిన ఘనతలను వివరించడం తెల్సిందే.

'ఆర్డినెన్స్'పై పోరులో ఆప్‌కు మద్దతిస్తాం

- సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ: ఢిల్లీలో పరిపాలనా సేవలపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికారాలు కట్టబెడుతూ కేంద్ర ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని సమాఖ్య విధానంపై జరిగిన దాడిగా సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభివర్ణించారు. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా జరిగే పోరులో సీఎం కేజ్రీవాల్‌కు మద్దతుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ ఆర్డినెన్స్ స్థానంలో కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లును అడ్డుకుంటామని ఆయన తెలిపారు. కేజ్రీవాల్ మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఏచూరితో భేటీ అయ్యారు. అనంతరం ఇద్దరు నేతలు మీడియాతో మాట్లాడారు. 'ఈ ఆర్డినెన్స్ కోర్టు ధిక్కారం. రాజ్యాంగాన్ని కాపాడేందుకు అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ముందుకు రావాలని కోరుతున్నా'అని ఏచూరి అన్నారు. అనంతరం కేజ్రీవాల్ మాట్లాడుతూ..'ఈ ఆర్డినెన్స్ నా కోసం తెచ్చింది కాదు. ఇది ఢిల్లీ ప్రజలకు, యావద్దేశానికి వ్యతిరేకం. 'కేజ్రీవాల్‌ను మర్చిపోండి. ఢిల్లీ ప్రజల పక్షాన నిలవండి. బీజేపీ వైపు ఉండాలా, ఢిల్లీ వాసుల పక్కన ఉండాలా కాంగ్రెస్ నిర్ణయించుకోవాలి'అని అన్నారు.

కాంగ్రెస్ ఎంపీ బాలు ధనోర్కర్ హఠాన్మరణం



న్యూఢిల్లీ/ముంబై: మహారాష్ట్ర నుంచి కాంగ్రెస్ తరఫున ఎన్నికైన ఏకైక లోక్‌సభ సభ్యుడు సురేశ్ అలియాస్ బాలు ధనోర్కర్(47) హఠాన్మరణం చెందారు. గుర్‌గ్రామ్‌లోని ఆస్పత్రిలో మంగళవారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారని మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తెలిపింది. నాగ్‌పూర్‌లోని ఆస్పత్రిలో ఈ నెల 26న ధనోర్కర్‌కు కిడ్నీ స్టోన్స్ ఆపరేషన్ జరిగింది. ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఆదివారం విమానంలో గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రికి తీసుకెళ్లారని కాంగ్రెస్ నేత బాలాసాహెబ్ తొరాట్ చెప్పారు. అక్కడే పరిస్థితి విషమించి చనిపోయినట్లు తెలిపారు. దీర్ఘకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ధనోర్కర్ తండ్రి నారాయణ్ ధనోర్కర్(80) శనివారం సాయంత్రం కన్నుమూశారు. ఆదివారం జరిగిన తండ్రి అంత్యక్రియలకు బాలు ధనోర్కర్ రాలేకపోయారు. కాగా, ధనోర్కర్‌కు భార్య ప్రతిభ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. శివసేన ద్వారా రాజకీయ రంగప్రవేశం చేసిన ధనోర్కర్ 2014లో ఎమ్మెల్యే అయ్యారు. 2019లో శివసేనను వీడి లోక్‌సభ ఎన్నికల్లో చంద్రాపూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, బీజేపీ సీనియర్ నేత హన్స్‌రాజ్ అహిర్‌పై గెలుపొందారు. మహారాష్ట్ర నుంచి కాంగ్రెస్ టికెట్‌పై గెలుపొందిన ఏకైక ఎంపీగా ధనోర్కర్ నిలిచారు. ఆయన భార్య ప్రతిభ వరోరా–భద్రావతి స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. బాలు ధనోర్కర్ అకాల మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ సంతాపం ప్రకటించారు.

మొదటిసారిగా అంతరిక్షంలోకి పౌర వ్యోమగామిని పంపిన చైనా



బీజింగ్/జియుక్వాన్: చైనా మంగళవారం మొదటిసారిగా ఒక పౌర వ్యోమగామి సహా ముగ్గురు వ్యోమగాములను సొంత అంతరిక్ష కేంద్రం టియాంగాంగ్‌కు పంపించింది. జియుక్వాన్ అంతరిక్ష కేంద్రం నుంచి వ్యోమగాములతో కూడిన షెంజౌ–16ను లాంగ్ మార్చ్–2ఎఫ్ రాకెట్ అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. పది నిమిషాల తర్వాత రాకెట్ నుంచి విడిపోయిన షెంజౌ–16 నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశించిందని చైనా మానవసహిత అంతరిక్ష సంస్థ(సీఎంఎస్‌ఏ) తెలిపింది. ఈ మిషన్ పూర్తిగా విజయవంతంగా పూర్తయిందని పేర్కొంది. 'షెంజౌ–16 అనంతరం టియాంగాంగ్ కోర్ మాడ్యూల్‌తో అనుసంధానమైంది. షెంజౌ–16లోని ముగ్గురు వ్యోమగాములు కోర్‌మాడ్యూల్ తియాన్హెలో ఉన్న ఇప్పటికే ఉన్న ముగ్గురు వ్యోమగాములను కలుసుకున్నారు. ఆ ముగ్గురు త్వరలోనే భూమికి తిరిగి వస్తారు'అని తెలిపింది. మంగళవారం పంపిన ముగ్గురిలో ఒకరు పేలోడ్ స్పెషలిస్ట్‌గా పేరున్న గుయి హయిచావో. ఈయన బీజింగ్‌లోని బీయిహంగ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. మిగతా ఇద్దరు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన వారు. 2030కల్లా చంద్రునిపైకి మనుషులను పంపే మానవ సహిత యాత్రకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఎంఎస్‌ఏ సోమవారం ప్రకటించింది.



కర్ణాటకలోని బెళగావిలో మంగళవారం అత్యవసరంగా ల్యాండయిన చిన్న విమానం. ఇది ప్రైవేట్ సంస్థ రెడ్‌బర్డ్ ఏవియేషన్‌కు చెందినది.

కాదన్నందుకే కడతేర్చాడు

'షాబాద్ డెయిరీ' హత్యోదంతంలో వెలుగులోకి కొత్త విషయాలు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని షాబాద్ డెయిరీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నడిరోడ్డుపై పదహారేళ్ల బాలికను అత్యంత పాశవికంగా 20సార్లకుపైగా పొడిచి, సిమెంట్ శ్లాబ్‌తో పుర్రె పగిలేలా మోదిన ఉదంతంలో నిందితుడు ఆమెపై కక్ష పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, నిందితుడు సాహిల్‌ను రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అయితే పోలీసుల దర్యాప్తులో హత్యోదంతం తాలూకు పలు అంశాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. హత్య నేరాన్ని పోలీసుల విచారణలో సాహిల్ ఒప్పుకున్నాడు. పక్కా ప్రణాళికతోనే అదే చోట చంపాలని ముందే నిర్ణయించుకున్నాడని తెలుస్తోంది. సన్నిహితంగా ఉండే బాలిక సాక్షి తనను దూరంగా పెట్టడం సాహిల్‌కు నచ్చలేదు. బంధం కొనసాగించాలని కోరగా తన స్నేహితురాళ్ల సమక్షంలోనే సాక్షి ఇతడిని తిరస్కరించింది. సన్నిహితంగా ఉండాలని బలవంతం చేస్తే చితకబాదుతామని సాక్షి స్నేహితులు సాహిల్‌ను హెచ్చరించారు. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. హత్యకు ఉపయోగించిన కత్తిని 15 రోజుల క్రితమే హరిద్వార్ నుంచి తీసుకొచ్చాడు. హత్య చేశాక పారిపోతూ కత్తిని రిఠాలా మెట్రో స్టేషన్ దగ్గరి పొదల్లో పడేశాడు. తర్వాత బులంద్‌షహర్‌లోని తన అత్తయ్య ఇంటికి వెళ్లాడు. ఉత్తరప్రదేశ్‌కు వెళ్లాక ఇంటికి ఫోన్‌చేశాడు. ఆ ఫోన్‌కాల్ సాయంతో జాడ కనిపెట్టి పోలీసులు ఇతడిని పట్టుకున్నారు. సాక్షి శరీరంపై 34 లోతైన గాయాలు ఉన్నాయని, పుర్రె పగిలిందని పోలీసులు వెల్లడించారు. 2021 జూన్ నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉండగా విడిపోదామని ఇటీవల చెప్పడంతో గత ఎనిమిదిరోజులుగా వారి మధ్య గొడవలు అవుతున్నాయి. ఆర్థికంగా స్థితిమంతుడైన తన మాజీ ప్రియుడితో మళ్లీ టచ్‌లోకి రావడంతోనే గొడవ పెరిగిందని సాహిల్ చెప్పాడు. కాగా, సాక్షి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థికసాయం చేస్తున్నట్లు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటించారు.

మాస్కోపై డ్రోన్ దాడులు



మాస్కో: రష్యా రాజధాని మాస్కోపై మంగళవారం ఉదయం డ్రోన్‌ల దాడి జరిగింది. ఈ దాడిలో ప్రాణహాని జరగలేదని, భవనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. మాస్కోపైకి దూసుకొచ్చిన ఎనిమిది డ్రోన్లను రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని చెప్పారు. డ్రోన్‌ల దాడిపై అధ్యక్షుడు పుతిన్ స్పందించారు. ఇది ఉక్రెయిన్ ప్రభుత్వం చేసిన ఉగ్రవాద దాడి అంటూ ఆరోపించారు. మాస్కోలో డ్రోన్లను కూల్చివేసిన ప్రాంతంలో కొన్ని భవనాలకు స్వల్ప నష్టం వాటిల్లిందని నగర మేయర్ సెర్గీ సొబియానిన్ చెప్పారు. ఇద్దరు పౌరులకు స్వల్పంగా గాయాలయ్యాయి, దెబ్బతిన్న రెండు బహుళ అంతస్తుల భవనాల్లోని వారిని ఖాళీ చేయించామని తెలిపారు. అయిదు డ్రోన్లను మాస్కోలో కూల్చివేయగా, మూడింటిని జామ్ చేసి దారి మళ్లించి పేల్చివేసినట్లు రక్షణ శాఖ తెలిపింది. యుద్ధం మొదలైన దాదాపు ఏడాదిన్నర కాలంలో డ్రోన్లతో ఏకంగా సుదూర ప్రాంతంలోని రష్యా రాజధానిపై డ్రోన్ దాడి జరగడం ఇది రెండోసారి. ఈ నెలారంభంలో అధ్యక్షుడు పుతిన్ లక్ష్యంగా రెండు డ్రోన్‌లు క్రెమ్లిన్‌పైకి వచ్చాయని రష్యా ఆరోపించింది. రష్యా గత 24 గంటల్లో మూడో విడత ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై వేకువజామున బాంబులతో విరుచుకుపడింది. కీవ్ వాసులు భయంతో షెల్టర్లలోకి పరుగులు తీశారు. దాడులతో ఒకరు చనిపోయారు. పేలుడు పదార్థాలతో వచ్చిన 20 షహీద్ డ్రోన్లను కూల్చివేసినట్లు కీవ్ అధికారులు తెలిపారు. మొత్తమ్మీద 24 గంటల్లో 31 వరకు డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ తెలిపింది.

మణిపూర్ పౌర ప్రతినిధులతో అమిత్ చర్చలు

అల్లర్ల మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల సాయం



ఇంఫాల్‌లో మహిళా ప్రతినిధులతో అమిత్

ఇంఫాల్: కుకీ, మెయిటీ జాతుల మధ్య వైరంతో నిప్పుల కుంపటిలా మారిన మణిపూర్‌లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొంది. దీంతో ఇరు వర్గాల మధ్య సయోధ్య సాధనకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నడుం బిగించారు. ఇందులోభాగంగా సోమవారం రాత్రి ఆయన తొలిసారిగా రాష్ట్ర పర్యటన మొదలుపెట్టారు. జాతుల మధ్య ఘర్షణ, ధ్వంసానికి నిలయమైన చురాచాంద్‌పూర్‌లో మంగళవారం షా పర్యటించారు. ఇంఫాల్‌లో కుకీ వర్గానికి చెందిన మహిళా బృందం, మెయిటీ వర్గం, మేధోవర్గాన్ని విడివిడిగా కలిసి సమస్యలు అడిగి తెల్సుకున్నారు. 'మణిపూర్‌లో మహిళా నేత(మెయిరా పైబీ)లతో భేటీ జరిగింది. భిన్న వర్గాలతో ఫలవంతమైన చర్చలు జరిగాయి. రాష్ట్రంలో శాంతి నెలకొనేందుకు సమష్టిగా కృషిచేస్తామని వాళ్లు హామీ ఇచ్చారు' అని భేటీ తర్వాత షా ట్వీట్‌చేశారు. తర్వాత రాష్ట్రంలో తాజా పరిస్థితిపై ముఖ్యమంత్రి బీరేన్ సింగ్, ఉన్నతాధికారులతో విడిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఘర్షణల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల సాయం చేస్తామని సోమవారమే కేంద్రం, మణిపూర్ సర్కార్ ప్రకటించాయి. ఘర్షణలకు అణచివేసేందుకు 10,000 మంది భారత సైన్యం, అస్సాం రైఫిల్స్ బలగాలు రాష్ట్రంలో మోహరించిన విషయం విదితమే. రాష్ట్రంలో మెయిటీలకు షెడ్యూల్ తెగ హోదా డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ కుకీ జాతి జనం చేపట్టిన సంఘీభావ ప్రదర్శన హింసాత్మకంగా మారి చివరకు 80 ప్రాణాలను బలిగొంది.

అమెరికాలో రాహుల్



శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికాలోని మూడు నగరాల పర్యటనలో భాగంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం శాన్‌ఫ్రాన్సిస్కోకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ శామ్ పిట్రోడా, ఆ విభాగం సభ్యులు రాహుల్‌కు ఆహ్వానం పలికారు. పర్యటనలో రాహుల్.. ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ విద్యార్థులతో, భారతీయ అమెరికన్లతో మాట్లాడతారు. వాషింగ్టన్‌లో పలువురు చట్టసభల సభ్యులను, మేధావులను కలుసుకుంటారు. మీడియా ప్రతినిధులతో సమావేశమవుతారు. జూన్ 4న న్యూయార్క్‌లో జరిగే ముఖాముఖితో ఆయన కార్యక్రమాలు ముగుస్తాయి. లోక్‌సభ సభ్యత్వం కోల్పోయిన రాహుల్ గాంధీకి కోర్టు ఆదేశాల మేరకు అధికారులు ఆదివారం కొత్తగా సాధారణ పాస్‌పోర్టును అందజేసిన విషయం తెలిసిందే.



మంగళవారం హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేసిన తెలుగు వారైన జస్టిస్ ఎంఎస్ రామచంద్ర రావుకు పుష్పగుచ్ఛమిస్తున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్

సాక్షి కరీంనగర్

బుధవారం । 31 । మే । 2023



టీటీడీ చైర్మన్‌కు స్వాగతం

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లో నిర్మించే శ్రీవారి ఆలయ భూమిపూజలో పాల్గొనేందుకు టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి మంగళవారం అర్ధరాత్రి నగరానికి చేరుకున్నారు. స్థానిక గెస్ట్ హౌస్‌లో కలెక్టర్ కర్ణన్ స్వాగతం పలికారు.



క్వింటాల్ పత్తి ధర రూ.7,000

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం క్వింటాల్ పత్తి ధర రూ.7,000 పలికింది. మార్కెట్ యార్డులో క్రయ విక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

గరిష్టం/కనిష్టం
38.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మోదీ పాలనలో ఆర్థిక ప్రగతి



కరీంనగర్‌టౌన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం 9 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో దేశ అభ్యున్నతితోపాటు ప్రజల కోసం అమలు చేస్తున్న పథకాలపై 'మహాజన్ సంపర్క్ అభియాన్' పేరిట గడప గడపకూ తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు అధ్యక్షతన నియోజకవర్గ నేతలతో సంజయ్ సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి చాడా సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బోడిగె శోభ, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, సత్యానారాయణ, ప్రతాప రామకృష్ణ, మోహన్‌రెడ్డితో కలిసి సంజయ్ మాట్లాడారు. యూపీఏ హయాంలో 2జీ, కోల్, స్పెక్ట్రమ్ సహా పెద్దఎత్తున స్కాంలు జరిగాయన్నారు. మోదీ వచ్చాక అవినీతిరహిత పాలన కొనసాగుతోందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక పెద్దదైన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టి రూ.5 లక్షల వరకు ఉచితంగా చికిత్స అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ ఉమ్మడి జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాల్లో జిల్లాకు రెండోస్థానం



కరీంనగర్ అర్బన్: బ్యాంకు లింకేజీ రుణాల్లో రాష్ట్రంలోనే జిల్లా రెండోస్థానంలో నిలిచింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 2023–24 బ్యాంక్ లింకేజీ లాంచింగ్ సందర్భంగా జిల్లా పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ జిల్లాలో 8,451 మహిళా సంఘాలకు రూ.704.11కోట్ల రుణాలు ఇప్పించడం జరిగిందని వివరించారు. ఈ క్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, అదనపు డీఆర్డీవో వెంకటేశ్వర్లు, బ్యాంకు లింకేజీ డీపీఎం వెంకటరమణయ్యను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎరబెల్లి దయాకర్‌రావు సత్కరించారు.

నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై చర్యలు

- సీపీ సుబ్బారాయుడు



మానకొండూర్: నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు అన్నారు. మండలంలోని చెంజర్ల నూజివీడు విత్తన ఉత్పత్తి కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన ధాన్యం బస్తాల ప్యాకింగ్ బార్ కోడింగ్ పరిశీలించారు. ఈ కేంద్రం నుంచి విత్తనాలు పొందిన రైతు కృష్ణారావుతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విత్తన ఉత్పత్తి కేంద్రాన్ని తనిఖీ చేయడం జరిగిందన్నారు. విత్తన ఉత్పత్తి కేంద్రాల నిర్వాహకులు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు సదరు కంపెనీలకు చెందిన విత్తనాల నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులు, మధ్య దళారీలు, ఏజెన్సీల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, తీవ్రతను బట్టి పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, విక్రయించే వారి సమాచారం ఉంటే స్థానిక పోలీసులు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ 87126 70760, ఇన్‌స్పెక్టర్ 87126 70708 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వారి పేర్లను గోప్యంగా ఉంచి నగదు పారితోషికం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయసారథి, ఇన్‌స్పెక్టర్లు సృజన్‌రెడ్డి, రవికుమార్, మానకొండూరు ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మళ్లీ తడిసిన ధాన్యం

- రైతులను భయపెడుతున్న అకాలవర్షాలు
- కొన్నిచోట్ల ఇంకా పూర్తికాని కొనుగోళ్లు
- ఉమ్మడి జిల్లాలో 11 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- ఇప్పటివరకు 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ప్రొక్యూర్‌మెంట్
- ఆందోళన వద్దంటున్న మంత్రి కమలాకర్



మంథని: మార్కెట్ యార్డులో వర్షపు నీళ్లలో ధాన్యం



రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని ధాన్యం సేకరణలో వేగం పెంచారు. మృగశిర కార్తె తరముకొస్తున్న వేళ.. రైతులు సాగుకు సమాయత్తం కావాల్సిన సమయంలో ఇంకా కొన్నిచోట్ల ధాన్యం కొనుగోళ్లు పూర్తికాని వైనం కలవరపెడుతోంది. సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంకా ధాన్యం సేకరణ పూర్తికాని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. చాలాచోట్ల ధాన్యం సేకరణలో జాప్యంపై రైతులు ఆగ్రహించారు.

ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణ వివరాలు

జిల్లా పేరు	సేకరించాల్సిన ధాన్యం (లక్షల మెట్రిక్ టన్నులు)	సేకరించిన ధాన్యం	రైతుల సంఖ్య	కొనుగోలు చేసిన ధాన్యం (రూ.కోట్లలో)
కరీంనగర్	2,32,467	2,41,556	40,490	497.49
జగిత్యాల	4,55,503	3,08,340	42,991	634.91
పెద్దపల్లి	3,04,846	2,37,139	29039	486.40
రాజన్నసిరిసిల్ల	1,88,513	1,71,146	27,826	352.55
మొత్తం	11,81,329	9,58,181	1,40,346	1971.35

- జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలంలో ఏకంగా జాతీయ రహదారిపైకి వచ్చి ఆందోళన చేశారు.
- పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోనూ పలువురు రైతులు రాస్తారోకోకు యత్నించారు.
- తాలు, తేమ, మట్టిబెడ్డల సాకుగా చూపుతూ నేటికీ మిల్లర్లు క్వింటాలుకు కనీసం తొమ్మిది కిలోల మేర ధాన్యం తరుగు తీస్తున్నారన్న విమర్శలు మాత్రం ఆగడం లేదు.

తొలకరి నాటికి లక్ష్యంగా..

ఓవైపు అకాల వర్షాలు రైతులను కలవర పెడుతుంటే.. మరోవైపు.. ప్రభుత్వం ధాన్యం సేకరణను వేగవంతం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ మొదటి వారానికి ధాన్యం సేకరణ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే చాలాచోట్ల కొనుగోలు కేంద్రాలు ధాన్యం కొనుగోలు పూర్తయ్యాక మూతపడ్డాయి కూడా. కరీంనరగ్‌లో 341 కేంద్రాలకు 56 కేంద్రాలు, పెద్దపల్లిలో 303 కేంద్రాలకు తొమ్మిది, సిరిసిల్లలో 255కు ఐదు, 416 కేంద్రాల్లో తొమ్మిది కేంద్రాలు మూతబడ్డాయి. మిగిలిన కేంద్రాల్లోనూ వీలైనంత త్వరగా కొనుగోళ్లు పూర్తిచేయాలని మంత్రి గంగుల కమలాకర్ ఆదేశించారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 11 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మిగిలిన 2.23 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

మృగశిర నాటికి కొనుగోళ్లుపూర్తి



తొలకరి సమీపిస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేశాం. ఉమ్మడి జిల్లాలో 11,81,329 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంకాగా ఇప్పటికే 9,58,181 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. మరో మూడు, నాలుగు రోజుల్లో మిగిలిన ధాన్యం కొనుగోలు చేస్తాం. కొనుగోలు కేంద్రాల్లో అక్కడక్కడా చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నా రైతులకు ఎలాంటి సమస్య రానివ్వం.

– సర్దార్ రవీందర్‌సింగ్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్

40 రోజులుగా ఇబ్బందులు



కల్లాల్లో ధాన్యం పోసి 40 రోజులు అవుతున్నా ఇప్పటివరకు కొనుగోలు చేయడం లేదు. వర్షం కురవడంతో ధాన్యం మొత్తం తడిసిపోయింది. కొనుగోళ్లలో జాప్యం జరుగుతంది. వారానికో లారీ రావడంతో ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం నెలకొంది. వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు కొనుగోళ్లు త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలి. ధాన్యం డబ్బులు సైతం సకాలంలో రావడం లేదు.

– క్యాతం రవి, రైతు, జగదేవ్‌పేట, వెల్గటూర్ మండలం

లారీలు వస్తలేవు



వరి కోతకోసి 30 రోజులు అవుతుంది. ధాన్యం తూకం వేసి నాలుగు రోజులు అవుతంది. లారీలు వస్తలేవు. మంగళవారం వర్షం కురువడంతో కొన్ని వడ్లబస్తాలు తడిచిపోయినయి. అధికారులు స్పందించి లారీల కొరత తీర్చాలి. ఇప్పటికే సాగు పనులు ప్రారంభం అయ్యాయి. ఉదయం నుంచి సాయంతరం వరకూ ఇక్కడే ఉంటే పనులెలా చేసుకోవాలి?

– రాచర్ల శంకర్, పెద్దూరు, సిరిసిల్ల

రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు



రైతులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరించే ఏ మిల్లర్‌నూ ఉపేక్షించబోం. మభ్యపెట్టినట్లు అనిపిస్తే రైతులు మాకు ఫిర్యాదు చేయాలి. వెంటనే తగిన చర్యలు చేపడతాం. అలాగే, తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు. ధాన్యంలో 17నుంచి 20శాతం వరకు తేమ ఉంటే.. తరుగు, కోత లేకుండా కొనుగోలు చేస్తాం.

– మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన విజయ్–సాగరిక దంపతుల కుమారుడు ఇటీవల పదో తరగతి పూర్తిచేశాడు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లోని కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ తీసుకున్నాడు. అయితే కళాశాల యాజమాన్యం ఏడాదికి ఆయన నుంచి ఈఫీజు.. ఆఫీజంటూ రూ.2.50 లక్షలు వసూలు చేసింది.

పెద్దపల్లికి చెందిన రాజేందర్–ఉమ దంపతుల కుమారుడు కరీంనగర్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ కోసం సంప్రదిస్తే ఏసీ హాస్టల్ అయితే రూ.1.60 లక్షలు, నాన్ ఏసీ అయితే లక్ష ఫీజు కట్టాల్సి ఉంటుందని యాజమాన్యం తెలిపింది.

విద్యార్థులపై కార్పొరేట్ వల

- ప్రారంభమైన ఇంటర్ ప్రవేశాలు
- చేర్పించుకునేందుకు తల్లిదండ్రులకు గాలం
- ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం

కరీంనగర్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 12,144 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. ఫలితాలు రాకముందు నుంచే కార్పొరేట్, ప్రవేట్ కాలేజీల యాజమాన్యాలు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం తాయిలాలు ప్రకటించాయి. విద్యార్థులను చేర్పించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అధ్యాపకులు, సిబ్బందికి కమీషన్ల ఆశచూపి అడ్మిషన్ల ప్రక్రియను మొదలుపెట్టాయి. దీంతో వారు విద్యార్థుల అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారు. ముందుగా అడ్మిషన్లు తీసుకుంటే ఫీజుల్లో రాయితీ అంటూ ఆశ చూపిస్తున్నారు. ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, నీట్ కోచింగ్, హాస్టల్ వసతి, విశాలమైన ప్రయోగశాలలంటూ మాయమాటలు చెబుతున్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో చెప్పిస్తున్నారు. ఇప్పుడే అడ్మిషన్లు తీసుకోవాలని... లేదంటే ఫీజు మరింత పెరిగే అవకాశం ఉందంటూ భయపెడుతున్నారు.

డబ్బులిచ్చి డాటా సేకరణ..

కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఆయా పాఠశాలల యజమానులకు డబ్బులిచ్చి విద్యార్థుల డాటా సేకరించాయి. ఏజెంట్లు, పీఆర్‌ఓలకు విద్యార్థుల సంఖ్యనుబట్టి కమీషన్లు ఇస్తున్నాయి. దీంతో వారు డబ్బుపై ఆశతో చదువువెలా ఉన్నా.. బోధన సరిగ్గాలేకున్నా.. విద్యార్థులను ఇష్టమొచ్చిన కాలేజీల్లో చేర్పిస్తున్నారు. కోరిన కోర్సులో సీటు ఇప్పిస్తామంటూ ఆఫర్లు ఇస్తున్నారు. ముందుగానే సీటు రిజర్వ్ చేసుకోకపోతే కోరిన బ్రాంచీలో సీటు దొరకదని బెదరగొడుతున్నారు.

అప్రమత్తతే ముఖ్యం..

తల్లిదండ్రులు తొందరపడి పిల్లల భవిష్యత్తును నాశనం చేయొద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్కసారి కాలేజీల్లో చేరితే తర్వాత ఎవరూ పట్టించుకోరని పేర్కొంటున్నారు. గత సంవత్సరం సైతం కార్పొరేట్ గారడిలో పడిమోసపోయిన సంఘటనలు ఉన్నాయి. కార్పొరేట్ కళాశాలలో చేర్పించే ముందు విద్యార్థుల అభిప్రాయాలతో పాటు ఆ కళాశాలలో విద్యానాణ్యత, విద్యాబోధన చేస్తున్న వారి అనుభవం, ఆ కళాశాలకు చెందిన సీనియర్ విద్యార్థులు, పూర్వవిద్యార్థులను అడిగి తెలుసుకోవడంతో పాటు హాస్టల్ లో ఉంచినట్లయితే వసతిపై ఆరాతీసిన తర్వాతనే అడ్మిషన్ కోసం మొగ్గు చూపాలి. తమ విద్యవ్యాపారం కోసం నిత్యం పుస్తకమే ప్రపంచంగా మార్చే కళాశాలలు కోకొల్లలుగా ఉన్నాయి. అలాంటి కళాశాలలో చేర్పిస్తే విద్యార్థి ఒత్తిడికి గురై మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు లేకపోలేదు. తొందరపాటు చర్యలతో కార్పొరేట్ కళాశాల మాయలో పడి ఇబ్బందులు పడకుండ తల్లిదండ్రులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.

కట్టడి చేయాలి



కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు పీఆర్‌వోలను నియమించుకొని ఇంటర్ ప్రవేశాల కోసం చేస్తున్న అసత్య ప్రచారాన్ని కట్టడి చేయాలి. పదో తరగతి ఫలితాలు వెలువడగానే తాయిలాలు ప్రకటిస్తూ అసత్య ప్రచారం చేసేవారిని అడ్డుకోవాలి. అడ్మిషన్ల దందాపై పోరాట కార్యక్రమాలు రూపొందిస్తాం.

– మచ్చ రమేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ కళాశాలలే బెటర్



ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియను ప్రభుత్వం ప్రకటిస్తుంది. కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు. ప్రభుత్వ కళాశాలలో నిపుణులైన అధ్యాపకులతో బోధన సాగుతుంది. మాయమాటలోపడి ఆర్థికంగా నష్టపోవద్దు. ఎవరైనా ప్రవేశాల కోసం ఇంటికి వెళ్లినా.. ఫోన్లు చేసి ఇబ్బందులకు గురిచేసినా చర్యలు తీసుకుంటాం.

– రాజ్యలక్ష్మి, డీఐఈవో, కరీంనగర్

నేడు శ్రీవారి కల్యాణం



గజరాజు ఆశీర్వాదం తీసుకుంటున్న మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, మేయర్ సునీల్‌రావు తదితరులు

- గజరాజుల ఆశీర్వాదం తీసుకున్న ప్రజాప్రతినిధులు
- భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరిన మంత్రి గంగుల కమలాకర్



తిరుమల లడ్డూలతో కరీంనగర్ చేరుకున్న తితిదే ఉద్యోగులు

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ పద్మనగర్‌లో బుధవారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించే శ్రీవారి ఆలయానికి భూమిపూజ, సాయంత్రం నిర్వహించే కల్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని మంత్రి గంగు కమలాకర్ కోరారు. మంగళవారం సాయంత్రం టీటీడీ ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితుల ఆధ్వర్యంలో విశ్వక్సేన, పుణ్యాహవచనం, శిలాధివాసం, మండపారాధన పూజల్లో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ సునీల్‌రావు పాల్గొన్నారు. గజరాజుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ మంకమ్మతోట వేంకటేశ్వర ఆలయం నుంచి సాయంత్రం నాలుగు గంటలకు సారెతో టీటీడీ క్షేత్ర నిర్మాణ ప్రతిపాదిత స్థలం వరకు శోభాయాత్ర, అనంతరం శ్రీవారి కల్యాణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీ సుబ్బరాయుడు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ పాల్గొన్నారు.

హాజరుకానున్న టీటీడీ చైర్మన్

శ్రీవారి కల్యాణం కోసం తిరుపతి నుంచి తెప్పించిన 20 వేల లడ్డూలు కరీంనగర్‌కు చేరుకున్నాయి. బుధవారం సాయంత్రం 6 గంటలకు శ్రీవారి కల్యాణానికి వచ్చేభక్తులకు తిరుపతి లడ్డూతో పాటు పసుపు, కుంకుమ, కంకణం ప్రసాదంగా ఇవ్వనున్నారు. కల్యాణం అనంతరం అన్నదానం చేయనున్నారు. భూమిపూజకు ముఖ్య అతిథులుగా మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, హైదరాబాద్ లోకల్ అడ్వయిజరీ చైర్మన్ జీవీ భాస్కర్‌రావు, రాజ్యసభ సభ్యుడు డి.దామోదర్‌రావు, టీటీడీ ఆలయ ఈవో ధర్మారెడ్డి హాజరుకానున్నారు.

అట్టహాసంగా ఆవిర్భావ వేడుకలు

- శాఖలవారీగా శకటాలు, స్టాళ్లు
- కలెక్టర్ ఆర్వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్ అర్బన్: తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధశాఖ అధికారులతో రివ్యూ నిర్వహించారు. వచ్చేనెల 2న పతాకావిష్కరణ కార్యక్రమం అనంతరం వివిధ శాఖలు 2014 నుంచి 2023 వరకు అమలు చేసిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాల శకటాలు ప్రదర్శించాలన్నారు. శాఖలవారీగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే వారికి భోజనాలు ఏర్పాట్లను చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో లైటింగ్, దశాబ్ది ఉత్సవాల లోగో ఏర్పాటు చేయాలన్నారు.

రైతు వేదికలు కేంద్రంగా రైతు దినోత్సవం

3న రైతు దినోత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలోని 76 రైతు వేదికలలో రైతు దినోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. 7న సాగునీటి దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ పరిధిలో వేడుకలు నిర్వహించాలని సూచించారు. 8న నిర్వహించే ఊరూరా చెరువుల పండుగ కోసం ప్రజా ప్రతినిధులను సంప్రదించి ప్రతీగ్రామంలో పెద్దచెరువు ఎంపిక చేయాలని, చెరువు పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కట్ట మైసమ్మ పూజ చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జీవీ శ్యాంప్రసాద్ లాల్, గరిమాఅగర్వాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, సర్వే అండ్ లాండ్ రికార్డ్ శాఖ అధికారి అశోక్, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బడిబాట షెడ్యూల్ మార్చాలి

కరీంనగర్: ఎండలు మండుతున్నా వేసవి సెలవులు ముగియకుండానే ప్రభుత్వం జూన్ 3 నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడం సరికాదని, వెంటనే బడిబాట షెడ్యూల్ మార్చాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాద్రీ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు తప్పకుండా నిర్వహించి విజయవంతం చేస్తారని, అయితే జూన్ 12 నుంచి కార్యక్రమం చేపడితే ఉపాధ్యాయులు సంతోషంగా నిర్వహిస్తారని ప్రభుత్వం తక్షణమే ఈ విషయంలో పునరాలోచించాలని అన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ఉపాధ్యాయలోకం వెనకడుగు వేసే ప్రసక్తే ఉండదని, అయితే ఎండల వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నందున జూన్ 12 నుంచి షెడ్యూల్ ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. స్థానికుల వివరాలు.. మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గడ్డం రాజశేఖర్ తన కొడుకు రిషికేశ్‌తో మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా.. నడుచుకుంటూ వెళ్తున్న చిగురుమామిడికి చెందిన నారాయణపురం చంద్రశేఖర్‌ను ఢీకొన్నాడు. ఈప్రమాదంలో రిషికేశ్, చంద్రశేఖర్ గాయపడగా 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

ఉపాధి కూలీకి తీవ్రగాయాలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని మొలంగూర్ గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ కూలీకి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల వివరాలు.. మొలంగూర్‌లోని ఎస్సారెస్పీ ఉపకాలువలో ఉపాధి పథకంలో కూలీలు పూడికతీత పనులు చేస్తున్నారు. తట్టతో పూడికను కాలువపైన పోస్తుండగా గట్టు పైనుంచి అదుపు తప్పి రాణవేని రాణి, మరాఠి భారతి కాలువలో పడిపోయారు. రాణికి తీవ్ర, భారతికి స్వల్పగాయాలు అయ్యాయి. కూలీలు 108కు సమాచారం అందించడంతో ఈఎమ్‌టీ సురేశ్ ప్రథమ చికిత్స చేసి హుజురాబాద్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యుల సూచన మేరకు ఇద్దరినీ వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

గ్రూప్‌-1 ప్రిలిమినరీ పకడ్బందీగా నిర్వహించాలి

కరీంనగర్: జిల్లాలో టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్లో గ్రూప్‌-1 పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 16,829 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, వీరికోసం 34 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెంటర్లవద్ద విద్యుత్, తాగునీరు, తదితర సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదని తెలిపారు. అదనపు కలెక్టర్ జీవీ.శ్యాం ప్రసాద్ లాల్, శిక్షణా జాయింట్ కలెక్టర్ నవీన్ నికోలస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రాజ్యలక్ష్మి, తహసీల్దార్లు కనుకయ్య, సుధాకర్, నారాయణ, చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

వాహన షోరూం యజమాని బలవన్మరణం

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్, మేడిపెల్లి మండల కేంద్రాల్లో హీరో షోరూంలు నిర్వహిస్తున్న యజమాని పబ్బని నరేశ్(38) హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. షోరూం నిర్వహణలో ఆర్థిక నష్టాలు రావడంతో 15రోజులుగా మొబైల్‌ఫోన్ స్విచ్ఛాప్ చేసుకున్నారు. లాటరీల ద్వారా బైక్‌లు బహుమతిగా అందిస్తామనే విషయంలో నష్టాలు రావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. నరేశ్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆయన మృతితో కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో లాటరీ డబ్బులు చెల్లించిన సుమారు 500 మంది ఆందోళనకు గురవుతున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని చైతన్యనగర్‌లో కుటుంబసభ్యులతో కలిసి నరేశ్ నివాసం ఉండేవారు.

దారికాచిన మృత్యువు

- అల్లుడిని ద్విచక్రవాహనంపై ఇంటికి తీసుకొస్తుండగా..
- వేగంగా వచ్చి ఢీకొట్టిన కారు
- ఘటన స్థలంలో మామ, చికిత్స పొందుతూ అల్లుడు మృతి
- రెండు కుటుంబాల్లో విషాదం




ఘటన స్థలంలో నర్సింహచారి, అశోక్




నర్సింహచారి (ఫైల్) అశోక్ (ఫైల్)

కరీంనగర్‌రూరల్: మృత్యువు దారికాచింది.. మామఅల్లుళ్లను బలితీసుకుంది. అల్లుడి కారు చెడిపోవడంతో.. ఇంటికి తీసుకొచ్చేందుకు మామ ద్విచక్రవాహనంపై వెళ్లగా.. ఇద్దరినీ కారు రూపంలో కబలించింది. రాజీవ్‌రహదారిపై సోమవారం అర్ధరాత్రి తర్వాత రోడ్డు క్రాస్ చేస్తున్న ద్విచక్రవాహనాన్ని వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో మామ అక్కడికక్కడే చనిపోగా, అల్లుడు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం..

ఇంటికి వెళ్లి వస్తుండగా..

పెద్దపల్లి జిల్లా రాఘవపూర్‌కు చెందిన కనపర్తి అశోక్(32)కు కరీంనగర్‌కు చెందిన సిరికొండ నర్సింహచారి (55) కూతురు రవళితో వివాహమైంది. అశోక్ కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లిలో కుటుంబంతో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం కారులో రాఘవపూర్ వెళ్లాడు. అదేరోజు అర్ధరాత్రి ఒంటిగంటకు తిరిగి వస్తుండగా మొగ్దుంపూర్ శివారులో కారు చెడిపోయింది. దీంతో కరీంనగర్‌లో ఉంటున్న మామ నర్సింహచారికి ఫోన్ చేసి చెప్పగా అతడు అల్లుడిని తీసుకొచ్చేందుకు ద్విచక్ర వాహనంపై మొగ్దుంపూర్ వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో తీగలగుట్టపల్లి వెళ్లేందుకు గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్డు వద్ద వీరు రోడ్డు క్రాస్ చేస్తుండగా కరీంనగర్ నుంచి సుల్తానాబాద్‌కు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మామ అల్లుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న బ్లూకోల్ట్స్ పోలీసులు, కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే నర్సింహచారి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అశోక్ చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతిచెందాడు. మామఅల్లుళ్ల మృతిచెందడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. నర్సింహచారికి భార్యతోపాటు ఒక కొడుకు, కుమార్తె ఉండగా, అశోక్‌కు భార్య, రెండేళ్ల కొడుకు ఉన్నారు. అశోక్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మలేషియా వీసాల మోసం ఎవరిది?

- ఏజెన్సీ అధికారిక గుర్తింపు ఒకరి పేరిట.. ఆర్థిక లావాదేవీలు మరొకరివి
- ఆదిత్య మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ తీరు
- అయోమయంలో 15 మంది బాధితులు

సిరిసిల్ల క్రైం: జిల్లా కేంద్రంలో నడుస్తున్న ఆదిత్య మ్యాన్ పవర్ కన్సల్టెన్సీలో అధికారిక గుర్తింపు ఒకరిది కాగా ఆర్థిక లావాదేవీలన్నీ మరొకరివిగా సాగుతున్నట్లు సమాచారం. మలేషియా వీసాల పేరిట మోసం జరిగిందంటూ సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో దూస రమేశ్ సోమవారం ఫిర్యాదు చేశాడు. దీంతో చెన్నైకి చెందిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ ఇదంతా పక్కా ప్లాన్‌తో బాధితులను బురిడీ కొట్టించేందుకు జరుగుతున్న తంతు అని జిల్లాలో చర్చ జరుగుతోంది. మలేషియా వెళ్లేందుకు ఆదిత్య మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీకి 15 మంది పాస్‌పోర్టులు, నగదు అప్పగించారు. అధికారిక ఏజెన్సీగా ఉన్న కంపెనీ ప్రతీ రూపాయి లావాదేవీకి రసీదు అందించాలన్నది నిబంధన. కానీ అదేదీ లేకుండా తాము చెన్నైకి చెందిన ఇద్దరిని నమ్మి 15 పాసుపోర్టులు, రూ.6 లక్షలు ఇచ్చినట్లు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న దార్నం శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. ఆదిత్య మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ దూస రమేశ్ పేరిట ఉందని అతనే అన్ని విషయాలు చూస్తారన్నారు. దీనిపై రమేశ్‌ను అడిగితే తన పేరిట గుర్తింపు ఉన్న మాట వాస్తవమే కానీ ఆర్థిక లావాదేవీలన్నీ శ్రీనివాస్ చూస్తారంటూ దాటవేశారు. మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీలో వివిధ దేశాలకు కార్మికులను పంపే సమయంలో అధికారిక గుర్తింపు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రసీదులు, ఏడాదికి ఎంత మంది పంపించేందుకు అవకాశం ఉంది అనే ప్రశ్నలకు నిర్వాహకుల వద్ద సమాధానాలు లేవు.

తప్పించుకునేందుకే ముందుగా ఫిర్యాదు..

మలేషియాకు సంబంధించి వీసాలన్నీ నకిలీవని తెలిసిన ఏజెన్సీ నిర్వాహకులు ఈ విషయం బయటకు తెలిస్తే తమను నమ్మి డబ్బులు పెట్టిన వారంతా ఏజెన్సీ మీద పడతారన్న ముందస్తు సమాచారంతో చెన్నై వారి చేతిలో మోసపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాదు ఏజెన్సీలో ఎండీగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్ డబ్బులను రికవరీ చేయడానికి చెన్నై వెళ్లినట్లు మీడియాకు తెలిపారు. పోలీసు కేసు నమోదైతే ఇక ఈ వ్యవహారమంతా కోర్టు పరిధిలోకి వెళ్తుందని, దీంతో బాధితులెవరైనా తమ వద్దకు వస్తే తామే మోసపోయినట్లు చెప్పి, చేతులు దులుపుకునే దారిని ఎంచుకున్నట్లు సమాచారం. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరగగా వారందరినీ ఎలాగోలా వివిధ దేశాలకు పంపించిన దాఖలాలున్నాయి. డబ్బులు పెట్టి, వేచిచూస్తున్న ప్రస్తుత బాధితులను కూడా అదే విధానంలో ఏదో ఒక దేశానికి పంపిస్తారన్న చర్చ జిల్లాలో జరుగుతోంది.

రైతు ఆర్థికస్థితిని మెరుగుపరచాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న సుగుణాకర్‌రావు

- కిసాన్ జాగరణ్ రాష్ట్ర అధ్యక్షుడు సుగుణాకర్‌రావు

కరీంనగర్‌టౌన్: దేశంలోని రైతాంగ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కిసాన్ జాగరణ్ రాష్ట్ర అధ్యక్షుడు పాల్సాని సుగుణాకర్‌రావు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని కృషిభవన్‌లో కిసాన్ జాగరణ్ ఆధ్వర్యంలో జరిగిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. రైతాంగం అధునాతన పద్ధతులు అవలంబిస్తూ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇతర రంగాల వలె వ్యవసాయ రంగంలో కూడా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెంచాలని, అట్టి పరిజ్ఞానం రైతుల చెంతకు చేర్చాలని పేర్కొన్నారు. రైతు పండించిన ప్రతి పంటకు లాభసాటి ధర, ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వాటిల్లితే పరిహారం చెల్లింపులు ప్రభుత్వాల బాధ్యతని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడి, ఎక్కువ పంట, ఆ పంటను విలువ ఆధారిత ఎక్కువ ధరకు అమ్ముకున్నప్పుడే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని స్పష్టం చేశారు. అంతరం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పంట మార్పిడి, అధికోత్పత్తి, అధిక ధరకు అమ్ముకోవడం ఎలాగో రైతులకు వివరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రశాంతి, వీరేష్ వేమారెడ్డి, సుదేష్ శర్మ, అనామిక పటేల్, ప్రభాకర్, ప్రదీప్, గురువయ్య, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల రైతు ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధులు, ఆదర్శ రైతులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రీజియన్ డిపో మేనేజర్లతో సమీక్ష



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కరీంనగర్: కరీంనగర్ రీజనల్ మేనేజర్ ఎస్.సుచరిత, రీజియన్‌లోని 11 మంది డిపో మేనేజర్లతో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ, డిపో మేనేజర్లు సమష్టిగా కృషి చేసి రీజియన్‌ను లాభాల బాటలో నడపాలన్నారు. అనంతరం డిపో మేనేజర్లకు ల్యాప్‌టాప్‌లు అందించారు. సమావేశంలో కరీంనగర్ రీజియన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్.చందర్‌రావు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) ఎస్.భీంరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైం కేసు నమోదు

జ్యోతినగర్(రామగుండం): క్రెడిట్ కార్డు నుంచి ఖాతాలోకి రూ.20 వేలు మార్చుకోగా అవి ఖాతాలో కనిపించకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైం కేసు నమోదైంది. వివరాలు.. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌కు చెందిన వర్లే శ్రీను జనవరిలో క్రెడిట్ కార్డు నుంచి తన ఖాతాలోకి డబ్బుల జమ చేసుకునే క్రమంలో అవి ఖాతాలో జమకాలేదు. గూగుల్‌లో సెర్చ్ చేసే సమయంలో క్రెడా యాప్‌నకు సంబంధించిన ఓ వ్యక్తి ఫోన్ ద్వారా వివరాలు తెలుసుకుని డబ్బులు ఖాతాలోకి రావాలంటే పూర్తి వివరాలను సంబంధిత ఫైల్‌లో నమోదు చేసి పంపాలని సూచించాడు. దీంతో శ్రీను కార్డు వివరాలను పంపించడంతో రెండుసార్లు మొత్తం రూ.29,400 తన ఖాతా నుంచి ఇతరుల ఖాతాలోకి వెళ్లడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సైబర్ క్రైం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఉపాధి' పని చేస్తూ.. కుప్పకూలాడు

- ధర్మారంలో కూలీ మృతి



చంద్రయ్య (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ధర్మారంలో ఉపాధిహామీ పని చేస్తూ ఓ కూలీ అకస్మాత్తుగా మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మారం గ్రామానికి చెందిన మల్లేవేణి చంద్రయ్య (55) మంగళవారం ఉపాధిహామీ పనికి వెళ్లాడు. అల్లంతోట బోరు వద్ద పని చేస్తున్న ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కూలీలు లేపిచూసేసరికి మృతిచెందాడు. గుండెపోటుతో చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య భాగ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రయ్యది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచు గున్నాల అరుణ కోరారు.

వ్యవసాయాన్ని సురక్షిత రంగంగా తీర్చిదిద్దాలి


- మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య



మాట్లాడుతున్న తిరుపతయ్య

జమ్మికుంట(హుజూరాబాద్): వ్యవసాయాన్ని సురక్షితమైన రంగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీర్చిదిద్దాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకుడు కొండల్ అన్నారు. మంగళవారం జమ్మికుంటలోని చాణక్య డిగ్రీ కళాశాలలో రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో కౌలు రైతు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు కానివారు ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది కౌలు రైతులు ఉండగా, 9లక్షల మంది ఎకరం ఉన్న రైతులు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారని, మరో 9లక్షల మంది భూమిలేని వారు కౌలు వ్యవసాయమే ఆధారంగా వ్యవసాయం చేస్తున్నారని వివరించారు. ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన పంటనష్ట పరిహారం, 2011 అధికృత రైతు చట్టం (లైసెన్స్ కల్టివేటర్ చట్టం) ద్వారా కౌలు రైతును గుర్తించి కార్డులు అందజేయాలన్నారు. సమావేశంలో ముక్క ఐలయ్య, గోసిక మధు, గుంటి సామ్రాజ్యం, మారపల్లి మొగిలయ్య, అంజి, ముదిగంటి సాగర్ రెడ్డి, మార్వాడి సుదర్శన్, రాజయ్య, రమేష్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేత



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కరీంనగర్: వంద శాతం ఉద్యోగ అవకాశాలు హోటల్ రంగంలో ఉన్నాయని కిమ్స్ విద్యాసంస్థల చైర్మన్ సాకేత్ రామారావు అన్నారు. కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం 58 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేసి మాట్లాడారు. హోటల్ రంగంలో మన దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణలో వంద శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న ఏకైక కళాశాల కిమ్స్ అని గుర్తు చేశారు. ప్రిన్సిపాల్ భూంపల్లి అనూష్‌రెడ్డి మాట్లాడుతూ, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు వంద శాతం విద్యార్థులకు అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. కిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్‌రావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
PLOT FOR SALE
■ రసూల్‌పల్లి : శ్రీ నిలయం DTCP వెంచర్‌లో ప్లాట్లు No's E/F 114, W/F 106,107,108 తక్కువ ధరలో అర్జెంటుగా అమ్మబడును. Ph : 6300291081 [HA-2751]

SERVICES
■ త్రినేత్ర గోల్డ్: మీ బంగారం బ్యాంకులో గాని ఏ సంస్థలో వున్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును.(స్పాట్‌క్యాష్) బంగారంపై అధికం లోన్ ఇవ్వబడును. ✆ 9389214214. [T-88]

WANTED
■ శతాబ్ది ఆర్గానిక్ ప్రొడక్ట్‌కు డిస్ట్రిబ్యూట్ చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలర్స్ కావలెను. వివరాలకు ఫోన్ : 9966189898 [H-778997]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786366]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

ఉద్యోగాల పేరిట టోకరా

- నిందితులను అరెస్టు చేసిన వన్‌టౌన్ పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

కరీంనగర్‌క్రైం: నిరుద్యోగ, అమాయక యువతకు ఉద్యోగాల పేరిట గాలం వేసి, వారి నుంచి లక్షల రూపాయలు దండుకొని మోసం చేస్తున్న ముఠాను కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. టౌన్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ తుల శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా ఇందారం గ్రామానికి చెందిన మందల భాస్కర్, పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గంగారపు మధుమూర్తి, చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన బత్తిని వైకుంఠం, కరీంనగర్‌కు చెందిన మంద సతీష్‌కుమార్, గట్టుదుద్దెనపల్లికి చెందిన మేకల శ్రవణ్ ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షల్లో వసూలు చేస్తూ నిండా ముంచుతున్నారు. వీరి వల్ల నష్టపోయిన బాధితుడొకరు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదయింది. వన్‌టౌన్ సీఐ సీహెచ్ నటేష్, ఎస్సై రహీంపాషా ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితులపై నిఘా పెట్టారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.93 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని మంద సతీష్, మేకల శ్రవణ్‌ను ఇప్పటికే అరెస్టు చేయగా మంగళవారం మందల భాస్కర్, గంగారపు మధుమూర్తి, బత్తిని వైకుంఠంను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను లోతుగా విచారణ చేపట్టి ఎంత మందిని మోసం చేశారో తెలుసుకుంటున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ సీహెచ్.నటేష్, టూటౌన్ సీఐ లక్ష్మీబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ కార్యక్రమంలో ఆర్పీల పాత్ర కీలకం

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



ఆర్పీలకు చీరలు అందిస్తున్న మంత్రి కమలాకర్

కరీంనగర్: ప్రభుత్వం చేపడుతున్న ప్రతీ కార్యక్రమం విజయవంతంలో రిసోర్స్‌పర్సన్ల పాత్ర కీలకమని, ఆర్పీల గౌరవాన్ని తెలంగాణ ప్రభుత్వం పెంచిందని బీసీ సంక్షేమం, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళా రిసోర్స్ పర్సన్స్, వీవోలకు తన సొంత ఖర్చుతో మంత్రి గంగుల కమలాకర్ చీరలు పంపిణీ చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోదరుడిగా ఆడబిడ్డలకు ఇచ్చిన హామీ మేరకు 221మందికి ఇందులో 169మంది రిసోర్స్‌పర్సన్స్, 52మంది వివోలకు చీరలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు విజయవంతంలో రిసోర్స్ పర్సన్ల పాత్ర కీలకమని అన్నారు. రాష్ట్రం రాకముందు రిసోర్స్‌పర్సన్లకు రూ.200 గౌరవ వేతనం ఉంటే రాష్ట్రం వచ్చిన తర్వాత నాలుగు వేలకు పెంచడం జరిగిందన్నారు. మేయర్ వై.సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, ఎంపీపీ టి.లక్ష్మయ్య, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, జెడ్పీటీసీ పిట్టల కరుణ పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

కరీంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు జూన్ 4న కొత్తగూడెంలో జరిగే సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. బీజేపీ కో హఠావో దేశ్ కో బచావో నినాదంతో సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు గత నెల 14 నుంచి దేశవ్యాప్తంగా ఇంటింటికీ, పల్లె పల్లెకు, ప్రజల వద్దకు సీపీఐ నినాదంతో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేకత విధానాలను ఎండగడుతూ, సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కొత్తగూడెంలో నిర్వహించే సభ విజయవంతం కోసం జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, బోయిని తిరుపతి, నాగెల్లి లక్ష్మారెడ్డి, గొడిశెల తిరుపతిగౌడ్, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజు, పంజాల శ్రీనివాస్, బ్రామండ్లపెల్లి యుగేందర్, బూడిద సదాశివ, ముద్రకోల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం



తడిచిన ధాన్యం చూపుతున్న నాయకులు

గన్నేరువరం(మానకొండూర్): వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశం అనంతరం మార్కెట్‌యార్డులో ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఒక పక్క ఖరీఫ్ సమీపిస్తుంటే కేంద్రాల్లో ధాన్యం తరలింపుపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. రైతుల పట్ల స్థానిక ఎమ్మెల్యే ఎంత నిర్లక్ష్యంగా ఉన్నాడో అర్థమవుతుందని అన్నారు. ఒక్కో బస్తా మీద కనీసం 5 కిలోల వరకు కట్ చేస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. ధాన్యం తరలించేందుకు లారీలు దొరకడం లేదని అధికారులు సమాధానం ఇస్తున్నారని, మరి ఇసుక తరలింపునకు లారీలు ఎక్కడివని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే వ్యవసాయ మార్కెట్ పదవుల మీద పెట్టే దృష్టి రైతుల మీద పెడితే బాగుపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జిలు ఇగోళ్ళ వెంకన్నగౌడ్, కుమ్మరి సంపత్, అసెంబ్లీ అధ్యక్షుడు బోనగిరి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు మాతంగి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాజమల్లు, మండల అధ్యక్షుడు బామాండ్ల ఎల్లయ్య, మహిళ కో కన్వీనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడో రోజు బోణి

- సీఎం కప్‌లో రెండు రజత, కాంస్య పతకాలు గెలుచుకున్న జిల్లా క్రీడాకారులు



సాత్విక్‌రాజ్



హన్సికరావు



శైలజ

కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరుగుతున్న సీఎం కప్‌లో జిల్లా క్రీడాకారులు ఎట్టకేలకు ముచ్చటగా మూడో రోజు 3 పతకాలు సాధించారు. ఈ నెల 28 నుంచి పోటీలు ప్రారంభం అయ్యాయి. స్విమ్మింగ్‌లో 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో సాత్విక్‌రాజ్ రజత పతకం సాధించాడు. అర్చరీలో 50 మీటర్ల కంపౌండ్ విభాగంలో హన్సికరావు రజతం, అథ్లెటిక్స్ 100 మీటర్ల రన్నింగ్‌లో శైలజ కాంస్య పతకం సాధించారు. హ్యాండ్‌బాల్ పురుషుల జట్టు వరంగల్‌తో, వాలీబాల్ పురుషుల జట్టు మెదక్‌తో, మహిళలు రంగారెడ్డి జట్టుతో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఓటమి చెందగా, ఖోఖో పురుషుల, మహిళల జట్లు పూల్ దశలోనే నిష్క్రమించాయి. కాగా రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకున్న క్రీడాకారులకు అతిథులు ట్రోఫీ, సర్టిఫికెట్లతో పాటు నగదు పారితోషికం అందించారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లో అర్హులైన జర్నలిస్టులకు నివేశన స్థలాలు కేటాయించాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో టీయూడబ్ల్యూజే- ఐజేయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 ఏళ్ల క్రితం 77 మందికి ఇండ్ల స్థలాలు ఇచ్చారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ ఇవ్వలేదన్నారు. పలుమార్లు యూనియన్ ఆధ్వర్యంలో నివేశన స్థలాల కోసం రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ దృష్టికి తీసుకెళ్తే ఆయన స్పందించి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. హామీలో భాగంగా జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మొదటి విడతలో 81 మంది, రెండో విడతలో 20 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సమ్మతించారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు తాడూరు కరుణాకర్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సలహాలు, సూచనలు కూడా పరిగణనలోకి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు యూనియన్ ఆధ్వర్యంలో కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బల్మూరి విజయసింహారావు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎలగందుల రవీందర్, జిల్లా కోశాధికారి ఎస్.సందీప్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వొద్దమల్ల విజయభాస్కర్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాహెర్‌కొండాపూర్‌లో పౌరహక్కుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఆర్‌ఐ అస్రా, ప్రజాప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం తాహెర్‌కొండాపూర్‌లో మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కులపై సమావేశం నిర్వహించారు. ప్రజలందరూ సమానమేనని, అంటరానితనం పాటిస్తే చట్టప్ర కారం తగిన చర్యలుంటాయని ఆర్‌ఐ అస్రా తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ మడికంటి మమత, పంచాయతీ కార్యదర్శి మమతతో పాటు అంబేడ్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సత్యనారాయణరెడ్డి

కరీంనగర్‌టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వర ఆలయ భూమిపూజ, స్వామివారి కల్యాణోత్సవానికి తరలిరావాలని కోరుతూ మంగళవారం మాజీ కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణరెడ్డి కరపత్రాలు పంపిణీ చేశారు. నగరంలోని వావిలాలపల్లి, మెహర్‌నగర్, వివేకానందపురి, వాసవీనగర్‌లో ఇంటింటా తిరుగుతూ ప్రజలను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట వాయిదా వేయాలి'

విద్యానగర్: మండుతున్న ఎండలు, పెరిగిన ఉష్ణోగ్రతల దృష్ట్యా జూన్ 3 నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని జూన్ 12 నుంచి నిర్వహించాలని టీపీటీఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఎండతీవ్రత వల్ల ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రజలు ఇంటి నుంచి బయటకు రావద్దని వైద్య అధికారులు, వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారని, ప్రస్తుతం నమోదవుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని బడిబాటను వాయిదా వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న రాకేశ్‌చారి

విద్యానగర్: కరీంనగర్ నియోజకవర్గంలో ఉన్న రెండు జనరల్ స్థానాలకు సంబంధించి బీసీలకే అన్ని పార్టీల వారు టికెట్లు ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. తెలంగాణ వచ్చి దశాబ్దం గడిచినా బీసీలకు ఇచ్చిన మాట గోడకు వేసిన సున్నంలా మిగిలిపోయిందన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు ఇప్పటికైనా మొదటి ప్రాధాన్యత ఇస్తూ అన్ని పార్టీలు టికెట్లు కేటాయించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, రంగు సంపత్‌గౌడ్, మాచర్ల అంజయ్యగౌడ్, కాసరాజు, దేవరకొండ సంతోషిని, దుప్పటపల్లి మురళి, బియ్యని తిరుపతి, బోయిని ప్రశాంత్, గుమ్మడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఓరుగంటి శేఖర్‌పై అక్రమ కేసులు పెట్టడం సరికాదు'



మాట్లాడుతున్న సొల్లు అజయ్ వర్మ

కరీంనగర్‌కల్చరల్: ఉద్యమ కళాకారుడు ఓరుగంటి శేఖర్‌పై అక్రమ కేసులు పెట్టడం సరికాదు బీజేపీ రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్‌వర్మ అన్నారు. మంగళవారం నగరంలో ఓ హోటల్ ఆవరణ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన ఆటపాటతో తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్న శేఖర్‌పై మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అక్రమ కేసులు పెట్టిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టిన కళాకారులకు వెన్నంటి ఉండి పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పరపల్లి శ్రీనివాస్, మునుగంటి కుమార్, మహేష్, తిరుపతి, దుబాయ్, శ్రీనివాస్, నాగ సముద్రాల, సంతోష్, కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







'చెత్త' మార్కెట్

నగరంలోని వ్యవసాయ మార్కెట్ మామిడి పండ్ల వ్యర్థాలతో చెత్త మార్కెట్‌గా తయారైంది. మామిడి పండ్ల అమ్మకాలు, కొనుగోళ్లతో ఆదాయం వస్తున్నప్పటికీ అక్కడి వ్యాపారులకు సౌకర్యాలు కల్పించకపోవడంతో వ్యర్థాలను మార్కెట్ చుట్టూ వేస్తున్నారు. కుళ్లిన దుర్వాసనతో రోగాలపాలవుతున్నారు. మార్కెట్ సిబ్బంది వ్యర్థాలను తొలగించాల్సిందిగా వ్యాపారులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

జిమ్నాస్టిక్స్.. రిథమ్స్

- కొత్త తరహా క్రీడలపై విద్యార్థుల ఆసక్తి
- టెక్నిక్స్‌పై దృష్టి పెట్టిన చిన్నారులు
- సమ్మర్ క్యాంప్‌కు స్పందన



జిమ్నాస్టిక్స్‌లో భాగంగా ఎక్సర్‌సైజ్ చేస్తున్న చిన్నారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: ప్రస్తుత కాలంలో చిన్నారులకు క్రీడలపై ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా కొత్తకొత్త తరహా క్రీడలపై మొగ్గుచూపుతున్నారు. గతంలో క్రికెట్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ లాంటి క్రీడలపై ఆసక్తి కనబర్చిన క్రీడాకారులు ప్రస్తుతం జిమ్నాస్టిక్స్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు. తమ శరీరాలను బొంగరాల వలె తిప్పే విధంగా ఒక రిథమిక్‌లా జిమ్నాస్టిక్స్ క్రీడలో అంశాలు ఉండేసరికి పలువురు నేర్చుకునేందుకు ఇష్టపడుతున్నారు. ప్రతి సంవత్సరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో భాగంగా జిమ్నాస్టిక్స్ శిక్షణ శిబిరానికి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరవుతున్నారు. వీరికి కోచ్ కాయితోజు బ్రహ్మచారి శిక్షణ ఇస్తుండగా.. శిక్షణ పొందుతున్న పలువురు చిన్నారులను 'సాక్షి' పలకరించగా వారి అభిప్రాయాలు వెల్లడించారు.

శిక్షణలో నేర్పిస్తున్న అంశాలు..

జిమ్నాస్టిక్స్ శిక్షణ శిబిరాలకు హాజరవుతున్న క్రీడాకారులకు కోచ్ అత్యున్నత ప్రమాణాలతో శిక్షణనిస్తున్నారు. ఉదయం రన్నింగ్ ఎక్సర్‌సైజ్‌లు అనంతరం స్కిల్స్‌లో ప్రాక్టీస్ చేయిస్తున్నారు. ఫార్వర్డ్, బ్యాక్‌వర్డ్, సైడ్ రోల్, డాలీ రోల్, హెడ్ స్టాండ్స్, హ్యాండ్ స్టాండ్స్, కార్ట్‌వీల్, హర్డిల్ స్టెప్స్, రౌండ్ ఆఫ్, స్టాండ్ బ్యాలెన్స్, జంప్స్, బ్యాక్ సేఫ్టీ రోల్, ఫ్రంట్ సేఫ్టీ రోల్ తదితర వాటిలో శిక్షణ ఇస్తున్నారు. చిన్నారుల సైతం ఉత్సాహంగా శిక్షణలో పాల్గొంటున్నారు.



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న కోచ్ బ్రహ్మచారి

జిమ్నాసిక్స్‌కు ఆదరణ వచ్చేలా..



జిమ్నాస్టిక్స్ క్రీడపై గ్రామగ్రామాన ఆసక్తి పెంచేలా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్న. గతంలో కేవలం కరీంనగర్ లోనే ఎంపిక పోటీలు నిర్వహించాల్సి వచ్చింది. ఈ యేడాది నుంచి వివిధ ప్రాంతాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించి జిమ్నాస్టిక్స్ క్రీడకు ఆదరణ వచ్చేలా చేస్తాం.

– డి.నిరంజనాచారి, జిమ్నాసిక్స్ సంఘం అధ్యక్షుడు

శిక్షణ బాగుంది



జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ బాగా ఇస్తున్నారు. స్కూల్‌లో గేమ్స్ పీరియడ్‌లా గంతులు వేస్తున్నాం. రోల్ అవుతున్నాం. కానీ ఇక్కడ స్టెప్ బై స్టెప్ రోల్ అవుతున్నాం. సమ్మర్ తర్వాత కూడా జిమ్నాస్టిక్స్ నేర్చుకుంటా.

– పి.శ్రీరమణ

పతకం సాధిస్తా..



గతేడాది కూడా జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ తీసుకున్న. ప్రస్తుతం రోజూ హాజరవుతున్న. ఈయేడాది సబ్ జూనియర్స్ లెవల్‌లో జరిగే కాంపిటీషన్‌లో పాల్గొనాలని ఉంది. రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు పతకాన్ని సాధించి పెడతా.

– హర్షిత రాణి

రాష్ట్రస్థాయి చాంపియన్‌గా కావాలని..



రాష్ట్రస్థాయి మీట్స్‌లలో చాంపియన్‌గా నిలవాలని ఉంది. ప్రతిరోజూ హార్డ్ ప్రాక్టీస్ చేస్తున్న. జిల్లాస్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన. రాష్ట్రస్థాయిలో చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకొని జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఉంది.

– వైష్ణవి

ఉత్సాహంగా పాల్గొంటున్నారు



ప్రతి సంవత్సరం జరిగే వేసవి శిక్షణ శిబిరాలతో పోలిస్తే ఈయేడాది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. చిన్నారులకు లర్నింగ్ బేసిక్ స్కిల్స్‌తో పాటు కాంపిటీషన్‌లో ఎలా పాల్గొనాలి తదితర వాటిపై కూడా శిక్షణ ఇస్తున్న. ముఖ్యంగా జిమ్నాస్టిక్ బ్యాలెన్స్ మీదనే డిపెండ్ అయి ఉంటుంది కాబట్టి బ్యాలెన్స్ టెక్నిక్ నేర్పిస్తున్న.

– కాయితోజు బ్రహ్మచారి, కోచ్

శిక్షణ శిబిరం పరిశీలన



చిన్నారి కిక్ లెస్ట్ పరిశీలిస్తున్న మేయర్

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో 25రోజులుగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను మేయర్ సునీల్‌రావు మంగళవారం సందర్శించారు. శిక్షణ జరుగుతున్న ప్రతి క్రీడాంశాన్ని పరిశీలించారు. ట్రైనింగ్ ఎలా జరుగుతుంది, రోజూ వస్తున్నారా? అంటూ చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. కోచింగ్ ఇస్తున్న తీరుపై కూడా కోచ్‌లను అడిగి తెలుసుకున్నారు. పలువురు చిన్నారుల సామర్థ్యాలను మేయర్ పరిశీలించారు. కోచింగ్ ముగిసేవరకు ఉండి చిన్నారులకు పాలు, గ్రుడ్లు, అరటిపండ్లు పంపిణీ చేసి వెళ్లారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ తదితరులున్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: అనారోగ్య సమస్యలు భరించలేక ఓ మహిళ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాలు..కరీంనగర్‌లోని మంకమ్మతోటలో నివాసముంటున్న చందనం సరోజ (52) కొన్ని రోజుల నుంచి థైరాయిడ్, కడుపునొప్పి, ఒళ్లు నొప్పులతో బాధపడుతుంది. పలుమార్లు వైద్యులను సంప్రదించి మందులు వాడినా ఫలితం లేకుండాపోయింది. మంగళవారం మధ్యాహ్నం ఆమె భర్త చందనం లక్ష్మీరాజం బయటకు వెళ్లిన సమయంలో తన బెడ్‌రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలత

కొత్తపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించుకుందామని ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ అన్నారు. కరీంనగర్‌లోని కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం దశాబ్ది ఉత్సవాలపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడ్డ పదేళ్లలో గ్రామాల రూపురేఖలే మారాయని, ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో వ్యవసాయరంగం గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశంలోనే గొప్ప రాష్ట్రంగా పేరు సంపాదించుకుంటుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో దశాబ్ది ఉత్సవాలను పండుగలా నిర్వహించుకునేందుకు మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీని విద్యుత్ దీపాలతో అలంకరించాలని కోరారు. ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మండల వైద్యాధికారి వంశీకృష్ణ, పశు వైద్యాధికారి రామకృష్ణ, ఐకేపీ ఏపీవో రఘుపతి, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇవ్వడం వల్లనే దశాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

విద్యానగర్(కరీంనగర్): కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వడం వల్లనే ఈరోజు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను బీఆర్‌ఎస్ హంగామా చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఇవ్వడం వల్లనే రాష్ట్రానికి అభివృద్ధి నిధులు వస్తున్నయన్న విషయం మంత్రి గంగుల కమలాకర్‌కు తెలిసిన విషయమే అయినప్పటికీ ఆయన చెప్పలేక పోతున్నరని అన్నారు. రాష్ట్రం వచ్చి దశాబ్దం అయినప్పటికీ ప్రజల ఆకాంక్షలు నెరవేక పోవడం బాధాకరమన్నారు. అకాల వర్షాలతో రైతు నష్టపోతే ఇంతవరకు నష్ట పరిహారం చెల్లించక పోగా సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎండీ తాజ్, ముక్క భాస్కర్, శ్రవణ్‌నాయక్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ అఖిల్, దన్న సింగ్, జీడీ రమేశ్,షేక్ షేహెన్ష, ఎండీ చాంద్, పొరండ్ల రమేశ్, షబానా మహమ్మద్, ఊరడి లత, నెన్నెల పద్మ, బొబ్బిలి విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పేద వైశ్య కుటుంబాలకు ఆర్థికసాయం చేయాలి



మాట్లాడుతున్న కన్న కృష్ణ

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం చేస్తున్నట్లుగానే పేద ఆర్యవైశ్య కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేయాలని ఆర్యవైశ్య మహాసభ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ నిరుపేద ఆర్యవైశ్యులను గుర్తించి వ్యాపారాలు చేసుకునేందుకు రూ.లక్ష ఆర్థిక సాయం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు తోడుపునూరి కరుణాకర్, ముత్యం శ్రీనివాస్, గుడిసె రాజేంద్రప్రసాద్, ఎల్లిమెల్ల మధు, రాచమల్ల ఆంజనేయులు, నగునూరి రాజేందర్, కైలాస నవీన్, తోడుపునూరి తిరుపతి, జీడిగే సాయికృష్ణ, బొడ్ల శ్రీరాములు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



బాలబాలికలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తపల్లి: రాష్ట్రీయ బాల స్వస్తీయ (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి మండలం నాగులమల్యాలలో మంగళవారం కరీంనగర్ టీం-ఏ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 0–18 ఏళ్ల 145 మంది బాలబాలికలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి జిల్లా ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ (డీఈఐసీ), జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందిస్తామని తెలిపారు. సర్పంచ్ నాయిని ప్రసాద్, వైద్యులు హబీబొద్దీన్, సరిత ముదావత్, పంచాయతీ కార్యదర్శి సుష్మిత, ఎస్పీంం కళ్యాణి, ఏఎన్‌ఎంలు రజిత, భాగ్య, ఫార్మాసిస్టు పావని, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సౌభాగ్య, సరళ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం అందజేత



విద్యానగర్(కరీంనగర్): ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినం పురస్కరించుకొని మంగళవారం కాంగ్రెస్ నాయకులు కరీంనగర్‌లోని మాతా శిశు కేంద్రంలో అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి వై.అంజన్‌కుమార్, నాయకులు వి.కృష్ణ, ఎండీ.ఇమ్రాన్, వాసీం, ఇయాజ్, విజయ్‌కుమార్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలి



నివాళి అర్పిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్యఅ న్నారు. కార్మిక నేత, ఇన్సూరెన్స్‌యూనియన్ నాయకుడు వేణుగోపాల్‌రావు వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం కట్టరాంపూర్‌లోని సుగుణాకర్‌రావు భవన్‌లో 'మతోన్మాదం కార్మికవర్గంపై ప్రభావం' అంశంపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, రైతు సంఘం నాయకులు వాసుదేవరెడ్డి, జిల్లా కోశాధికారి ఎ.రాజేశం, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సత్యం, సహాయ కార్యదర్శులు పున్నం రవి, ఐసీఈయూ డివిజన్ అధ్యక్షుడు రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన మెస్ చార్జీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రజనీకాంత్

విద్యానగర్(కరీంనగర్): పెంచిన మెస్ చార్జీలను వెంటనే అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ పోరాట ఫలితంగా ప్రభుత్వం మెస్ కాస్మోటింగ్ చార్జీలు పెంచిందని, పెంచిన చార్జీలను వెంటనే అమలు చేయాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని తెలిపారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్, నగర అధ్యక్షుడు తిప్పారపు రోహిత్, జిల్లా కమిటీ సభ్యులు రత్నం సురేశ్, సందేశ్, అశోక్ పాల్గొన్నారు.

'అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

కరీంనగర్: అనుమతి లేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి పూసాల విష్ణు మాట్లాడుతూ నగరంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఎలాంటి అనుమతులు లేకుండా కార్పొరేట్ బ్రాండ్ల పేరుతో బ్రాంచ్‌లు ఓపెన్ చేస్తూ అడ్మిషన్ల ముసుగులో ఇష్టానుసారంగా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. దీనిపై పలుసార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకొని, పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రేష వేణి వేణు, బామండ్ల నందు, జోనల్ ఇన్‌చార్జి శ్రీవర్ధన్, సంహిత్, ప్రమోద్, చందు తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 11కేవీ కాపువాడ ఫీడర్ పరిధిలోని కాపువాడ, బొమ్మకల్ ఎక్స్ రోడ్ నుంచి యజ్ఞవరహాస్వామి ఆలయం, అశోక్‌నగర్, మంగళివాడ, శివాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం.: 1800 425 9899

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com



నాలుగో ర్యాంక్‌కు సాత్విక్‌-చిరాగ్‌

ప్రపంచ బ్యాడ్మింటన్‌ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్‌) ర్యాంకింగ్స్‌లో భారత ద్వయం సాత్విక్‌ సాయిరాజ్‌-చిరాగ్‌ శెట్టి మరో మెట్టు ఎక్కింది. మంగళవారం ప్రకటించిన ఈ జాబితాలో వీరిద్దరు నాలుగో స్థానానికి చేరుకున్నారు. భారత జోడి కెరీర్‌లో ఇది అత్యుత్తమ ర్యాంక్‌ కావడం విశేషం. వీరిద్దరు ఇటీవలే స్విస్‌ ఓపెన్‌ సూపర్‌ 300 టైటిల్‌ను గెలుచుకున్నారు. హెచ్‌ఎస్‌ ప్రణయ్‌ మరో ర్యాంక్‌ మెరుగుపర్చుకొని ఎనిమిదో స్థానానికి చేరుకోగా...మూడు స్థానాలు మెరుగైన కిడాంబి శ్రీకాంత్‌ 20వ ర్యాంక్‌లో నిలిచాడు.



పతకాలు ‘గంగ’పాలు కాలేదు!

- మనసు మార్చుకున్న రెజ్లర్లు
- హైడ్రామా నడుమ వెనుదిరిగిన వైనం



హరిద్వార్‌: న్యాయం కోసం పోరాడుతూ వారంతా నెల రోజులకు పైగా నిరసన ప్రదర్శించారు...కానీ ఫలితం దక్కలేదు. పైగా పోలీసులు నిర్దయగా, అగౌరవంగా వారిని లాక్కెళ్లారు...ఆపై ప్రభుత్వం నుంచి కనీస స్పందన కూడా కనిపించలేదు. దాంతో భారత ఖ్యాతిని ఇనుమడింపజేసిన ఆ అగ్రశ్రేణి రెజ్లర్లు తమ కష్టానికి ప్రతిఫలమైన పతకాలను కూడా వద్దనుకున్నారు. వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని భావించి గంగా నదిలో పడేయాలని తీవ్ర నిర్ణయం తీసుకున్నారు. అయితే అదృష్టవశాత్తూ చివరకు అది జరగలేదు. సన్నిహితుల సముదాయింపుతో చివరు ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. హరిద్వార్‌లో సుదీర్ఘ సమయం పాటు ఈ హైడ్రామా చోటు చేసుకుంది. మంగళవారం వందల సంఖ్యలో వచ్చిన మద్దతుదారులతో కలిసి చేతిలో పతకాలతో వీరంతా హరిద్వార్‌ చేరుకున్నారు. ఒలింపిక్‌ పతక విజేతలు సాక్షి మలిక్‌, బజరంగ్‌ పూనియా... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన వినేశ్‌ ఫొగాట్‌, సంగీత, వీరి బంధుమిత్రులు, అభిమానులు హర్‌ కి పౌరి వద్దకు చేరుకున్నారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాల్సిందేనని నిరసన చేపట్టారు. రెజ్లర్లు పతకాలను చేతపట్టుకొని గంగపాలు చేయాలనుకున్నారు. పలువురు బీజేపీ శ్రేణులు అక్కడకు చేరుకొని పవిత్రమైన గంగానదిలో ఇలాంటి చర్యలను అనుమతించమని వాదించారు. గంటా 45 నిమిషాల పాటు ఈ హైడ్రామా నడిచింది. రెజ్లర్ల సన్నిహితులు తీవ్రమైన నిర్ణయం వద్దని వారించడంతో చివరకు వారంతా అక్కడి నుంచి వెనుదిరిగారు. తమకు న్యాయం చేయాలని, ప్రభుత్వం ఐదు రోజుల్లోగా స్పందించాలని వారు డిమాండ్‌ చేశారు.

యూడబ్ల్యూడబ్ల్యూ హెచ్చరిక

కార్సియర్‌ సుర్‌ వెవె (స్విట్జర్లాండ్‌): భారత స్టార్‌ రెజ్లర్లపై పోలీసు చర్యను ప్రపంచ రెజ్లింగ్‌ సమాఖ్య (యూడబ్ల్యూడబ్ల్యూ) తీవ్రంగా ఖండించింది. టాప్‌స్టార్లపై పోలీసు జులుంపై విచారం వ్యక్తం చేసింది. తమ సమాఖ్య కొన్ని నెలలుగా భారత్‌లోని రెజ్లర్ల నిరసన కార్యక్రమాలను నిశితంగా గమనిస్తోందని తెలిపింది. లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్‌ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలనే డిమాండ్‌తో ఒలింపిక్‌, ఆసియా క్రీడల పతక విజేతలు సాక్షి మలిక్‌, వినేశ్‌ ఫొగాట్‌, బజరంగ్‌ పూనియా తదితరులు చేస్తున్న నిరసన తమ దృష్టికి వచ్చిందని యూడబ్ల్యూడబ్ల్యూ ఈ సందర్భంగా తెలిపింది. గతంలో ప్రకటించినట్లుగా 45 రోజుల్లోగా డబ్ల్యూఎఫ్‌ఐకి ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయకపోతే నిషేధం తప్పదని ఈ సందర్భంగా ప్రపంచ సమాఖ్య హెచ్చరించింది.

‘మీ కోసం మళ్లీ ఆడతా’

- అభిమానులకు ధోని సంకేతం
- వచ్చే ఏడాదీ ఐపీఎల్‌ ఆడే అవకాశాలు!

అహ్మదాబాద్‌: మూడేళ్ల క్రితం ఐపీఎల్‌లో ఇదే ప్రశ్న...రెండేళ్ల క్రితం టైటిల్‌ గెలిచాక ఇదే ప్రశ్న... గత ఏడాది టీమ్‌ ఘోరంగా విఫలమైనప్పుడు మళ్లీ అదే ప్రశ్న...ఇప్పుడు ఐదో సారి చాంపియన్‌గా నిలిచాక పాత సందేహమే కొత్తగా..! మహేంద్ర సింగ్‌ ధోని ఐపీఎల్‌ నుంచి రిటైర్‌ అవుతున్నాడా, ఈ సారి అద్భుత ప్రదర్శనతో జట్టును విజేతగా నిలిపిన తర్వాత తప్పుకుంటున్నాడా అని అభిమానుల్లో ఉత్సుకత. చెన్నై సూపర్‌ కింగ్స్‌ 2023 చాంపియన్‌గా నిలిచిన తీరును చూస్తే ధోనికి ఇంతకంటే ఘనమైన వీడ్కోలు ఉండదనిపిస్తోంది. కానీ అతని మాట చూస్తే మళ్లీ వచ్చి ఆడతాడనిపిస్తోంది. ఫైనల్‌ ముగిసిన తర్వాత ధోని రిటైర్మెంట్‌పై ఎప్పటిలాగే తనదైన శైలిలో ఆసక్తికర సమాధానమిచ్చాడు. ‘ఇప్పుడు నేను ఉన్న పరిస్థితిని బట్టి చూస్తే రిటైర్మెంట్‌ను ప్రకటించడానికి ఇదే సరైన సమయం అనిపిస్తోంది. ఒక్క మాటలో థ్యాంక్యూ అని చెప్పి నేను తప్పుకోవచ్చు. కానీ వచ్చే 9 నెలల పాటు కష్టపడి మరో ఐపీఎల్‌ ఆడటం మాత్రం అంత సులువు కాదు. అయితే చెన్నై సూపర్‌ కింగ్స్‌ అభిమానులు నాపై కురిపిస్తున్న ప్రేమను చూస్తే మరో సీజన్‌ ఆడటం వారికి కానుక అందించినట్లవుతుంది. వాళ్ల అభిమానం, భావోద్వేగాలు చూస్తే వారి కోసం ఇదంతా చేయాలనిపిస్తోంది’ అని ధోని వ్యాఖ్యానించాడు. తాను కెరీర్‌ చివరి రోజుల్లో ఉన్నాననే విషయం వారికీ తెలుసని, అందుకే ఎక్కడకు వెళ్లినా తనకు ప్రేక్షకులనుంచి భారీ మద్దతు లభించిందని ధోని గుర్తు చేసుకున్నాడు. ‘ఇదే మైదానంలో సీజన్‌లో తొలి మ్యాచ్‌ ఆడాను. అంతా నా పేరును మైదానంలో మారుమోగించారు. చెన్నైలో మాత్రమే కాకుండా ఇలా అన్ని చోట్లా స్పందన చూస్తే నేను ఆడగలిగినంత ఆడాలనిపించింది’ అని మహి పేర్కొన్నాడు. కెప్టెన్‌గా తన ఐదు ఐపీఎల్‌ ట్రోఫీ విజయాల్లో ప్రతీది భిన్నమైందని, ఒకదాంతో మరో దానికి పోలిక లేదని, పరిస్థితులను బట్టి అన్ని మారతాయని ధోని అభిప్రాయ పడ్డాడు. ‘ప్రతీ ట్రోఫీ గెలుపు, ప్రతీ ద్వైపాక్షిక సిరీస్‌ విజయానికి వేర్వేరు సవాళ్లు ఉంటాయి. ఏదీ ఒకే తరహాలో మూసగా ఉండదు. అందుకే ఆందోళన చెందకుండా పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకుంటా. ఇలాంటి టోర్నీల్లో కీలక క్షణాలు కొన్ని ఉంటాయి. అలాంటప్పుడు ఎలా ఒత్తిడిని ఎదుర్కొంటామనేదే కీలకం. ఈ విషయంలో అందరూ భిన్నంగా ఉంటారు. రహానేలాంటి అనుభవజ్ఞులకు సమస్య రాదు కానీ కుర్రాళ్లను సరైన విధంగా నడిపించాల్సి ఉంటుంది’ అంటూ తన శైలిని వెల్లడించాడు.

స్వియాటెక్‌ ముందంజ

- మెద్వెదెవ్‌కు షాక్‌
- ఫ్రెంచ్‌ ఓపెన్‌



పారిస్‌: డిఫెండింగ్‌ చాంపియన్‌, టాప్‌సీడ్‌ ఇగా స్వియాటెక్‌ ఫ్రెంచ్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్‌ టెన్నిస్‌ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్‌ తొలిరౌండ్లో పోలండ్‌ స్టార్‌ 6-4, 6-0తో క్రిస్టినా బుక్సా (స్పెయిన్‌)పై అలవోక విజయం సాధించింది. వరుస సెట్లలో కేవలం గంటా 13 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించింది. మిగతా మ్యాచ్‌ల్లో ఆరో సీడ్‌ కొకా గాఫ్‌ (అమెరికా) 3-6, 6-1, 6-2తో రెబెక మసరొవా (స్పెయిన్‌)పై, ఏడో సీడ్‌ ఓన్స్‌ జాబెర్‌ (ట్యూనిషియా) 6-4, 6-1తో లూసియా బ్రాంజెటి (ఇటలీ)పై, నాలుగో సీడ్‌ ఎలీనా రిబాకిన (కజకిస్తాన్‌) 6-4, 6-2తో క్వాలిఫయర్‌ లిండా ఫ్రువిర్టొవా (చెక్‌ రిపబ్లిక్‌)పై గెలుపొందారు. వైల్డ్‌ కార్డ్‌ ప్లేయర్‌ డియన్‌ ప్యారీ (ఫ్రాన్స్‌) 6-2, 6-3తో 25వ సీడ్‌ అన్హెలినా కలినినా (ఉక్రెయిన్‌)కు వరుస సెట్లలో షాకిచ్చింది.

మళ్లీ తొలి రౌండ్లోనే....

రష్యన్‌ టెన్నిస్‌ స్టార్‌ డానిల్‌ మెద్వెదెవ్‌కు ‘ఫ్రెంచ్‌’ మరోసారి అచ్చిరాలేదు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్‌ రష్యన్‌ తొలిరౌండ్లోనే నిష్క్రమించాడు. యూఎస్‌ ఓపెన్‌ మాజీ చాంపియన్‌ మెద్వెదెవ్‌ క్లేకోర్టులో ఐదోసారి మొదటి రౌండ్లోనే కంగుతిన్నాడు. వరుసగా నాలుగేళ్లు అతను తొలిరౌండ్‌ అడ్డంకి దాటలేకపోయాడు. తాజాగా మెద్వెదెవ్‌ 6-7 (5/7), 7-6 (8/6), 6-2, 3-6, 4-6తో క్వాలిఫయర్‌ సెబొత్‌ వైల్డ్‌ (బ్రెజిల్‌) చేతిలో కంగుతిన్నాడు. మిగతా మ్యాచ్‌ల్లో పురుషుల నాలుగో సీడ్‌ కాస్పెర్‌ రూడ్‌ (నార్వే) 6-4, 6-3, 6-2తో క్వాలిఫయర్‌ ఎలియస్‌ వైమెర్‌ (స్వీడెన్‌)పై గెలుపొందగా... 22వ సీడ్‌ జ్వెరెవ్‌ (జర్మనీ) తొలిరౌండ్‌ అడ్డంకిని దాటేందుకు పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చింది. ఈ జర్మన్‌ ప్లేయర్‌ 7-6 (8/6), 7-6 (7/0), 6-1తో హ్యారిస్‌ (దక్షిణాఫ్రికా)పై చెమటోడ్చి నెగ్గాడు.



‘థ్యాంక్యూ’

ఆరో సారి ఐపీఎల్‌ టైటిల్‌ విజయంలో భాగమై రోహిత్‌ శర్మ (6)తో సమంగా నిలిచిన అంబటి రాయుడు తన కెరీర్‌ను ఘనంగా ముగించాడు. ఐపీఎల్‌తో పాటు అన్ని రకాల దేశవాళీ క్రికెట్‌నుంచి కూడా తప్పుకుంటున్నట్లు రాయుడు వెల్లడించాడు. అండర్‌-15 స్థాయినుంచి భారత సీనియర్‌ జట్టు వరకు దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడాన్ని గర్వంగా భావిస్తున్నట్లు అతను చెప్పాడు. 2013లో తొలిసారి టీమిండియా తరఫున ఆడిన క్షణం మర్చిపోలేనన్న రాయుడు... తనకు తండ్రి సాంబశివరావు అండగా నిలవడం వల్లే ఇదంతా సాధ్యమైందని పేర్కొన్నాడు. ‘ఇదో అద్భుతమైన ముగింపు. ఇంతకంటే గొప్పగా ఆశించలేను. గత 30 ఏళ్లుగా నేను పడిన శ్రమకు దక్కిన గుర్తింపు ఇది’ అని రాయుడు వ్యాఖ్యానించాడు.

ఐపీఎల్‌లో రాయుడు

మ్యాచ్‌లు: 204	అత్యధిక స్కోరు: 100 నాటౌట్‌
ఇన్నింగ్స్‌: 187	సెంచరీలు: 1
పరుగులు: 4348	అర్ధ సెంచరీలు: 22
సగటు: 28.23	ఫోర్లు: 359
స్ట్రయిక్‌రేట్‌: 127.54	సిక్సర్లు: 173

ధోని ప్రశంసలు

రిటైర్మెంట్‌ ప్రకటించిన రాయుడుతో తన అనుబంధాన్ని ధోని ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నాడు. ‘మైదానంలో ఉన్నప్పుడు 100 శాతం శ్రమించడం రాయుడు లక్షణం. మేమిద్దరం ఒకప్పుడు ఇండియా ‘ఎ’ తరఫున కలిసి ఆడాం. అటు పేస్‌ను, ఇటు స్పిన్‌ను సమర్థంగా ఆడగల నైపుణ్యం అతని సొంతం. అతను జట్టు కోసం ఏదైనా ప్రత్యేకంగా చేయగలడని నేను ఎప్పుడైనా నమ్మేవాడిని. నాలాగే రాయుడుకు కూడా ఎక్కువగా ఫోన్‌ వాడే అలవాటు లేదు’ అని ధోని అన్నాడు.

సినిమా



చిరంజీవి

త్వరలో భోళా మానియా


‘భోళా శంకర్‌’ ఆగస్టు 11న థియేటర్‌కి రానున్న విషయం తెలిసిందే. రిలీజ్‌ డేట్‌ దగ్గరపడే సమయానికి ప్రమోషన్స్‌ ఆరంభించాలని చిత్ర యూనిట్‌ భావిస్తోంది. ముందుగా మ్యూజికల్‌ జర్నీ ప్రారంభిస్తారు. ఆ విషయాన్ని తెలియజేసి, ‘భోళా మానియా త్వరలో ప్రారంభమవుతుంది’ అంటూ, చిత్రకథానాయకుడు చిరంజీవి రెండు చేతులను వెనక జేబులో పెట్టుకొని ఉన్న డ్యాన్స్‌ మూమెంట్‌ లుక్‌ని రిలీజ్‌ చేశారు. మెహర్‌ రమేష్‌ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా కథానాయికగా, ఆయన సోదరి పాత్రలో కీర్తీ సురేష్‌ కనిపిస్తారు. ‘‘మాసివ్‌ యాక్షన్‌ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం ‘భోళా శంకర్‌’. కొంత టాకీ పార్ట్‌, క్లైమాక్స్‌, భారీ సెట్‌ సాంగ్‌ బ్యాలెన్స్‌ ఉన్నాయి. జూన్‌ నెలాఖరుకు షూటింగ్‌ పూర్తవుతుంది. పోస్ట్‌ ప్రొడక్షన్స్‌ కూడా శరవేగంగా జరుగుతున్నాయి. మహతి స్వరసాగర్‌ ఈ చిత్రానికి మంచి పాటలు ఇచ్చారు’’ అని చిత్రయూనిట్‌ పేర్కొంది.



ఆర్పీ పట్నాయక్‌, తేజ, వెంకటేశ్‌, అభిరామ్‌, గీతిక, పి. కిరణ్‌

అవార్డులు ఇవ్వాలా? లేదా అనేది ప్రభుత్వం ఇష్టం

‘‘నేను ఎప్పుడూ అవార్డుల గురించి ఆలోచించను (నంది అవార్డులను ఉద్దేశించి).. ప్రభుత్వాలు ఇస్తే ఇవ్వొచ్చు..లేదంటే లేదు. అది వారి ఇష్టం. అయితే అవార్డులు మాకు ప్రోత్సాహం ఇస్తాయి’’ అని హీరో వెంకటేశ్‌ అన్నారు. అభిరామ్‌, గీతికా తివారీ జంటగా తేజ దర్శకత్వం వహించిన చిత్రం ‘అహింస’. పి. కిరణ్‌ నిర్మించిన ఈ సినిమా జూన్‌ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్‌ మాట్లాడుతూ– ‘‘అన్ని భావోద్వేగాలు ఉన్న యూత్‌ఫుల్‌ ఎంటర్‌టైనర్‌ చిత్రం ‘అహింస’. కొత్త నటీనటుల నుంచి పవర్‌ఫుల్‌ ఎమోషన్స్‌ రాబట్టుకున్నారు తేజ. ఆర్పీ పట్నాయక్‌ మంచి మ్యూజిక్‌ ఇచ్చారు. కిరణ్‌ ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. ఈ సినిమా ద్వారా హీరోహీరోయిన్లుగా పరిచయమవుతున్న అభిరామ్‌, గీతిక కష్టపడుతూ, నేర్చుకుంటూ ముందుకెళ్లాలి’’ అన్నారు. ‘‘అభిరామ్‌తో సినిమా చేయడానికి రామానాయుడుగారే ప్రధాన కారణం. ఆయన ఆశీర్వాదంతో ఈ చిత్రం బాగా ఆడుతుందని నమ్ముతున్నాను’’ అన్నారు తేజ. ‘‘ఈ సినిమా నాకు మంచి హిట్‌ ఇస్తుందని నమ్ముతున్నాను’’ అన్నారు అభిరామ్‌. ‘‘అహింస’లో యాక్షన్‌, వినోదం, ప్రేమ.. ఇలా అన్నీ ఉన్నాయి’’ అన్నారు పి. కిరణ్‌.



కమల్‌హాసన్‌

నాయకుడులాంటి సినిమా ఇస్తాం

మూడు దశాబ్దాల క్రితం వచ్చిన శక్తిమంతమైన చిత్రాల్లో ‘నాయగన్‌’ (నాయకుడు-1987) ఒకటి. మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్‌ హీరోగా నటించిన ఈ చిత్రం సంచలన విజయం సాధించింది. 35 ఏళ్ల తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ఇటీవల ఓ సినిమా ప్రకటించిన విషయం తెలిసిందే. మరో రెండు మూడు నెలల్లో ఈ చిత్రం షూటింగ్‌ ఆరంభం కానుంది. ఈ చిత్రం గురించి కమల్‌హాసన్‌ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ – ‘‘మణిరత్నంతో ఈ సినిమా గురించి చర్చిస్తున్నాను. ఈ ప్రాజెక్ట్‌పై ఫ్యాన్స్‌కి భారీ అంచనాలు ఉంటాయి. ఆ విషయంలో కాస్త ఒత్తిడి ఉంది. అయితే కచ్చితంగా ‘నాయగన్‌’లా ఒక శక్తిమంతమైన చిత్రాన్ని ఇస్తాం’’ అని పేర్కొన్నారు.

బడ్డీ రెడీ



అల్లు శిరీష్‌

అల్లు శిరీష్‌ నటించిన తాజా చిత్రం ‘బడ్డీ’. సామ్‌ ఆంటోన్‌ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్‌, గోకుల్‌ హీరోయిన్లు. కేఈ జ్ఞానవేల్‌ రాజా నిర్మించిన ‘బడ్డీ’ రిలీజ్‌కి రెడీ అయింది. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌ లుక్‌, టైటిల్‌ని విడుదల చేశారు. ‘‘సరికొత్త కథాంశంతో రూపొందిన ఈ చిత్రానికి హిప్‌ హాప్‌ తమిళ సంగీతం అందించగా, రూబెన్‌ ఎడిటింగ్‌ నిర్వహించారు’’ అని యూనిట్‌ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కృష్ణన్‌ వసంత్‌.



కీరవాణి

ఇరవైఏడేళ్ల తర్వాత మెజీషియన్‌తో...

‘నాటు.. నాటు...’ అంటూ దేశీ ట్యూన్‌తో దేశీయులతోనే కాదు... విదేశీయులతో కూడా స్టెప్పులేయించారు ఎంఎం కీరవాణి. ఎన్టీఆర్‌, రామ్‌చరణ్‌ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ‘ఆర్‌ఆర్‌ఆర్‌’లోని ఈ పాట ఆస్కార్‌ సాధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కీరవాణిని అందరూ పాన్‌ ఇండియా మ్యూజిక్‌ డైరెక్టర్‌ అంటున్నారు. నిజానికి ఆయన ఎప్పుడో పాన్‌ ఇండియా సంగీతదర్శకుడు. తెలుగుతో పాటు తమిళ్‌, మలయాళం, కన్నడ, హిందీ.. ఇలా పలు భాషల చిత్రాలకు సంగీతం అందించారు. కాగా 27ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆయన మలయాళ సినిమా ‘మెజీషియన్‌’ అంగీకరించారు. గతంలో మలయాళంలో ‘దేవరాగం’ (1996)కి సంగీతదర్శకుడిగా వ్యవహరించారు. ఇక ‘మెజీషియన్‌’కి కీరవాణి మూడు పాటలకు స్వరాలందిస్తారని తెలిసింది. బేబీ జాన్‌ వల్యత్‌ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.



సమంత

గూఢచారిగా...

డిటెక్టివ్స్‌ బాడీ లాంగ్వేజ్‌ ఎలా ఉంటుంది? వారి ప్రవర్తన ఎలా ఉంటుంది? అనే విషయాలను తెలుసుకుంటున్నారట సమంత. ఎందుకంటే ‘చెన్నై స్టోరీస్‌’ అనే సినిమా కోసం. ఇంగ్లిష్‌, తమిళ భాషల్లో రూపొందనున్న చిత్రం ఇది. ఇంగ్లాండ్‌ నటుడు వివేక్‌ కల్రా హీరోగా నటించనున్నారు. సమంత హీరోయిన్‌. సినిమాలో ఇంగ్లాండ్‌కి చెందిన కుర్రాడిగా వివేక్‌, తమిళ యువతి పాత్రలో సమంత కనిపిస్తారు. తన తల్లి చనిపోయాక, పూర్వీకుల సమాచారం తెలుసుకోవడానికి, దూరమైన తండ్రిని కనుక్కోవడానికి ఇండియా వస్తాడు హీరో. తండ్రి ఆచూకీ తెలుసుకోవడానికి ఓ ప్రైవేట్‌ డిటెక్టివ్‌ని నియమించుకుంటాడు. ఆ గూఢచారి పాత్రనే సమంత చేయనున్నారు. ఇంగ్లాండ్‌కి చెందిన ఆ యువకుడు, చెన్నై పొన్ను (అమ్మాయి) మధ్య ఏర్పడే ప్రేమతో ఈ చిత్రం సాగుతుంది. ‘అరేంజ్‌మెంట్స్‌ ఆఫ్‌ లవ్‌’ నవల ఆధారంగా ఫిలిప్‌ జాన్‌ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. త్వరలో ఈ చిత్రం షూటింగ్‌ ఆరంభం కానుంది.



ఊర్వశి, అజయ్‌, మధుసూదన్‌

క్రైమ్‌ థ్రిల్‌

‘‘మధుసూదన్‌గారు ‘చక్రవ్యూహం’ సినిమాని తీసిన తీరు నాకెంతో నచ్చింది. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. మా చిత్రాన్ని థియేటర్స్‌లో చూసి కొత్త దర్శకుడైన మధుసూదన్‌ని ప్రోత్సహించండి’’ అని నటుడు అజయ్‌ అన్నారు. చెట్కూరి మధుసూదన్‌ దర్శకత్వంలో అజయ్‌, ఊర్వశీ పరదేశి జంటగా నటించిన చిత్రం ‘చక్రవ్యూహం’. సావిత్రి నిర్మించిన ఈ చిత్రం జూన్‌ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చెట్కూరి మధుసూదన్‌ మాట్లాడుతూ– ‘‘మా సినిమా టీజర్‌, ట్రైలర్‌కి మంచి స్పందన వస్తోంది. సినిమాకి కూడా థియేటర్స్‌లో ఇలాంటి స్పందన ఉంటుందనే ఆశాభావంతో ఉన్నాను’’ అన్నారు. ‘‘మంచి క్రైమ్‌ థ్రిల్లర్‌గా ‘చక్రవ్యూహం’ తెరకెక్కింది’’ అని ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్న మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్‌ ప్రతినిధి శశిధర్‌ రెడ్డి అన్నారు.

నవ్వుల బ్రహ్మచారి



గుంత మల్లేశం

గుంత మల్లేశం, సిరి జంటగా నర్సింగ్‌ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘బ్రహ్మచారి’. బి. రాంభూపాల్‌ రెడ్డి నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నర్సింగ్‌, బి. రాంభూపాల్‌ రెడ్డి మాట్లాడుతూ– ‘‘దుబాయ్‌కి వెళ్లొచ్చిన ఒక అబ్బాయి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. అయితే అనుకున్న సమయానికి అమ్మాయి దొరక్క ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు? చివరికి పెళ్లి అయిందా? లేదా అనే కథాంశంతో రూపొందిన చిత్రం ‘బ్రహ్మచారి’. పక్కా తెలంగాణ కామెడీ నేపథ్యంలో ఉంటుంది. త్వరలో సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం’’ అన్నారు.

సింగరేణి పోరగాళ్ల కథ ఇది - తిరువీర్‌



‘‘సింగరేణి పోరగాళ్ల కథే ‘పరేషాన్‌’. మంచిర్యాల ఊరుని ఒక బయోపిక్‌లా తీస్తే మా సినిమా అవుతుంది. కామెడీ డ్రామాగా రూపొందిన ఈ సినిమాలో సహజమైన వినోదం ఉంటుంది’’ అని హీరో తిరువీర్‌ అన్నారు. రూపక్‌ రోనాల్డ్‌సన్‌ దర్శకత్వంలో ‘మసూద’ ఫేమ్‌ తిరువీర్‌ హీరోగా నటించిన చిత్రం ‘పరేషాన్‌’. రానా దగ్గుబాటి సమర్పణలో సిద్ధార్థ్‌ రాళ్లపల్లి నిర్మించిన ఈ సినిమా జూన్‌ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా తిరువీర్‌ మాట్లాడుతూ– ‘‘నేను ఎలాంటి సినిమాలు చేయాలనుకున్నానో అనుకోకుండా ఘాజీ, మల్లేశం, పలాస.. అలాంటివే కుదిరాయి. ‘మసూద’ తర్వాత ఒక స్వేచ్ఛ దొరకడంతో ఇప్పుడు ప్లాన్‌ చేసుకుంటున్నాను. ఎలాగైనా ‘పరేషాన్‌’ని జనాల్లోకి తీసుకెళ్దామని రానాగారు ముందుకు రావడంతో మా సినిమాకి బలం వచ్చింది. ప్రస్తుతం శివం సెల్యులాయిడ్‌ నిర్మాణంలో ఓ సినిమా, ‘బటర్‌ ఫ్లై’ ఫేం సతీష్‌గారితో ఓ సినిమా చేస్తున్నాను’’ అన్నారు.

చైనా పేరు తొలగించమనడం తగదు

- నిర్మాత శంకర్‌ నాయుడు



దీన్‌ రాజ్‌, శంకర్‌ నాయుడు

‘‘మన సైనికుల ప్రాణాలు బలి తీసుకుంటూ... మన దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి భంగం కలిగించే చర్యలకు పాల్పడుతున్న చైనా పేరును ‘భారతీయన్స్‌’ సినిమాలో తొలగించాలని సెన్సార్‌ వారు చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. ఈ విషయంపై ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధం’’ అని నిర్మాత డా. శంకర్‌ నాయుడు అన్నారు. నీరోజ్‌ పుచ్చా, సోనమ్‌ టిండప్‌, సుభా రంజన్‌ హీరోలుగా, సమైరా సందు, రాజేశ్వరి చక్రవర్తి, పెడెన్‌ నాంగ్యాల్‌ హీరోయిన్లుగా నటించిన బహు భాషా చిత్రం ‘భారతీయన్స్‌’. దీన్‌ రాజ్‌ దర్శకత్వంలో శంకర్‌ నాయుడు అడుసుమిల్లి నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్‌ కానుంది. ఈ చిత్రాన్ని మాజీ సైనికాధికారుల కోసం హైదరాబాద్‌లో ప్రదర్శించారు. ‘‘మాజీ సైనికాధికారులు ‘భారతీయన్స్‌’ చూసి, బాగుందని మెచ్చుకోవడం గర్వంగా ఉంది’’ అన్నారు దీన్‌ రాజ్‌.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
123	35
62,969	18,634

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తెలి రెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	12,997	▲	21
డోజోన్స్	32,941	▽	152
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,522	▽	105
డాక్స్	15,909	▽	44
షాంఘై	3,224	▲	3
నికాయ్	31,328	▲	95

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,402 ▲ 390
బంగారం (99.5 స్వచ్ఛత)	60,160 ▲ 388
వెండి (కిలో)	70,861 ▲ 79

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

4 రోజుల్లో 1,200 పాయింట్లు ప్లస్

ముంబై: ఆటుపోట్ల మధ్య వరుసగా నాలుగో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 123 పాయింట్ల వృద్ధితో 62,969కు చేరింది. నిఫ్టీ 35 పాయింట్లు బలపడి 18,634 వద్ద ముగిసింది. అమెరికా రుణ పరిమితి పెంపు డీల్ ఓకే కావడంతో ఇన్వెస్టర్లకు జోష్ వచ్చినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. వెరసి నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,195 పాయింట్లు జమ చేసుకోగా.. నిఫ్టీ 348 పాయింట్లు పురోగమించింది. అయితే ఇంట్రాడేలో సెన్సెక్స్ 63,036 వద్ద గరిష్టాన్ని, 62,737 వద్ద కనిష్టాన్ని తాకింది. దీంతో వరుసగా రెండో రోజు 63,000 స్థాయిని అధిగమించింది. ఇక నిఫ్టీ 18,622- 18,576 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ఎన్‌ఎస్‌ఈలో మీడియా, ఎఫ్‌ఎంసీజీ, ప్రయివేట్ బ్యాంక్స్ 0.6 శాతం చొప్పున పుంజుకోగా.. ప్రధానంగా మెటల్ ఇండెక్స్ 1 శాతం క్షీణించింది. బ్యాంక్ నిఫ్టీ ఏడాది గరిష్టానికి చేరింది.



- తాజాగా 123 పాయింట్లు అప్
- 62,969 వద్ద ముగిసిన సెన్సెక్స్
- 35 పాయింట్లు బలపడిన నిఫ్టీ

డాలరుతో మారకంలో రూపాయి 4 పైసలు నీరసించి 82.67 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-5-2023	
విశాఖ	505-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	505-00
రిటైల్ ధర (డజను)	72.00
30-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	475-00
వరంగల్	477-00
రిటైల్ ధర	5.35

తేలికపాటి పేమెంట్ సిస్టం!

ఎటువంటి విపత్తులు వచ్చినా ఆర్థిక లావాదేవీల విషయంలో అంతరాయాలు ఏర్పడకుండా ఎక్కడి నుంచి అయినా ఆపరేట్ చేయగలిగే చెల్లింపుల వ్యవస్థ లైట్ వెయిట్ అండ్ పోర్టబుల్ పేమెంట్ సిస్టంను రూపొందించడంపై ఆర్‌బీఐ కసరత్తు చేస్తోంది.

కట్టలు తెంచుకున్న కరెన్సీ!

- 2022-23లో చెలామణిలో ఉన్న కరెన్సీ విలువ, పరిమాణం అప్
- విలువలో 7.8 శాతం పెరుగుదల
- 4.4 శాతం పెరిగిన పరిమాణం
- ఆర్‌బీఐ వార్షిక నివేదిక వెల్లడి

ముంబై: చెలామణిలో ఉన్న బ్యాంకు నోట్ల విలువ అలాగే పరిమాణం రెండూ మార్చితో ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో (2021-22 ఆర్థిక సంవత్సరంతో పోల్చి) వరుసగా 7.8 శాతం, 4.4 శాతం పెరిగాయి. అయితే 2021-22లో ఈ పెరుగుదల (2020-21తో పోల్చి) వరుసగా 9.9 శాతం, 5 శాతంగా ఉన్నాయి. మొత్తంగా పరిస్థితి చూస్తే, డిజిటలైజేషన్ మార్గంలో ఎన్ని చర్యలు తీసుకున్నా వ్యవస్థలో బ్యాంకు నోట్ల విలువ, పరిమాణం పెరగడం గమనార్హం. అయితే పెరుగుదల శాతాల్లో తగ్గడమే 'చెప్పుకోవడానికి' కొంత ఊరటనిచ్చే అంశం. ఆర్‌బీఐ ఈ మేరకు విడుదల చేసిన వార్షిక నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు...

- విలువ పరంగా చూస్తే, రూ. 500, రూ. 2,000 నోట్ల వాటా 31 మార్చి 2023 నాటికి చెలామణిలో ఉన్న మొత్తం నోట్ల విలువలో 87.9 శాతం. 31 మార్చి 2022లో ఇది 87.1 శాతం.
- రూ. 500 డినామినేషన్ అత్యధికంగా 37.9% వాటాను కలిగి ఉంది. తరువాతి స్థానంలో రూ. 10 డినామినేషన్ బ్యాంక్ నోటు ఉంది. ఈ నోట్లు 2023 మార్చి 31 నాటికి చెలామణిలో ఉన్న మొత్తం బ్యాంక్ నోట్లలో రూ.10 నోట్ల పరిమాణం 19.2%గా ఉన్నాయి.



- 2023 మార్చి చివరి నాటికి రూ. 25,81,690 కోట్ల విలువ కలిగిన మొత్తం రూ. 500 డినామినేషన్ నోట్లు 5,16,338 లక్షలు. 2022 మార్చి చివరి నాటికి రూ. 500 నోట్ల సంఖ్య 4,55,468 లక్షలు. అంటే వ్యవస్థలో రూ.500 నోట్లు వార్షికంగా పెరిగాయన్నమాట.
- ప్రస్తుతం చెలామణిలో ఉన్న నోట్లలో రూ.2, రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500, రూ.2,000 డినామినేషన్‌లు ఉన్నాయి. చెలామణిలో ఉన్న నాణేలు 50 పైసలు, రూ. 1, రూ. 2, రూ. 5, రూ. 10, రూ. 20 డినామినేషన్‌లను కలిగి ఉంటాయి.
- 2022-23 మధ్యకాలంలో ఆర్‌బీఐ లైవ్-పైలెట్ ప్రాతిపదికన ఈ-రూపాయిని కూడా ప్రారంభించింది. 2023 మార్చి 31 నాటికి చెలామణిలో ఉన్న ఈ-రూపాయి-హోల్‌సేల్ అలాగే ఈ-రూపాయి-రిటైల్ విలువలు వరుసగా రూ. 10.69 కోట్లు రూ. 5.70 కోట్లుగా ఉన్నాయి.
- 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు నోట్ల ఇండెంట్, సరఫరాలు రెండూ గత సంవత్సరంతో (2021-22) పోలిస్తే 1.6 శాతం స్వల్పంగా పెరిగాయి. రూ.2000 నోట్ల ప్రింటింగ్‌కు ఇండెంట్ లేదు.

రూ.2000 నోట్ల సంగతి ఇదీ...

ఆర్‌బీఐ నివేదిక ప్రకారం రూ.2,000 నోట్ల అంశాన్ని పరిశీలిస్తే, 2023 మార్చి చివరి నాటికి రూ.3,62,220 కోట్ల విలువ చేసే 4,55,468 లక్షల నోట్లు వ్యవస్థలో ఉన్నాయి. పరిమాణం పరంగా చెలామణిలో ఉన్న రూ. 2,000 నోట్లు 2023 మార్చి చివరినాటికి చెలామణిలో ఉన్న మొత్తం కరెన్సీలో 1.3 శాతానికి తగ్గాయి. 2022 మార్చి నాటికి ఈ నోట్లు 1.6 శాతంగా ఉన్నాయి. విలువ పరంగా కూడా నోట్లు 2022 మార్చిలో మొత్తం నోట్లలో 13.8 శాతం ఉంటే, 2023 మార్చి నాటికి 10.8 శాతానికి పడిపోయింది.

తగ్గుతున్న మోసాల 'విలువ'..: 2022-23లో బ్యాంకింగ్ రంగంలో మోసాల సంఖ్య 13,530కి చేరుకుంది. అయితే విలువ మాత్రం దాదాపు సగానికి తగ్గి రూ. 30,252 కోట్లుగా ఉంది. కార్డ్, ఇంటర్‌నెట్ డిజిటల్ పేమెంట్ల లోనే మోసాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి.

ఎనిమిది లేయర్ల వాటర్ ట్యాంక్‌కు డిమాండ్

హైదరాబాద్: ఆర్పీ ప్లాస్టో విడుదల చేసిన ఎనిమిది లేయర్ల నీటి నిల్వ ట్యాంకుకు మంచి స్పందన లభిస్తోంది. నివాస, వాణిజ్య కస్టమర్ల నుంచి అనూహ్య స్పందన వస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. దేశంలో నీటి నిల్వ పరంగా కొత్త ప్రమాణాలను ఇది నెలకొల్పినట్టు పేర్కొంది.



నాణ్యమైన, మన్నికైన ఉత్పత్తులు అందించాలన్న కంపెనీ లక్ష్యంలో భాగమే ఇదని తెలిపింది.

మహిళా ఇంజనీర్లకు టాటా టెక్నాలజీస్ ప్రాధాన్యం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డిజిటల్ సేవల సంస్థ టాటా టెక్నాలజీస్ మరింత మంది మహిళలను రిక్రూట్ చేసుకోవాలని భావిస్తోంది. కార్యాలయాల్లో లింగ వైవిధ్యాన్ని పాటించే క్రమంలో 'రెయిన్‌బో' కార్యక్రమం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,000 మంది పైగా మహిళా ఇంజనీర్లను తీసుకునే యోచనలో ఉన్నట్లు సంస్థ తెలిపింది. అలాగే, నాయకత్వ బాధ్యతలను చేపట్టేలా మహిళా ఉద్యోగులను తీర్చిదిద్దే దిశగా ఆరు నెలల లీడర్‌బ్రిడ్జ్-వింగ్స్ ప్రోగ్రామ్‌ను రూపొందించినట్లు వివరించింది. ఉద్యోగినులు నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని టాటా టెక్నాలజీస్ వివరించింది. సంస్థలో సమ్మిళిత సంస్కృతిని పెంపొందించేందుకు, ఉద్యోగులు చురుగ్గా పాలుపంచుకునేందుకు మరిన్ని కొత్త ప్లాట్‌ఫామ్‌లను కూడా ఆవిష్కరిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది.



అదానీ పోర్ట్స్ లాభం ఫ్లాట్

క్యూ4లో రూ. 1,141 కోట్లు • షేరుకి రూ. 5 డివిడెండ్

న్యూఢిల్లీ: అదానీ పోర్ట్స్ అండ్ సెజ్(ఏపీసెజ్) గత ఆర్థిక సంవత్సరం (2022-23) చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 3 శాతం పుంజుకుని రూ. 1,141 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 1,112 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం మరింత అధికంగా 30 శాతం వృద్ధితో రూ. 6,179 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 4,739 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 3,497 కోట్ల నుంచి రూ. 3,994 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 5 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.

పూర్తి ఏడాదికి సైతం

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఏపీసెజ్ దాదాపు 9 శాతం అధికంగా రూ. 5,393 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2021-22లో రూ. 4,953 కోట్ల లాభం నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో అదానీ పోర్ట్స్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.5 శాతం నీరసించి రూ. 734 వద్ద ముగిసింది.



అదానీ ట్రాన్స్‌మిషన్ లాభం జూమ్

అదానీ ట్రాన్స్‌మిషన్ చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 85 శాతం దూసుకెళ్లి రూ. 440 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో కేవలం రూ. 237 కోట్లు ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం సైతం రూ. 3,165 కోట్ల నుంచి రూ. 3,495 కోట్లకు ఎగసింది. నికర లాభాల్లో ట్రాన్స్‌మిషన్ విభాగం నుంచి 11 శాతం వృద్ధితో రూ. 221 కోట్లు లభించగా.. పంపిణీ విభాగం వాటా 478 శాతం జంప్‌చేసి రూ. 218 కోట్లకు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి అదానీ ట్రాన్స్‌మిషన్ నికర లాభం రూ. 1,281 కోట్లకు స్వల్పంగా బలపడింది. 2021-22లో రూ. 1,236 కోట్ల లాభం ప్రకటించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా రూ. 11,861 కోట్ల నుంచి రూ. 13,840 కోట్లకు జంప్ చేసింది.

ఫలితాల నేపథ్యంలో అదానీ ట్రాన్స్‌మిషన్ షేరు ఎన్‌ఎస్‌ఈలో దాదాపు 3 శాతం పతనమై రూ. 810 వద్ద ముగిసింది.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ప్రకాశం జిల్లా జీజీహెచ్‌లో 64 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు చెందిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ/ప్రభుత్వ జనరల్ హాస్పిటల్.. సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 64

» **విభాగాలు:** పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, ఫోరెన్సిక్ మెడిసిన్, బయోకెమిస్ట్రీ, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజీ, న్యూరో సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, పాథాలజీ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎంబీబీఎస్/ఎండీ/డీఎన్‌బీ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** కౌన్సిలింగ్ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** rimsongole@yahoo.com
» **కౌన్సిలింగ్ వేదిక:** కాన్ఫరెన్స్ హాల్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఒంగోలు.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.05.2023.
» **కౌన్సిలింగ్ తేది:** 01.06.2023.
» **వెబ్‌సైట్:** www.prakasam.ap.gov.in

ఏపీ సమగ్ర శిక్షా సొసైటీలో 1358 టీచింగ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ(పాఠశాల విద్యాశాఖ) కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మహిళా అభ్యర్థులు అర్హులు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1358
» **పోస్టుల వివరాలు:** ప్రిన్సిపాల్-92, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)-846, సీఆర్‌టీ-374, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ)-46.

అర్హత

» **ప్రిన్సిపాల్:** కనీసం 50 శాతం మార్కులతో బీఈడీ, పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ):** బీఈడీ, బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎంబీబీఎస్/పీజీ డిప్లొమా/ఎంఏ/ఎంకామ్/ఎంఎస్సీ/ఎంబీఏ ఉత్తీర్ణులవ్వాలి.
» **సీఆర్‌టీ:**బీఈడీ,బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **పీఈటీ:** అండర్ గ్రాడ్యుయేషన్ ఫిజికల్ ఎడ్యుకేషన్/బీపీఈడీ/ఎంపీఈడీ, గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** జనరల్ అభ్యర్థులకు 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ /బీసీలకు ఐదేళ్లు, మాజీ సైనిక ఉద్యోగులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు. మొత్తం 100 మార్కులకు సెలక్షన్ ప్రక్రియ ఉంటుంది. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ, సర్వీస్ వెయిటేజీ, స్కిల్ టెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించి ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 30.05.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.06.2023.
» **వెబ్‌సైట్:** https://apkgbv.apcfss.in

ఇస్రోలో 303 సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో).. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సెంటర్, ఇస్రో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఇస్రో కేంద్రాలు/యూనిట్‌లలో సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(గ్రూప్-ఎ గెజిటెడ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 303
» **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(ఎలక్ట్రానిక్స్)-90,సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(మెకానికల్)-163, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(కంప్యూటర్ సైన్స్)-47, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(ఎలక్ట్రానిక్స్)-అటానమస్ బాడీ-పీఆర్‌ఎల్-02, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(కంప్యూటర్ సైన్స్)-అటానమస్ బాడీ-పీఆర్‌ఎల్-01.
» **విభాగాలు:**ఎలక్ట్రానిక్స్,మెకానికల్,కంప్యూటర్ సైన్స్.
» **అర్హత:** కనీసం 65 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 14.06.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **రాతపరీక్ష కేంద్రాలు:** అహ్మదాబాద్, బెంగళూరు, భోపాల్,చెన్నై, గువాహటి, హైదరాబాద్,కోల్‌కతా,లక్నో,ముంబై, న్యూఢిల్లీ, తిరువనంతపురం.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 14.06.2023.
» **వెబ్‌సైట్:** www.isro.gov.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 70 పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 70
» **పోస్టులు:** ప్రాజెక్ట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వేతనం:** ప్రాజెక్ట్ ఇంజనీర్ నెలకు రూ.45,000, టెక్నికల్ ఆఫీసర్ నెలకు రూ.25,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **ఇంటర్వ్యూ వేదిక:** సీఎల్‌డీసీ, నలందా కాంప్లెక్స్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, టీఐఎఫ్‌ఆర్ రోడ్, ఈసీఐఎల్ పోస్టు, హైదరాబాద్-500062.
» **ఇంటర్వ్యూ సమయం:** ఉ. 9 గంటల నుంచి
» **ఇంటర్వ్యూ తేది:** 31.05.2023, 01.06.2023, 05.06.2023, 06.06.2023.
» **వెబ్‌సైట్:** www.ecil.co.in

త్రివిధ దళాల్లో.. కొలువు+కోర్సు

ఇంటర్మీడియెట్‌తోనే ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో..పర్మనెంట్ కమిషన్ ర్యాంకుతో కొలువు సొంతం చేసుకోవచ్చు. త్రివిధ దళాల్లో కెరీర్‌తోపాటు బ్యాచిలర్ డిగ్రీకి మార్గం.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ,నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్ (ఎన్‌డీఏ,ఎన్‌ఏ)! యూపీఎస్సీ తాజాగా ఎన్‌డీఏ, ఎన్‌ఏ-2(2023) నోటిఫికేషన్ విడుదల చేసింది. సెప్టెంబర్ 3న పరీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో..ఎన్‌డీఏ, ఎన్‌ఏ ఎంపిక దశలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» ఎన్‌డీఏ,ఎన్‌ఏ(2)-2023 నోటిఫికేషన్ విడుదల
» 395 పోస్టులకు యూపీఎస్సీ ఎంపిక ప్రక్రియ
» ఇంటర్మీడియెట్ అర్హతగా పోటీ పడే అవకాశం
» ఎంపికైతే కొలువుతోపాటు డిగ్రీ సర్టిఫికెట్

మొత్తం 395 పోస్టులు

- ఎన్‌డీఏ, ఎన్‌ఏ(2)-2023 నోటిఫికేషన్ ద్వారా మొత్తం 395 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఇందులో నేషనల్ డిఫెన్స్ అకాడమీలో.. ఆర్మీ-208 (మహిళలకు 10 పోస్టులు), నేవీ 42(మహిళలకు 12 పోస్టులు); -ఎయిర్ ఫోర్స్ ఫ్లయింగ్ విభాగంలో 92, ఎయిర్‌ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్) 18, ఎయిర్‌ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్) 10 ఖాళీలు; అలాగే నేవల్ అకాడమీలో(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) 25 (మహిళలకు 7) పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎయిర్‌ఫోర్స్‌కు సంబంధించి మూడు విభాగాల్లోనూ ప్రతి విభాగంలో మహిళలకు రెండు పోస్టులు కేటాయించారు. నేవల్ అకాడమీ 10+2 కేడట్ ఎంట్రీ స్కీమ్‌లో ఈ ఏడాది నుంచి కొత్తగా మహిళా అభ్యర్థులకు కూడా అవకాశం కల్పిస్తున్నారు.

అర్హతలు

- ఆర్మీ వింగ్: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్, నేవీ, నేవల్ అకాడమీ:** మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులవ్వాలి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** జనవరి 2, 2005-జనవరి 1, 2008 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక ప్రక్రియ

ఎన్‌డీఏ, ఎన్‌ఏకు ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుంది. అవి..రాత పరీక్ష, ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ. తొలి దశలో యూపీఎస్సీ ఎన్‌డీఏ, ఎన్‌ఏ రాత పరీక్షను నిర్వహిస్తుంది. ఇందులో ప్రతిభ చూపిన వారికి తదుపరి దశలో ఎస్‌ఎస్‌బీ ఆధ్వర్యంలో ప్రత్యేక పరీక్షలు ఉంటాయి.



శిక్షణతోపాటు బ్యాచిలర్ డిగ్రీ

ఎన్‌డీఏ, ఎన్‌ఏ రాత పరీక్షతోపాటు ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియల్లో విజయం సాధించి.. తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో మూడేళ్లు శిక్షణనిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న విభాగాలను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ విభాగలకు సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ, పుణెలో; నేవల్ అకాడమీ అభ్యర్థులకు ఎజిమలలోని నేవల్ అకాడమీలో శిక్షణ ఉంటుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ-పుణెలో.. మొదటి రెండున్నరేళ్లు అన్ని విభాగాల అభ్యర్థులకు ఒకే విధంగా శిక్షణ ఉంటుంది. చివరి ఆరు నెలలు అభ్యర్థులు ఎంపికైన విభాగం ఆధారంగా ఫిజికల్ ట్రెనింగ్ ఇస్తారు. ఇలా మొత్తం మూడేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు వారు ఎంపిక చేసుకున్న కోర్సు ఆధారంగా జేఎన్‌యూ-ఢిల్లీ నుంచి బీఏ, బీఎస్సీ, బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్) డిగ్రీలను అందిస్తారు.

- ఎయిర్‌ఫోర్స్, నేవల్ విభాగాలను ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న వారికి బీటెక్ చదివేందుకు కూడా అవకాశం ఉంటుంది. వీరు ఈ విషయాన్ని ముందుగానే తెలియజేయాలి.

క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ శిక్షణ

నేవల్ అకాడమీ 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు ఎంపికైన వారికి శిక్షణ భిన్నంగా ఉంటుంది. వీరికి ఎజిమలలోని నేవల్ అకాడమీలో నాలుగేళ్లపాటు ప్రత్యేకంగా శిక్షణనిస్తారు. ఆ తర్వాత అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్ సర్టిఫికెట్ అందిస్తారు.

ఫిజికల్ ట్రైనింగ్

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నిర్దిష్ట వ్యవధిలో మళ్లీ ఫిజికల్ ట్రెనింగ్ ఇస్తారు. ఆర్మీ క్యాడెట్లకు ఐఎంఏ (డెహ్రాడూన్), నేవీ క్యాడెట్స్‌కు నేవల్ అకాడమీ (ఎజిమల), ఎయిర్‌ఫోర్స్ క్యాడెట్లకు ఎయిర్ ఫోర్స్ అకాడమీ (హైదరాబాద్)లలో ఫీల్డ్ ట్రైనింగ్ ఉంటుంది.

స్టయిఫండ్ రూ.56,100

ఎన్‌డీఏ,ఎన్‌ఏ విజేతలకు శిక్షణ సమయంలో పే లెవల్-10కు సమానమైన రూ.56,100 స్టైపెండ్‌గా అందిస్తారు. ఫీల్డ్ ట్రెనింగ్ కూడా విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి రూ.56,100-1,77,500 వేతన శ్రేణితో కెరీర్ ప్రారంభం అవుతుంది. ప్రారంభంలో ఆర్మీ విభాగంలో లెఫ్టినెంట్,నేవీ విభాగంలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్‌ఫోర్స్ విభాగంలో ఫ్లయింగ్ ఆఫీసర్ కేడర్‌తో కెరీర్ ప్రారంభమవుతుంది.

రాత పరీక్ష ఇలా

- ఎన్‌డీఏ, ఎన్‌ఏ ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను రెండు పేపర్లలో నిర్వహిస్తారు. పేపర్-1లో మ్యాథమెటిక్స్ 300 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.
- పేపర్-2లో జనరల్ ఎబిలిటీ టెస్ట్ 600 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ఇలా మొత్తం 900 మార్కులకు రాత పరీక్ష జరుగుతుంది.
- పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది.
- పేపర్-2గా నిర్వహించే జనరల్ ఎబిలిటీ టెస్ట్‌లో పార్ట్-ఎ పేరుతో 200 మార్కులకు ప్రత్యేకంగా ఇంగ్లిష్ విభాగం ప్రశ్నలు ఉంటాయి. పార్ట్-బి జనరల్ నాలెడ్జ్ విభాగం 400 మార్కులకు ఉంటుంది.

ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

- రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు తదుపరి దశలో 900 మార్కులకు ఎస్‌ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- ఎయిర్‌ఫోర్స్ విభాగాన్ని ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులు ఎస్‌ఎస్‌బీ తర్వాత నిర్వహించే కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్‌లో కూడా విజయం సాధించాల్సి ఉంటుంది.
- ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల మానసిక, శారీరక ద్రుఢత్వాన్ని పరిశీలిస్తారు. ఇంటెలిజెన్స్ టెస్ట్, వెర్బల్ టెస్ట్, నాన్ వెర్బల్ టెస్ట్, సామాజిక అంశాలపై ఉన్న అవగాహన, తార్కిక విశ్లేషణ సామర్థ్యాలను పరీక్షిస్తారు. అదే విధంగా పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇలా మొత్తం అయిదు రోజుల పాటు ఈ ప్రక్రియ సాగుతుంది. ఇందులోనూ విజేతలుగా నిలిచిన వారికి నేషనల్ డిఫెన్స్ అకాడమీ-పుణె, నేవల్ అకాడమీ(ఎజిమల)లో శిక్షణ ఇస్తారు.

పటిష్ట ప్రణాళికతోనే సక్సెస్

- **పేపర్-1:** ఆల్జీబ్రా, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్,అనలిటికల్ జామెట్రీ,ఇంటిగ్రల్ కాలిక్యులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ ఆల్జీబ్రా, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, ట్రిగ్నోమెట్రీ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ప్రాక్టీస్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా మేలు చేస్తుంది.
- **పేపర్-2:** బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి..ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, చరిత్ర-భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఫిజిక్స్‌లో ఎలక్ట్రోమాగ్నటిజం, మెకానిక్స్, డైనమిక్స్‌లోని అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కెమిస్ట్రీలో కెమికల్ అనాలసిస్, ఇనార్గానిక్ కాంపౌండ్స్, పిరియాడిక్ టేబుల్స్, కాన్సెప్ట్ ఆఫ్ ఫిజికల్ కెమిస్ట్రీ, ఈక్విలిబ్రియమ్, థర్మోడైనమిక్స్, క్వాంటమ్ మెకానిక్స్‌పై ప్రధానంగా దృష్టి సారించాలి. జనరల్ సైన్స్‌లో వ్యాధులు-కారకాలు, ప్లాంట్ అనాటమీ, మార్ఫాలజీ, యానిమల్ కింగ్ డమ్‌లపై అవగాహన ఏర్పరచుకోవాలి. కరెంట్ అఫైర్స్ కోసం పరీక్ష జరిగే తేదీకి ముందు ఆరు నెలల వ్యవధిలో జరిగిన సమకాలీన మార్పులపై దృష్టి సారించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూన్ 6, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** జూన్ 7- జూన్ 13, 2023
- **ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 3, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** upsconline.nic.in
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in

క్లుప్తంగా...

జూన్ 3న పాస్‌పోర్ట్ ప్రత్యేక డ్రైవ్

- మూడో ప్రత్యేక డ్రైవ్‌లో 700 అపాయింట్‌మెంట్లు
- రీజనల్ పాస్‌పోర్టు అధికారి బాలయ్య

రాంగోపాల్‌పేట: ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా జూన్ 3వ తేదీన తెలంగాణలోని 14 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు (పీవోపీఎస్కే) పనిచేస్తాయని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాస్‌పోర్టుల జారీకి ప్రారంభమైన మూడో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా 700 మంది దరఖాస్తుదారుల కోసం 700 అపాయింట్‌మెంట్లు విడుదల చేస్తామని వివరించారు. వీటికి సంబంధించిన అపాయింట్‌మెంట్లను మే 31వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు విడుదల చేస్తామని వివరించారు. ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలోని 5 పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో (పీఎస్కే) రోజూ 200 అదనపు అపాయింట్‌మెంట్ల చొప్పున మొత్తం 1000 విడుదల చేస్తున్నామని, ఇవి జూన్ 2వ తేదీ సాయంత్రం 4.30 గంటల నుంచి అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ అపాయింట్‌మెంట్లను అధికారిక పాస్‌పోర్టు వెబ్‌సైట్, ఎంపాస్‌పోర్టు సేవా యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చని సూచించారు. పాస్‌పోర్టు దరఖాస్తుల రద్దీని తగ్గించడం కోసం సిబ్బందితో సెలవుల్లో కూడా పనిచేయిస్తున్నామని రీజనల్ పాస్‌పోర్టు అధికారి బాలయ్య వెల్లడించారు.

సివిల్స్ టాపర్లకు కేంద్రమంత్రి సత్కారం

తెలంగాణ నుంచి మూడో ర్యాంకర్ ఉమాహారతి హాజరు

సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవలి యూపీఎస్సీ తుది ఫలితాల్లో తొలి 20స్థానాల్లో నిలిచిన టాపర్లను కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఘనంగా సత్కరించారు. నార్త్‌బ్లాక్‌లోని కార్యాలయంలో మంగళవారం జరిగిన సత్కార కార్యక్రమంలో జితేంద్రసింగ్ టాపర్లతో మాట్లాడారు. టాప్ 20 అభ్యర్థుల్లో 12 మంది మహిళలు, 8 మంది పురుషులు ఉండగా తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఇషితా కిశోర్, గరిమా లోహియా, తెలంగాణకు చెందిన ఉమాహారతిలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

మెడిసిటీ వైద్య కళాశాలకు షాక్

- ఎంబీబీఎస్ ప్రవేశాలు రద్దు
- జాతీయ మెడికల్ కమిషన్ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: మెడిసిటీ వైద్య కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్ (ఎంబీబీఎస్) కోర్సుల్లో ప్రవేశాలను జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంగళవారం రద్దు చేసింది. మేడ్చల్ జిల్లా ఘన్‌పూర్‌లో మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల ఉంది. వాటిలో 2023–24 వైద్య విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశాలను రద్దు చేసినట్లు ఎన్ఎంసీ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇది కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉంది. ప్రవేశాల రద్దుకు కారణాలను మాత్రం ఎన్ఎంసీ పేర్కొనలేదు. ఈ విషయమై తమకు కూడా ఇంకా సమాచారం రాలేదని, కారణాలు తెలియవని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు స్పష్టం చేశాయి. దీంతో ఈ ఏడాది నీట్ రాసిన విద్యార్థులు ఈ కళాశాలలో చేరడానికి వీలుండదు.

విద్యుత్ లైసెన్స్ బోర్డు కార్యదర్శిగా కాంతారావు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ లైసెన్స్ బోర్డు కార్యదర్శిగా కె.కాంతారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మాజీ కార్యదర్శి మధు నుంచి బాధ్యతలు స్వీకరించారు. గత రెండేళ్లుగా నిజామాబాద్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన పని చేశారు. కార్యదర్శిగా కాంతారావు నియమితులైన సందర్భంగా..విద్యుత్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్కయాదగిరి, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జేఏసీ చైర్మన్ పి.భాస్కర్, బి గ్రేడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నేమాల బెనర్జీ, సీనియర్ కాంట్రాక్టర్లు ఎస్.రాజు, నర్సిరెడ్డి, వాసు, మహేష్, బి.శేఖర్, రామ్‌రెడ్డి తదితరులు మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించారు.

గోపాలమిత్రల క్రమబద్ధీకరణకు వినతి



పంజగుట్ట (హైదరాబాద్): ఇరవై మూడేళ్లుగా సేవలందిస్తున్న గోపాలమిత్రలను పశుసంవర్ధక శాఖలో శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్ర యూనియన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. యూనియన్ అధ్యక్షుడు మారబోయిన రవీందర్ ముదిరాజ్, ప్రధానకార్యదర్శి గొల్ల యాదయ్య యాదవ్‌లు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1530 మంది గోపాలమిత్రలు పశుసంవర్ధక శాఖలోని పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. తమ వయసు పైబడుతున్న నేపథ్యంలో గోపాలమిత్రలను పశుసంవర్ధక శాఖలో శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

టెక్ బుడగ పేలుతోందా?

"రెండో డిజిటల్ విప్లవానికి నాంది పడింది. ప్రతి కంపెనీ, ప్రతి పరిశ్రమ ఆన్‌లైన్ సేవల వైపు మొగ్గుతోంది. ఇది మా కంపెనీకి లాభాలను ఒనగూర్చుతోంది"
– ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ ఆంక్షల వేళ మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల వ్యాఖ్య

"కోవిడ్ తర్వాత పరిస్థితులను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుకోవడం కోసం 10 వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకాల్సి వస్తోంది"
కోవిడ్ వ్యాప్తి తగ్గిన ప్రస్తుత తరుణంలో సత్య నాదెళ్ల చేసిన తాజా ప్రకటన

దొడ్డ శ్రీనివాసరెడ్డి

ఒక్క మైక్రోసాఫ్ట్ మాత్రమే కాదు... అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్ వంటి అనేక దిగ్గజ ఐటీ కంపెనీల తాజా పరిస్థితి సైతం ఇదే. వరుసగా ఉద్యోగాల్లో కోతలు పెడుతున్నాయి. ఒక్కసారిగా వేలాది మందిని తొలగిస్తున్నాయి. కోవిడ్ కాలంలో శరవేగంగా విస్తరించిన ఐటీ, ఆన్‌లైన్ సేవలతో లాభాలు పిండుకున్న టెక్ కంపెనీల అభివృద్ధి బుడగ ఇప్పుడు పేలడానికి సిద్ధంగా ఉందా? బేజారెత్తిన టెక్ కంపెనీల పరిస్థితికి కారణం ఏమిటి? భవిష్యత్తులో వాటి పునరుద్ధరణ జరిగే అవకాశం ఉందా?

- కోవిడ్ వేళ ఐటీ సేవలు పెరగడంతో దిగ్గజ కంపెనీల లాభాలబాట
- భవిష్యత్తును అంచనా వేసుకోకుండానే లక్షలాది మందికి ఉద్యోగాలు
- మహమ్మారి వ్యాప్తి తగ్గుముఖం పట్టాక తలకిందులైన పరిస్థితులు
- నష్టాలు తగ్గించుకొనేందుకు గతేడాది నుంచి ఉద్యోగాల్లో భారీ కోతలు
- కృత్రిమ మేధ, ఆటోమేషన్ రాకతో ఐటీ వ్యాపారంలో మరింత తిరోగమనం
- వాటికితోడు దెబ్బకొట్టిన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఆర్థిక మాంద్యం, వడ్డీరేట్ల పెరుగుదల



ఉద్వాసనల పర్వం..

కోవిడ్ కాలంలో అనుకోకుండా వచ్చి పడిన అవకాశంతో అభివృద్ధి పుంతలు తొక్కిన టెక్ సంస్థలు శరవేగంగా విస్తరణపర్వం మొదలుపెట్టాయి. ప్రపంచం నలుమూలలకు విస్తరించే క్రమంలో లక్షలాది మందికి ఉద్యోగాలు ఇచ్చాయి. అమెజాన్ ఒక్కటే 2022 సెప్టెంబర్ నాటికి ఏడాది మొత్తం 5 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చింది. ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాతోపాటు మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి ఐటీ దిగ్గజాలు కూడా లక్షలాది ఉద్యోగాలు కల్పించాయి. గతేడాది చివరికి వచ్చే సరికి పరిస్థితులు మారడం మొదలైంది. లాభాల్లో కోత పడతుండటంతో కంపెనీలు ఉద్యోగులను తొలగించడం మొదలుపెట్టాయి. ఒక్క 2022లోనే టెక్ కంపెనీలన్నీ కలిపి 1,64,411 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్లు లేఆఫ్స్ ఎఫ్‌వైఐ అనే సంస్థ సేకరించిన సమాచారంలో వెల్లడైంది. ఈ సంస్థ లెక్క ప్రకారం ఈ ఏడాది ఇప్పటికే 658 టెక్ కంపెనీలు 1,91,416 మంది ఉద్యోగులను తొలగించాయి. కేవలం టెక్ స్టార్టప్ కంపెనీలకు మాత్రమే నిధులు సమకూర్చే సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌వీబీ) ఈ ఏడాది మార్చిలో కుప్పకూలడం ఐటీ కంపెనీలకు మరో శరాఘాతంగా పరిణమించింది. నిధుల కొరతతో అనేక కంపెనీలు మూతపడటమో, ఉద్యోగాలను తొలగించడమో చేశాయి. గతేడాది నవంబర్‌లో 11,000 ఉద్యోగాల కోతపెట్టిన మెటా... మళ్లీ ఈ ఏడాది మార్చిలో మరో 10 వేల మందిని తొలగించింది. అమెజాన్ 2022 నవంబర్‌లో 10,000 మంది, 2023 జనవరిలో 8 వేల మంది, మార్చిలో 9 వేల మంది ఉద్యోగులను తొలగించింది. యాక్సెంచర్ ఈ ఏడాదిలో ఇప్పటికే తన ఉద్యోగుల్లో 2.5 శాతం అంటే దాదాపు 19 వేల మందిని తొలగించింది. ట్విట్టర్‌ను కైవశం చేసుకున్న తర్వాత ఆ సంస్థలోని 80 శాతం మంది ఉద్యోగులను తొలగించామని ఎలాన్ మస్క్ బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అంటే దాదాపు 6 వేల మంది ఉద్యోగులను తొలగించారు. కాగ్నిజెంట్ ఈ నెల 4న 3,500 మందిని తొలగించింది. మైక్రోసాఫ్ట్ గత ఐదేళ్లతో పోలిస్తే ఈ ఏడాది మొదటి క్వార్టర్‌లో అత్యల్ప ఆదాయం ఆర్జించింది. అమ్మకాలు 14 శాతం పడిపోయినట్లు సత్య నాదెళ్ల వెల్లడించారు.

ఏమిటీ డాట్‌కామ్ బుడగ?

గత శతాబ్దం చివర్లో ఇంటర్నెట్ వినియోగంలోకి వచ్చిన తరుణంలో దాని ఆధారంగా పుట్టుకొచ్చిన కంపెనీలు ఊహించని రీతిలో వృద్ధి చెందాయి. పేరు చివర డాట్‌కామ్ ఉన్న ప్రతి కంపెనీ విలువ వేలం వెర్రిగా పెరిగిపోయింది. 1995 నుంచి 2000 వరకు ఆన్‌లైన్ సేవల పేరిట వెలిసిన కంపెనీలన్నీ ఇబ్బడిముబ్బడిగా పెరిగి శతాబ్దం చివరికి వచ్చే సరికి గాలిబుడగలా పేలిపోయాయి. ముందున్న కాలమంతా డాట్‌కామ్ కంపెనీలదే అని నిమ్మిన వ్యక్తులు, సంస్థలు ఆయా కంపెనీల్లో భారీగా పెట్టుబడులు పెట్టాయి. ఉదాహరణకు 1994లో ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఏర్పడిన నెట్‌స్కేప్ అనే సంస్థ 1995లో అంటే కేవలం ఏడాది తరువాత పబ్లిక్ ఫండింగ్‌కు వెళ్తే ఒక్క రోజులోనే దాని మార్కెట్ క్యాప్ 278 కోట్ల డాలర్లకు చేరుకుంది. జనరల్ మోటార్స్‌కు ఈ విలువ సాధించడానికి 40 ఏళ్లు పట్టింది. 2001 వచ్చే సరికి ఈ డాట్‌కామ్ కంపెనీల విలువ కేవలం ఊహాజనితమని అర్థమై అందరూ పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో ఈ కంపెనీలన్నీ కుప్పకూలిపోయాయి. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ 'నాస్‌దాక్'లో 1995 నుంచి 2000 వరకు క్రమేపీ స్టాక్ మార్కెట్ ఇండెక్స్ 800 శాతం పెరిగితే 2002 వచ్చే సరికి పెరిగిన మొత్తంలో 790 శాతం పడిపోయి దాదాపు మొదటికి వచ్చింది. దాంతో డాట్‌కామ్ బుడగ పేలిపోయింది.

ఎందుకీ పరిస్థితి

టెక్ కంపెనీల తిరోగమనానికి ఒక్కసారిగా వచ్చిపడ్డ అనేక పరిణామాలు కారణం. కృత్రిమ మేధ, ఆటోమేషన్ ఒక కారణమైతే రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఆర్థిక మాంద్యం, డాలర్ విలువ పెరగడం, అధిక వడ్డీలు, స్థాయికి మించిన ఉద్యోగుల సంఖ్య వంటి కారణాలు టెక్ ప్రపంచాన్ని ఇప్పుడు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో మొదలైన ఆర్థిక మాంద్యం ఛాయలు క్రమేణా విస్తరిస్తూ ద్రవ్యోల్బణానికి ఆపై అధిక వడ్డీలకు దారితీశాయి. ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్న తరుణంలోనే కృత్రిమ మేధ, ఆటోమేషన్ ఉప్పెనలా వచ్చిపడి టెక్నాలజీ సంస్థల అభివృద్ధికి గండికొడుతున్నాయి. ఏఐ అత్యంత నాణ్యమైన, నమ్మకమైన ప్రత్యామ్నాయాలను సృష్టిస్తూ శరవేగంగా అన్ని రంగాలను కమ్ముకుంటోంది. ఇంతవరకు మానవ సంపదపై ఆధారపడి పనిచేస్తున్న టెక్ కంపెనీల ఉత్పాదనలను కృత్రిమ మేధ క్షణాల్లో అతిచౌకగా రూపొందిస్తుడటంతో ఆయా కంపెనీల ఆదాయంపై దెబ్బపడుతోంది. దాంతో గత్యంతరం లేక కంపెనీలు ఉద్యోగులను భారీగా తగ్గించుకొని ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాయి. టెక్ ప్రపంచాన్ని వేధిస్తున్న మరో కారణం ద్రవ్యోల్బణం. ప్రస్తుత ధరల స్థాయి గత 40 ఏళ్లలోనే అత్యధికం. పెరుగుతున్న వస్తువులు, సేవల ధరలతో వినియోగదారులు టెక్ కంపెనీల ఉత్పాదనలు, సేవలను భరించలేని స్థాయికి చేరుకుంటున్నారు. ధరలను అదుపు చేయడానికి ప్రభుత్వాలు వడ్డీ రేట్లను పెంచుతుండటం టెక్ కంపెనీలకు దెబ్బమీద దెబ్బగా పరిణమిస్తోంది. అమ్మకాలు తగ్గి ఆదాయం పడిపోతుండటం కంపెనీలు నడపడానికి రుణాలు తీసుకోలేక ఉద్యోగుల ఉద్వాసనకు ఉపక్రమించాయి. కరోనా వేళ మార్కెట్‌ను సరిగ్గా అర్థం చేసుకోలేక, తమ అభివృద్ధి శాశ్వతమని భావించి అడ్డగోలుగా ఉద్యోగులను తీసుకున్నామని మెటా అధిపతి జుకర్‌బర్గ్, సేల్స్‌ఫోర్స్ అధినేత మార్క్ బెన్యాఫ్ ఒప్పుకున్నారు. టెక్ దిగ్గజాలకు భిన్నంగా యాపిల్ కంపెనీ మాత్రం ఉద్యోగ నియామకాల్లో సంయమనం పాటించింది. కోవిడ్ కాలంలో ఉద్యోగుల సంఖ్యను కేవలం 20 శాతమే పెంచుకుంది. దాంతో ఇంతవరకు ఉద్యోగులను తొలగించని టెక్ దిగ్గజం యాపిల్ ఒక్కటే. టెక్ ప్రపంచంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలు పాతికేళ్ల నాటి డాట్‌కామ్ బుడగను గుర్తుచేస్తోందని నిపుణులు అంటున్నారు.

పోలీస్ తుది ఫలితాల విడుదల

అర్హత సాధించిన అభ్యర్థులు 84.06 శాతం

- నేటినుంచి వెబ్‌సైట్‌లో ఓఎంఆర్ షీట్లు
- రీవెరిఫికేషన్‌కు జూన్ 3 వరకు అవకాశం
- టీఎస్ఎల్‌పీఆర్బీ చైర్మన్ శ్రీనివాసరావు ప్రకటన



సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా వివిధ విభాగాల్లోని ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు నిర్వహించిన తుది రాత పరీక్షల ఫలితాలను టీఎస్ఎల్‌పీఆర్బీ ప్రకటించింది. అన్ని పోస్టులకు కలిపి తుది రాత పరీక్షకు హాజరైన వారిలో 84.06 శాతం మంది అర్హత సాధించారు. అభ్యర్థులు తమ ఓఎంఆర్ షీట్లను బుధవారం నుంచి వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఈ మేరకు బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు www.tslprb.in వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ ద్వారా తమ ఓఎంఆర్ షీట్లతోపాటు ఫైనల్ కీలు సైతం చూసుకోవచ్చని ఆయన తెలిపారు. ఏవైనా ఇబ్బందులుంటే 9393711110, 9391005006 నంబర్లలో లేదా support@tslprb.in ఈ మెయిల్ ఐడీలో సంప్రదించాలని సూచించారు.

3 వరకు రీవెరిఫికేషన్ గడువు

తుది ఓఎంఆర్ షీట్లలో ఏవైనా అనుమానాలున్నా, మార్కుల లెక్కింపులో అనుమానాలున్నా అభ్యర్థులు రీకౌంటింగ్, లేదా రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 1 నుంచి 3వ తేదీ రాత్రి 8 గంటల వరకు అవకాశం ఉంటుంది.

ఎడిటింగ్‌కు అవకాశం

తుది రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల్లో ఎవరైన వివరాల నమోదులో పొరపాట్లు చేసి ఉంటే, వారికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వనున్నట్టు శ్రీనివాసరావు చెప్పారు. ఇప్పటికే బోర్డును అభ్యర్థించిన వారికి కులం, వయసు, లోకల్ క్యాండిడేచర్, ఎక్స్-సర్వీస్‌మెన్ స్టేటస్, అకడమిక్ విద్యార్హతల్లో తప్పులను సరిచేసుకునేందుకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో అవకాశం కల్పిస్తామన్నారు.

వివిధ విభాగాల్లో పోస్టుల వారీగా తుది రాత పరీక్ష ఫలితాలు

పోస్టు	హాజరైనవారు	అర్హులు	అర్హుల శాతం
సివిల్ పీసీ, ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్ కానిస్టేబుల్	1,08,055	98,218	90.90
సివిల్ ఎస్సై	57,848	43,708	75.56
కమ్యూనికేషన్ కానిస్టేబుల్	6,098	4,564	74.84
కమ్యూనికేషన్ ఎస్సై	3,115	729	23.40
పీసీ డ్రైవర్	1,987	1,779	89.53
ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై	1,487	1,153	77.54
పీటీఓ ఎస్సై	579	463	79.97
పీసీ మెకానిక్	290	238	82.07
మొత్తం	1,79,459	1,50,852	84.06

రెండు వారాల్లో ఎస్సై ఎంపిక జాబితా

సాక్షి, హైదరాబాద్: పోలీస్ ఉద్యోగాల భర్తీలో భాగంగా ఎస్సై ఉద్యోగాలు పొందే అభ్యర్థుల ఎంపిక జాబితా (సెలెక్షన్ లిస్ట్)ను అతి త్వరలోనే వెల్లడించనున్నట్టు సమాచారం. నియామక ప్రక్రియ తుది అంకానికి చేరుకోవడంతో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పోలీస్ నియామక మండలి అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఎస్సై, తత్సమాన పోస్టులకు నిర్వహించిన తుది రాత పరీక్షలో అర్హుల జాబితా విడుదల చేసినందున, తదుపరి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండనుంది. గత రిక్రూట్‌మెంట్‌లో 18 ప్రాంతాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించగా, ఈసారి ఈ సంఖ్య పెంచే అవకాశం ఉంది. ఈ మొత్తం ప్రక్రియను ముగించేందుకు పది రోజులు పట్టే అవకాశం ఉంది. మొత్తంగా ఎస్సై తుది ఫలితాలు జూన్ రెండో వారం చివరి వరకు వెల్లడయ్యే అవకాశాలున్నాయి. ఎస్సై పోస్టుల భర్తీ తర్వాతే, కానిస్టేబుల్ ఫలితాలు వెల్లడించేలా బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఏఎన్ఎంలకు డిజిటల్ బీపీ మెషీన్లు

37 వేల మంది ఆశ కార్యకర్తలకు చీరలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏఎన్ఎంలకు డిజిటల్ బీపీ మెషీన్లు ఇవ్వాలని నిర్ణయించింది. తద్వారా గ్రామాల్లో ఉన్న ప్రజల అవసరాన్ని బట్టి ఇంటింటికీ వెళ్లి బీపీ తనిఖీ చేయడానికి వీలు కలగనుంది. ఇప్పటివరకు బీపీ మెషీన్లు కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ఉన్నాయి. తాజా నిర్ణయంతో బీపీ తనిఖీ చేసుకోవడం గ్రామీణులకు సులువు కానుంది. ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఈ ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల మందికి పైగా ఉన్న ఏఎన్ఎంలకు వీటిని అందుబాటులో ఉంచుతారు.

రాష్ట్రవ్యాప్తంగా న్యూట్రిషన్ కిట్లు

దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రంలో ఉన్న 37 వేల మంది ఆశ కార్యకర్తలకు చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. అలాగే కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తం చేస్తున్నారు. దీంతో 2023–24లో రాష్ట్ర వ్యాప్తంగా 6.84 లక్షల గర్భిణిలు లబ్ధి పొందుతారు. 14–26 వారాల సమయంలో, 27–34 వారాల సమయంలో మొత్తం రెండు సార్లు కిట్లు పంపిణీ చేస్తారు.

డైరెక్ట్ సెల్లింగ్ పేరిట రూ.1000 కోట్ల దందా!

దేశవ్యాప్తంగా వందల మందిని ముంచిన ఈ-స్టోర్ ఇండియా

- ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన సీసీఎస్ అధికారులు



స్కాం వివరాలు వెల్లడిస్తున్న సీపీ ఆనంద్

సాక్షి, హైదరాబాద్: డైరెక్ట్ సెల్లింగ్ పేరుతో ప్రారంభమైన ఈ-స్టోర్ ఇండియా సంస్థ దేశవ్యాప్తంగా రూ. 1,000 కోట్ల దందా సాగించినట్లు హైదరాబాద్ పోలీసులు గుర్తించారు. ప్రధానంగా రెండు రకాలైన స్కీములతో అమాయకులను ఆకర్షించి భారీ స్కామ్‌కు పాల్పడినట్లు తేల్చారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు నగర కొత్వాల్ సీవీ ఆనంద్ తెలిపారు. డీసీపీ డాక్టర్ పి.శబరీష్, ఏసీపీ ఎన్.అశోక్ కుమార్‌లతో కలసి మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు. యాక్సస్ ఈ-కార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్ ఆయుర్‌కేర్ హెల్త్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ-స్టోర్ ఇండియాను నిర్వహిస్తోంది. దీనికి హిమాయత్‌నగర్, మలక్‌పేట ప్రాంతాలకు చెందిన మనీష్ కత్రి, సయ్యద్ అజ్మల్ సజ్జద్ మార్కెటింగ్ ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద నమోదు చేసుకున్న యాక్సస్ ఈ కార్ప్ సంస్థ తమ స్కీమ్‌లకు ప్రభుత్వ అనుమతి ఉందని నమ్మబలుకుతూ నిరుద్యోగులకు ఎర వేస్తోంది.

ఈ రెండు స్కీముల పేరుతో...

ఇండివిడ్యువల్ డిస్ట్రిబ్యూషన్ స్కీమ్ కింద అనేక మందిని ఈ-స్టోర్ ఇండియా సభ్యులుగా చేర్చుకుంది. ఎవరైనా రూ. 8,991 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే వారికి సంస్థ రూ. 9 వేల విలువైన ఆయుర్వేద ఉత్పత్తులు, కంపెనీ పేరుతో ఉన్న బోర్డు అందిస్తుంది. బోర్డును తమ ఇల్లు, దుకాణం ముందు తగిలించి ఆ ఫొటోను సంస్థకు పంపాలి. అప్పటి నుంచి కంపెనీ 36 నెలలపాటు నెలకు రూ. 1,100 చొప్పున ఇస్తామని చెప్పి పన్ను మినహాయింపుల తర్వాత రూ. 825 కొంతకాలం చెల్లిస్తుంది. ఈ సభ్యుడికి ఓ గుర్తింపు నంబర్ ఇచ్చి మరో రూ.9 వేల విలువైన ఈ-స్టోర్ ఉత్పత్తులను కొనేలా చేస్తుంది. అందుకు ప్రతిగా కొంతకాలం సభ్యుడికి చెల్లింపులు చేసి ఆపై బోర్డు తిప్పేస్తుంది. ఇక సూపర్ మార్కెట్ స్కీమ్‌లో పెట్టుబడి భారీగా ఉంటుంది. ఒక్కో వ్యక్తి రూ. 25 లక్షల చొప్పున చెల్లించి సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసుకోవాలి. దీనికి అద్దె, మౌలికవసతులు, ఉద్యోగులను తామే ఏర్పాటు చేస్తామని కంపెనీ నమ్మబలుకుతుంది.

వందల మంది నుంచి రూ. కోట్లు..

ఈ సంస్థ స్కీముల్లో చేరి దేశవ్యాప్తంగా అనేక మంది రూ. వందల కోట్లు నష్టపోయారు. ఇప్పటివరకు రూ. 1000 కోట్ల దందా చేసిన ఈ-స్టోర్ ఇండియా 300 మందిని ముంచింది. వారిలో రాష్ట్రానికి చెందిన 44 మంది కూడా ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న సీసీఎస్ పోలీసులు 9 మందిని నిందితులుగా గుర్తించి మనీష్, అజ్మల్ సజ్జద్‌లను అరెస్టు చేశారు.

రూ.2 వేల వాచీ.. రూ.59 వేలకు విక్రయం!

విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ముసుగులో క్యూ-నెట్ సంస్థ దందా

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో ఈ ఏడాది మార్చిలో జరిగిన అగ్నిప్రమాదం క్యూ-నెట్ మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం) సంస్థ అక్రమ దందాను మరోసారి తెరపైకి తెచ్చింది. ఆ దుర్ఘటనలో చనిపోయిన ఆరుగురూ దీని ఉద్యోగులే. ఈ ఘటనపై నమోదైన కేసులను దర్యాప్తు చేసిన హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) అధికారులు.. ఈ సంస్థ సౌత్ ఇండియా ఆపరేషన్స్ హెడ్ గుమ్మడిల్లి రాజేశ్ అలియాస్ రాజేశ్ ఖన్నాను బెంగళూరులో అరెస్టు చేశారు. ఈ సంస్థ ఎంఎల్ఎం పేరిట తక్కువ ఖరీదైన వస్తువులను అత్యంత ఎక్కువ రేటుకు అమ్ముతోందని.. రూ.2 వేల వాచీని రూ.59 వేలకు విక్రయించినట్టు ఆధారాలు సేకరించామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

కేసులు నమోదవడంతో పేరు మార్చి..

హాంకాంగ్ కేంద్రంగా ఎంఎల్ఎం దందా చేస్తున్న క్యూ-నెట్‌పై అనేక కేసులు నమోదవడంతో.. విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్, 'వీ-ఎంపైర్' పేర్లతో మళ్లీ దందా ప్రారంభించింది. ఈ సంస్థలో టెలీకాలర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ప్రమోటర్స్, టీమ్ లీడర్లుగా చాలామంది పనిచేస్తున్నారు. స్వప్నలోక్ కాంప్లెక్స్ ఐదో అంతస్తులోని ఫ్లాట్ నంబర్ 511లో దీని కార్యాలయం ఉంది. రాజేశ్ ఖన్నా, ఉపేందర్‌రెడ్డి, శివనాగ మల్లయ్య, కటకం మల్లేశ్, నాగమణి సహా 12 మంది కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి నెలా కనీసం రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు సంపాదించవచ్చంటూ ఎరవేయడం.. ఇప్పటికే 'వీ-ఎంపైర్'లో చేరినవారు నెలకు రూ.50వేల నుంచి రూ.1.5లక్షల దాకా సంపాదిస్తున్నారని అమాయకులకు ఎర వేస్తున్నారు.

మూడు కోట్లు వసూలు చేసి..

దీనిపై దర్యాప్తు చేసిన పోలీసు బృందం.. ఇప్పటివరకు హైదరాబాద్‌లోనే 159 మంది బాధితుల నుంచి రూ.3 కోట్ల వరకు వసూలు చేసినట్టు గుర్తించింది. దేశవ్యాప్తంగా ఇంకా ఎంతో మంది బాధితులు ఉంటారని పోలీసులు తెలిపారు. రాజేశ్ ఖన్నా వద్ద లభించిన 35 బ్యాంకు ఖాతాల్లోని రూ.54 కోట్ల నగదును ఫ్రీజ్ చేశామని.. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని వెల్లడించారు.

మా బెల్ట్ షాపులోనే తాగాలి!

వేరే దుకాణంలో తాగితే రూ.5వేల జరిమానా వేస్తాం



గానుగపాడులో చాటింపు వేస్తున్న వ్యక్తి

చండ్రుగొండ: మద్యం బెల్ట్‌షాపు నిర్వహణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలంలోని గానుగపాడు గ్రామంలో వివాదాన్ని రేపింది. రెండేళ్లుగా ఈ గ్రామంలో బెల్ట్‌షాపును వేలంపాట ద్వారా చేపడుతున్నారు. రెండు నెలల క్రితం నిర్వహించిన వేలంలో ఓ వ్యక్తి రూ.3 లక్షలకు పాడాడు. ఆ డబ్బును గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తుండగా, గ్రామంలోని మరో సామాజికవర్గం వారు చర్చి అభివృద్ధికి డబ్బు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై రెండు వర్గాల మధ్య వివాదం మొదలుకాగా, రెండు రోజుల క్రితం ఇంకో బెల్ట్‌షాపు ఏర్పాటుకు వేలం నిర్వహించారు. ఇలా రెండు షాపులు ఏర్పాటు కావడంతో తమషాపులోనే మద్యం తాగాలని గ్రామంలో రెండు వర్గాలూ చాటింపు వేయించాయి. ఇంతలోనే మొదటి షాపు నిర్వాహకులు ఓ అడుగు ముందుకేసి కొత్త షాపులో మద్యం తీసుకున్నట్లు తెలిస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని ప్రకటించారు. దీంతో ఎక్కడ మద్యం తాగాలో మందుబాబులకు అర్థం కాకపోగా.. వివాదం జఠిలమవుతోంది.

సృజనాత్మకత కేంద్రంగా హైదరాబాద్

- విద్యార్థులతో భారత్-యూకే మధ్య సంబంధాలు బలోపేతం: యూకే మంత్రి లార్డ్ అహ్మద్
- భారత సంతతి నేతలతో ఇరు దేశాలకూ ప్రయోజనమని వెల్లడి



చార్మినార్ వద్ద యూకే మంత్రి లార్డ్ అహ్మద్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరం ఆధునికత, వైవిధ్యత, చరిత్ర, టెక్నాలజీ, యువత.. ఇలా అన్నింటి మేలి మేళవింపు అని యునైటెడ్ కింగ్‌డమ్ మంత్రి (మిడిల్‌ఈస్ట్, సౌత్ ఆసియా, నార్త్ ఆఫ్రికా, యూఎన్, కామన్వెల్త్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్), భారత సంతతికి చెందిన లార్డ్ అహ్మద్ అన్నారు. ఇక్కడి టీ-హబ్, టీ-వర్క్స్, దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్‌లను సందర్శించామని.. ఇక్కడి యువతలోని సృజనాత్మకత తననెంతో ఆకట్టుకుందని చెప్పారు. భారత పర్యటనలో భాగంగా మంగళవారం హైదరాబాద్ వచ్చిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 'కోవిడ్ తర్వాత యూకేకు వస్తున్న భారత విద్యార్థుల సంఖ్య పెరిగింది. అక్కడ చదువు పూర్తయ్యాక రెండేళ్లపాటు ఉద్యోగం చేసే అవకాశం కల్పించాం. భారత్-యూకే మధ్య సంబంధాలు బలపడేందుకు విద్యార్థులు వారధిగా నిలుస్తున్నారు..' అని లార్డ్ అహ్మద్ చెప్పారు.

భారత సంతతి నేతలతో ఇరుదేశాలకూ ప్రయోజనం

భారత్ సహా అనేక దేశాల వారికి యూకే అన్ని రకాల అవకాశాలను ఇచ్చిందని.. అక్కడ భారత సంతతి రాజకీయ నేతలు సాధించిన విజయాలు సామాన్యమేమీ కాదని పేర్కొన్నారు. యూకే ప్రధానమంత్రి స్థాయికి భారత సంతతి వ్యక్తి ఒకరు ఎదుగుతారని గతంలో ఎవరూ ఊహించలేదన్నారు. భారత సంతతి నేతల వల్ల యూకేకు మాత్రమే కాకుండా.. భారత్‌కూ ఎన్నో ప్రయోజనాలు చేకూరాయని చెప్పారు. కోవిడ్ సమయంలో మందులు అవసరమైనప్పుడు భారత్ సహకరిస్తే, ఆక్సిజన్ సంక్షోభంలో యూకే తన వంతు సాయం చేసిందని.. టీకా పరిశోధనలకు ఆక్స్‌ఫర్డ్ కేంద్రంగా నిలిస్తే, తయారీకి భారత్ ముందుకొచ్చిందని వివరించారు. ఇలా ఇరుదేశాల మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో మరింత దృఢమవుతున్నాయని చెప్పారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.